ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక



కొత్తగవర్నర్ జనరలు
శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచారిగారు

30-6-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు

ప్రథమ భారతీయ గవర్నరు జనరలు







గవర్నర్ జనరల్ పదవీస్వీకారానికై జూన్ 21 వ తేదీన న్యూఢిల్లీవద్ద పలాంవిమానాశ్రయంలో దిగిన రాజాజీ, భారత ప్రధాని నెహ్రూ, జగ్జీవన్‌రాం, రాజకుమారి అమృతకౌర్, కె. సి. నియోగి ప్రభృతులు విమానాశ్రయంనుంచి వెలుపలికి వస్తున్నారు. రాజాజీ రాక సందర్భమున జరుగుతున్న గౌరవ విన్యాసం.

← విమానం దిగుతూనే ప్రజాభినందనలను అందుకొంటున్న రాజగోపాలాచారిగారు.




సి. ఆర్. జూన్ 20 వ తేదీ సాయంత్రం ఢిల్లీ చేరకపూర్వం చిన్నవాన కురిసింది. వానలో తడుస్తూ రాజాజీ రాకకై నిరీక్షిస్తున్న ప్రధాని నెహ్రూ, మౌలానా అజాద్, రాజేన్‌బాబు, డా॥ శ్యామప్రసాద్ ముఖర్జీ, కె. ఎం. మున్షీ ప్రభృతులు.





మార్కొనైట్ ఇన్స్ట్రుమెంట్ తరపున సర్దార్ హర్దిత్ సింగ్ మాలిక్ (కెనడాలో ఇండియా హైకమిషనర్) గారు "మహారాష్ట్రఖడ్గాన్ని", కల్నల్ రిచర్డ్సన్, (కింగ్స్ [illegible]



[illegible] బొంబాయి [illegible] గౌ॥ శ్రీమతి రాజకుమారి అమృతకౌర్‌కు బరోడా ప్రధాని డా॥ జీవరాజ్ మెహతాగారు విల్లింగ్డన్‌క్లబ్, బొంబాయిలో, విందుచేసినప్పటి దృశ్యం—(ఎడమ [illegible]

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 40

సంచిక 42

Founder: K. NAGESWARA RAO.

సర్వధారి సంవత్సర జ్యేష్ఠ బహుళ అష్టమి బుధవారము



రాజాజీ పదవీస్వీకరణ

[భారతప్రభుత్వ గవర్నర్ జనరల్‌గా శ్రీమాన్ రాజగోపాలాచారిగారు ప్రమాణవచనం స్వీకరిస్తున్న దృశ్యం.]



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ జూన్ నెల 30-వ తేదీ బుధవారము

మాజీప్రధాని విన్‌స్టన్‌చర్చిల్ విలాపము

రెండు సంవత్సరముల క్రితం బ్రిటిష్ కన్సర్వేటివ్ పక్ష వార్షిక సమావేశములో, బ్రహ్మాండమైన బ్రిటిష్ సామ్రాజ్యనౌక మునిగిపోవుచున్నదని ఘోషించిన బ్రిటిష్ మాజీప్రధాని విన్‌స్టన్ చర్చిల్, తిరిగి ఇప్పుడు అనేక దశాబ్దములుగ కష్టించి తూర్పుప్రపంచమున తాము కట్టిన సామ్రాజ్య సౌధము శిథిలమైపోయినదని విలపించుచు, నేటి ప్రపంచదుస్థితికి బ్రిటిష్ సామ్రాజ్య విచ్ఛిత్తే కారణమని వాదించుటలో, ఆశ్చర్యపడవలసిన దేమియు లేదు. హైదరాబాదు నవాబుగారికి హిందువులు, ముస్లిములు నేత్రద్వయమైనట్లు బ్రిటిష్ కన్సర్వేటివ్ పక్షనాయకుడు విన్‌స్టన్ చర్చిల్‌కు బ్రిటిష్ సామ్రాజ్యము, బ్రిటిష్ కామన్వెల్తు, రెండు నేత్రములుగ నుండుండెను. యుద్ధకాలమున బ్రిటిష్ సామ్రాజ్యమును, శాంతికాలమున బ్రిటిష్ కామన్వెల్తును, స్వకీయ అపేక్షల సిద్ధికి వినియోగించుకొనుటకు అలవడి, వలస విధానము వలన, సామ్రాజ్య వ్యాపారమువలన విపరీతధనార్జన కలవడిన బ్రిటిష్ కన్సర్వేటివ్‌లకు, ప్రస్తుతస్థితి విషాదకరముగ నుండకతప్పదు

ఐర్లెండ్ బ్రిటిష్ కామన్వెల్తునుండ సమ్మతించినను, బ్రిటిష్ అధినివేశముగ నుండ నిరాకరించినది. కెనడా, ఆస్ట్రేలియాలు అధినివేశములుగ నుంటున్నను బ్రిటిష్ కామన్వెల్తును అంతగ పాటించకనె అమెరికాతో సన్నిహిత సంబంధమును ఏర్పరచుకొనుచున్నవి. దక్షిణాఫ్రికా ఏక్షణములో కామన్వెల్తునుండి తప్పుకొనునో యని ఆందోళనతో విచారించుచుండిరి. బర్మా అధినివేశ ప్రతిపత్తిని అంగీకరింపలేదు. నూత్నముగ సామ్రాజ్య బంధముల నుండి విముక్తిపొందిన సింహళ పాకిస్థాన్ భారతదేశములే ఇప్పటికి బ్రిటన్‌తో తమ సంబంధములు ముందుముందు ఎట్లుండవలెనను విషయమును ఇకను నిర్ణయించుకొనవలసియున్నవి.

ఈ పరిస్థితులలో ఈ బ్రిటిష్ కన్సర్వేటివ్ నాయకునకు ఐర్లెండ్, దక్షిణాఫ్రికాలుగాని, కెనడా, ఆస్ట్రేలియాలుగాని బర్మా, పాకిస్థాన్‌లుగాని స్ఫురణకు వచ్చియుండలేదు. భారతదేశము, నెహ్రూ హిందూ ప్రభుత్వము, కాశ్మీరు, హైదరాబాదు సంస్థానములు మాత్రమే పెనుభూతములవలె ప్రత్యక్షమైనట్లు కన్పించెను. కాశ్మీర్‌లో నూరిట ఎనభైనుంచి ముస్లిములని, అట్టి సంస్థానముపై నెహ్రూ హిందూ ప్రభుత్వము దౌర్జన్యచర్యలు జరుపుచున్నదని ఘోషిల్లిన చర్చిల్‌కు హైదరాబాదు సంస్థానము ప్రసక్తి వచ్చుసరికి ఆ సంస్థాన ప్రాచీనత స్ఫురణకు వచ్చెనేగాని, అందు నూరింట ఎనభైఎనిమిదిమంది హిందువులన్న సంగతి వారికి అవగాహన కాలేదు!

బ్లాక్‌పూల్‌లో 1946 వ సంవత్సరమున జరిగిన కన్సర్వేటివ్ వార్షిక సమావేశములో, డగ్లస్ రీడ్ మార్పుచెందిన పరిస్థితులలో, కన్సర్వేటివ్‌లు అవలంబించవలసిన వైఖరిని విస్పష్టము చేసియుండిరి బ్రిటిష్ కన్సర్వేటివ్‌లన్న భారతీయులకు పరమ అసహ్యమని, వారిపై విపరీతమైన ద్వేష మేర్పడినదని వారు ఆ సమావేశమున కన్సర్వేటివ్‌లకు నచ్చజెప్ప ప్రయత్నించిరి బ్రిటన్ భారతదేశమునకు 100 కోట్ల పౌనులు బాకీ ఉన్నదను విషయమును విస్మరింపరాదని కూడ వారు హెచ్చరించిరి. కాని ఆ సమావేశమునందు కన్సర్వేటివ్ నాయకులు చర్చిల్, బట్లర్ ఎల్ వింటర్టన్ ప్రభృతులు, భారతదేశమున మత వైషమ్యములను, అంతఃకలహములను ప్రోత్సహించు ప్రసంగముల చేసియుండిరి. భారతదేశమునందలి ప్రతిఘాతిశక్తులకు వారు అప్పుడొసగిన ప్రోత్సాహఫలితములకే భారతప్రజలు ఇంతవరకు అనుభవించుచుండిరి.

గత రెండు సంవత్సరములలో భారతదేశమున ప్రజ్వరిల్లిన సంక్షోభమునకు బ్రిటిషు కార్మిక ప్రభుత్వ ఉపసంహారముగాని, భారతీయుల అధికార స్వీకారముగాని కారణములు కావు. కన్సర్వేటివ్ నాయకుల బ్లాక్‌పూల్ ప్రసంగముల ఖండించుచు 1946 అక్టోబరు 6 వ తేదీన తాత్కాలిక ప్రభుత్వ ప్రధాని పండిట్ నెహ్రూ ఇట్లు ప్రకటించియుండెను : భారత తాత్కాలిక ప్రభుత్వము యెడల కన్సర్వేటివ్ పక్షమునకు చెందిన ప్రముఖనాయకులు పగబూనినట్లు శత్రుత్వవైఖరిని అవలంబించుచున్నట్లు బ్లాక్‌పూల్ ప్రసంగములు స్పష్టము చేయుచున్నవి. ఈ ప్రసంగములు విద్వేషపూరితముగను, బాధ్యతా విరహితముగను, దేశమున అంతఃకలహముల ప్రోత్సహించుటకు, స్థిరమైన ప్రభుత్వస్థాపనమును నివారించుటకు ఉద్దేశింపబడినట్లును కన్పించుచున్నది." 1946 అక్టోబరునుండి నేటి వరకును జరిగిన సంఘటనలు పండిట్ నెహ్రూవిమర్శ నిర్హేతుకము గాదని స్పష్టము చేయుచున్నవి.

యుద్ధకాలమున, తాను అధికారమునందున్నంత వరకు సామ్రాజ్యవిచ్ఛిత్తిని శాయశక్తుల నివారింప కలిగెను. వారి ఆ కార్యకలాపము, రాజకీయ విధానము యుద్ధానంతర పరిస్థితులకు తగియుండలేదు గనుకనే వారు పదచ్యుతులగుట ఆ "గొప్ప సామ్రాజ్య సౌధము" శిథిలమగుట జరిగినది. కాలవాహినికి ఎదురీదుట ఎంతటి శక్తిమంతునకును సాధ్యము గాదు. 1917-21 సంవత్సరముల మధ్య మిత్రరాజ్యముల సైనికబలమునంతను సంఘటితపరచి సోవియట్ ప్రభుత్వమును నిర్మూలించుటకు బ్రిటిషు యుద్ధ కార్యదర్శిగ వీరు చేసిన ప్రయత్నములు ఎంత ఫలించినవో ఇప్పుడు భారతదేశము విషయమునను అంతే ఫలింపగలవు.

1947 సెప్టెంబరులో చర్చిల్ చేసిన ప్రసంగముపై వ్యాఖ్యానించుచు గాంధిజీ "తన దేశమునకు అమోఘమైన సేవ చేసియుండిన వీరు ఇప్పుడిట్టి ప్రసంగములను చేయుటవలన మహాపకారమును చేసినవారగుచుండిరి" అని స్పష్టము చేసిరి. ఇప్పటికిని బ్రిటన్, ఇతర పాశ్చాత్య దేశాలకూ రష్యాకు ఒకరిపై ఒకరికి విశ్వాసము కలుగకుండుటకు చర్చిల్ ప్రభృతులు రెండు దశాబ్దముల క్రితము అనుసరించిన "సాయుధ ప్రమేయ" విధానమే కారణము. బ్రిటిషు సామ్రాజ్య మీవిధముగ విచ్ఛిన్నమగుటకును వీరి సామ్రాజ్య విధానమే కారణము. ఇప్పుడింక వారు బ్రిటిషు కామన్వెల్తు విచ్ఛిత్తికి పాటుపడుచున్నారు. బ్రిటన్‌తో భారతదేశ భవిష్యత్సంబంధముల నిర్ణయించుకొనవలసిన ఈ సమయమున, చర్చిల్ ప్రసంగము భారతీయులు సరియైన నిర్ణయమునకు వచ్చుటకు తోడ్పడగలదు.

గవర్నర్ జనరల్ విధులు

లార్డ్ మౌంట్‌బాటన్ గవర్నరు జనరల్ పదవినుండి విరమించుచు, తన అనంతరము ఆపదవిని అలంకరించు చక్రవర్తి రాజగోపాలాచారిగారు అత్యంత సమర్థుడని, ప్రస్తుత పరిస్థితులలో ఆపదవికి అన్నివిధాలా అర్హుడు ఆయనేనని చెప్పెను. ప్రపంచము నలుమూలల నుండి వీరికి అభినందన సందేశములు వర్షపాతమువలె వచ్చినవి. రాజగోపాలాచారిగారి సామర్థ్యమును గురించిగాని, ప్రతిభా విషయమును గురించిగాని ఎవ్వరికిని ఎట్టి సందేహము లేదు. కాని కేవలం ఆచరణప్రాయమైన ఈ గవర్నరు జనరల్ పదవికి అంతటి సమర్థత, అంతటి ప్రతిభా విశేషములు అవసరమా ?

వారివి అధికారనిర్వహణముతో ప్రత్యక్ష సంబంధములేని ఈ పదవినందుంచుటవలన పరిపాలనానుభవము వృథాయగుట లేదా యను ప్రశ్న కలుగక మానదు. గవర్నరుజనరల్ హోదా, అధికారమును గురించి మాట్లాడుతు, మహాత్ముడు "అది కేవలము లాంఛనప్రాయమైనది" అని చెప్పిరి. లార్డ్ మౌంట్‌బాటన్ ఫిలిప్ మౌంట్‌బాటన్ వివాహమునకు వెళ్లవలసినపుడు ముందుగ వారు తమ మంత్రివర్గ అనుమతిని పొందవలసినవారైరి అని కూడ గాంధిజీ తమ వాదమునకు ఆధారముగ పేర్కొనియుండిరి. తన వీడ్కోలు సందర్భమున జరిపిన ఒక సభలో ఉపన్యసించుచు, మామూలుగ ఏ విషయమైన, ఏ సందర్భములోనైన ఎట్టి ప్రసంగము చేయవలసి యున్నను, ముందుగ తన మంత్రివర్గము ఆ ప్రసంగమును ఆమోదింపవలసి యుండునని తెలిపిరి. వీటన్నింటివలన గవర్నర్ జనరల్ పదవికి ఘనతయెగాని, స్వాతంత్ర్యము తక్కువ అనిస్పష్టము కాగలదు.

రాజగోపాలాచారిగారు గవర్నరు జనరల్‌గ ఎన్నికై, పదవీ స్వీకారమునకు పూర్వము భారతదేశము బ్రిటిష్ కామన్వెల్తు నందుండుటా, నిర్గమించుటాయను విషయము నిర్ణయించుకొనవలసినది భారతీయులేనని, అన్యుల ప్రమేయం ఉండరాదని హెచ్చరించిరి. ఇది వాస్తవముగ రాజ్యాంగ పరిషత్తుకు సంబంధించిన విషయము. ప్రస్తుత మంత్రివర్గ మీ విషయమై తన వైఖరిని స్పష్టము చేసియుండలేదు. అయినను రాజగోపాలాచారిగారు ముందుగనే దారి చేసిరి.

ఇదే విధముగ ప్రాంతీయతత్వములను, మతాభిమానములను, కుల విద్వేషములను ఒకే గుక్కలో విమర్శించిరి. వివిధ తెగలవారు నాలుగు వైపుల గోడలను నిర్మించుకొనక విస్తరించుటకు ప్రయత్నింపవలెననిరి ఇట్టి ప్రయత్నములను కొన్ని తెగలవారు చేయుటవలననె మిగతా తెగలవారు ఆత్మరక్షణ కిట్టి గోడలను నిర్మించుకొనవలసినవారగుచున్నారు.

భారతసమస్యల పూర్తిగ అవగాహన చేసుకొనిన రాజగోపాలాచారిగారు, వాటి పరిష్కారమునకె తమ ప్రతిభ నుపయోగించిన ఇట్టి తత్వములు వాటికవే అంతరించిపోగలవు.

నేటిప్రపంచం:

బర్లిన్ సమస్యపై ప్రపంచయుద్ధం సంభవమా?

తూర్పుపశ్చిమ జర్మనీలలో అగ్రరాజ్యాల కరెన్సీసంస్కరణల విషమ పరిణామం

జర్మనీ విచ్ఛిత్తి ఈవారం జరిగిన విపరీత సంఘటనలవల్ల సంపూర్ణ మైందని చెప్పడం కంటే, ఇదివరకే సమాప్తమైన విచ్ఛిత్తిని అగ్రరాజ్యాలు తమ విరుద్ధవిధానాలవల్ల క్రియారూపంలోకి దించడానికి ప్రారంభించిన వని చెప్పడమే సబబైన విషయం.

అగ్రరాజ్య ప్రాబల్య విస్తరణ కార్యక్రమంలో యూరప్‌ఖండం తూర్పుయూరప్, పశ్చిమయూరప్ అనే రెండు భాగాలుగా ఏనాడు చీలిపోయిందో బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా, రష్యాల ఆక్రమణ ఆధిపత్యాల కింద వున్న జర్మనీకి విచ్ఛిత్తి, సంపూర్ణ పతనావస్థ తప్పవని అనాడే తేలిపోయింది. తమ అధీనం కిందవున్న మూడు జర్మన్ భూభాగాలనూ ఏకంచేసి ఏకప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికీ, రూర్ పరగణాను అంతర్జాతీయ పరిపాలన కిందికి మార్చడానికీ బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలు ఈ మాసారంభంలో చేసిన నిర్ణయాల ఫలితంగానే జర్మనీ దుర్గతి ధృవపడింది.

జర్మనీ అంతటినీ కలిపి ఏకప్రభుత్వాధిపత్యం కింద వుంచడమే తమ లక్ష్యమని చెప్పినప్పటికీ జర్మనీని తలా ఒక భాగంగా పంచుకొని పరిపాలన నిర్వహిస్తున్న అగ్రరాజ్యాల మధ్య ఈ లక్ష్యసాధనలో ఏ ఒక్క అంశంమీదనైనా ఏకాభిప్రాయం కుదరడం ఆనాటి కానాడు అసంభవంగా పరిణమించింది.

ఈ విపరీత పరిణామం కారణంగానే పశ్చిమ జర్మనీలో బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు పరిపాలకులు, తూర్పుజర్మనీలో రష్యనులు ప్రత్యేక కరెన్సీ సంస్కరణలను ఈ వారం ప్రవేశపెట్టడం సంభవించింది. దీని ఫలితంగా నిన్న మొన్నటివరకూ ఏకఖండంగా వున్న జర్మనీ తూర్పుజర్మనీ, పశ్చిమజర్మనీ అని రెండు భిన్న రాజ్యాలుగా మారిపోయింది. పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం అన్నట్లు ఇటు సోవియెట్‌రష్యా, అటు బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలు వేస్తున్న ఎత్తు, ఎదురెత్తుల ఫలితంగా జర్మన్ ప్రజలు నానాదురవస్థలనూ ఎదుర్కోవలసివచ్చింది.

జర్మనీ అంతటికీ కలిపి ఒకే ఒక ద్రవ్య చలామణీ విధానాన్ని అమలుజరపడం అసంభవమైంది కాబట్టి పశ్చిమ జర్మనీలో జూన్ 20-వ తేదీనుంచీ మా కరెన్సీ విధానాన్ని మేము అనుసరిస్తున్నామని బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలు ప్రకటించినవి. బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికన్ ఆక్రమితభాగాలలో జర్మన్ ప్రజలు పాత రైష్ మార్కులను, పశ్చిమ జర్మనీలో ప్రవేశపెట్టిన కొత్త డాయిష్‌మార్కులకు మార్చుకోవడం 19-వ తేదీ అర్ధరాత్రినుంచే హడావిడిగా ప్రారంభించారు. పశ్చిమ జర్మనీలో చలామణిలోకి వచ్చిన కొత్త మార్కులు తమ తూర్పు జర్మనీలోకి ఎక్కడ వచ్చి పడతవోననే భయంతో రష్యనులు ముందుగానే తగిన బందోబస్తులన్నీ చేసి జాగ్రత్తపడ్డారు. తూర్పు పశ్చిమ జర్మనీలమధ్య రైల్లు రాకపోకలను, రవాణాలను, మామూలు ప్రయాణాలను ఆపివేసి సంబంధాలన్నిటినీ తెగతెంపులు చేసివేశారు. పాతమార్కులతో తూర్పుజర్మనీలో దొంగతనంగా వస్తుసామగ్రిని కొనడానికి వస్తున్న అనేక వందలమంది జర్మన్ పౌరులను అరెస్టు చేయడం కూడా సంభవించింది.

పశ్చిమజర్మనీలో బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలు కరెన్సీ సంస్కరణలను ప్రవేశపెట్టిన నాల్గురోజులకే రష్యన్ అధికారులు కూడా తూర్పుజర్మనీలో తమకు తోచిన సంస్కరణలను తామూ ప్రవేశపెట్టి తూర్పు, పశ్చిమ జర్మనీ విభజనను స్థిరపరిచారు.

* * * *

ఇది కేవలం తూర్పు, పశ్చిమ జర్మనీలకు సంబంధించిన సమస్యమాత్రమే అయితే ఇంత పెద్ద రగడగా పరిణమించి వుండేది కాదేమో. మిగతా జర్మనీ అంతటినీ విభజించినట్లే, జర్మనీ రాజధాని బర్లిన్ నగరాన్ని కూడా బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా, రష్యాలు నాల్గు భాగాలుగా పంచుకొని పరిపాలన చేస్తున్నందువల్ల ఈ చిక్కు మరీ క్లిష్టతరమైంది. బర్లిన్ చుట్టూ రష్యన్ భూభాగం వున్నప్పటికీ నగరంపై నాల్గు అగ్రరాజ్య ప్రతినిధుల పరిపాలన సాగుతున్నది. బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలు పశ్చిమ జర్మనీతోపాటు తమ అధీనంలోవున్న బర్లిన్ భాగాలలో కూడా ద్రవ్యచలామణీ సంస్కరణలను అమలుజరపడానికి పూనుకున్నవి. ఒకే నగరంలో రెండురకాల కరెన్సీని చలామణి చేయడానికి పూనుకునేసరికి ఈ సమస్య కేవలం ద్రవ్యచలామణి సమస్యగా మాత్రమే వుండక, పశ్చిమమిత్రరాజ్యాలకు, రష్యాకుమధ్య అతిక్లిష్టమైన రాజకీయ సమస్యగా మారిపోయింది.

తూర్పుజర్మనీ రష్యన్ మిలిటరీ గవర్నర్ మార్షల్ సొకొలవిస్కీ, పశ్చిమ రాజ్యాలు తెచ్చిపెట్టిన ద్రవ్యచలామణి సంఘర్షణ ఫలితంగా బెర్లిన్‌లో నాల్గు అగ్రరాజ్యాల పాలక సంఘం (కొ-మాండాటురా) ఇక అమలులో లేనట్లే లెక్క అని ఖండితంగా ప్రకటించాడు.

తూర్పుజర్మనీనుంచి పశ్చిమజర్మనీకి, పశ్చిమ బెర్లిన్‌కు పోయే విశ్యచ్ఛక్తి సప్లయిని, ఆహార పదార్థాలను, బొగ్గును ఇతరతర పదార్థాలను రష్యనులు పూర్తిగా ఆపివేశారు. వాల్గు మాసాల క్రితం రష్యన్ ప్రతినిధులు సమావేశంనుంచి నిష్క్రమించినప్పుడే, బర్లిన్ పాలకవర్గ భవిష్యత్తు తేలిపోయి, అది ఇక సక్యంగా పనిచేయడం అసంభవమనీ, అగ్రరాజ్యాల మధ్య బర్లిన్ పరిపాలన విషయంలో ఏకీభావం కుదరదనీ స్పష్టపడింది. సోవియెట్ సేనాని సొకొలవిస్కీ మొన్న చేసిన ప్రకటనతో దాని నిష్ప్రయోజనం ప్రపంచానికి మరొకసారి స్థిరపడింది. కనీసం బర్లిన్‌నగర ద్రవ్యచలామణి విషయంలోనైనా ఏకపంథాను అనుసరించడం ఉచితమని బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి, రష్యన్ ప్రతినిధులు ఆఖరుక్షణంలో జరిపిన సమిష్టి సమాలోచనలు విఫలంకావడంతో, నాలుగు అగ్రరాజ్యాల పాలనకింద జర్మనీకి ముక్తి, మోక్షం లేదని ఋజువైంది.

నిత్యావసర పదార్థాల రవాణాలను నిలిపివేసినట్లయితే ప్రజలు అపరిమితమైన ఇబ్బంది పడతారనీ, ఇతరత్రా సప్లయిలు వచ్చే ఏర్పాట్లేమీలేక బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికన్ అధికారులు బెర్లిన్‌నుంచి ఖాళీచేస్తారనీ, అప్పుడు బెర్లిన్ అంతటికీ ఏకంగా తమ కరెన్సీ విధానాన్నే వర్తింపజేయవచ్చుననీ రష్యనుల అభిప్రాయం. పశ్చిమబెర్లిన్‌కు విద్యుచ్ఛక్తి సరఫరాను ఆపివేయడంతో అక్కడి ప్రజల పారిశ్రామికగృహజీవితం స్తంభించిపోగల ప్రమాదం ఏర్పడినమాట వాస్తవమే. పశ్చిమ బెర్లిన్‌లో వున్న ఆహారపదార్థాలు మెుదలైనవి అతి పొదుపుగా వాడుకొంటే మహాఅయితే ఒక నెల రోజులు సరిపోవచ్చు.

తమను బెర్లిన్‌నుంచి తరిమివేయడానికి రష్యనులు తెస్తున్న ఒత్తిడికి విరుగుడుకోసం బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా ప్రభుత్వాల ప్రతినిధులు బెర్లిన్, లండన్, వాషింగ్టన్ నగరాలలో దీర్ఘ సమాలోచనలు జరుపుతున్నారు. పశ్చిమ ప్రజాస్వామ్యరాజ్యాలు రష్యాతో వ్యాపార ఆర్థిక సంబంధాలను తెగతెంపులు చేసుకొని దానిపై ఆర్థిక ఆంక్షలను ప్రయోగించినా ప్రయోగించవచ్చు.

* * * *

పశ్చిమ జర్మనీ విషయమై బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, బెల్జియం, హాలెండు, లక్జెంబర్గ్ దేశాలు ఆరూ లండన్‌లో ఒడంబడిక చేసుకున్న మూడువారాలకే తూర్పు యూరప్‌కు చెందిన రష్యా, పోలెండు, జెకొస్లొవేకియా, యుగొస్లావియా, రుమేనియా, హంగెరీ అల్బేనియా, దేశాలు ఎనిమిదీ వార్సా సమావంలో ఈ వారారంభాన సమావేశమై జర్మనీ భవిష్యత్తును గురించే చర్చించినవి. పశ్చిమ రాజ్యాలు లండన్ సభలో చేసిన నిర్ణయాలపై చర్చలు జరిపినవి. పై ఎనిమిది తూర్పుయూరప్ దేశాల విదేశాంగ మంత్రులు మొలటొవ్ అధ్యక్షతన సమావేశమై జర్మనీ భవిష్యత్తును నిర్ణయించడంలో అగ్రరాజ్యాలు పాట్స్‌డాం నిర్ణయాలను అమలు జరపవలెననీ, జర్మనీలో సైనికోద్వాసనకు, సైనికశక్తి విచ్ఛిత్తికి బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, రష్యాలు పాతనిర్ణయాల ప్రకారం కృషి చేయాలనీ, జర్మనీ పారిశ్రామిక కేంద్రమైన రూర్ మండలాన్ని అగ్రరాజ్య చతుష్టయ ఆధిపత్యం కిందికి తేవాలనీ, ప్రజాసంస్థలకు, ప్రజాస్వామ్య పక్షాలకు చెందిన ప్రతినిధులతో జర్మనీ అంతటికీ ఒకేఒక తాత్కాలిక కేంద్రప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలనీ, పాట్స్‌డాం నిర్ణయాలను అనుసరించి జర్మనీనుంచి ఒక సంవత్సరంలోపుగా ఆక్రమణసేనల ఉపసంహారం జరిగేటట్లు జర్మనీతో శాంతి ఒడంబడిక చేసుకోవాలనీ తీర్మానించారు. రష్యా దాని ఉపగ్రహ రాజ్యాలుచేసిన ఈ నిర్ణయాలు పశ్చిమరాజ్యాలు లండన్‌లో పశ్చిమజర్మనీ విషయమైచేసిన నిర్ణయాలకు ప్రతిగా తయారుచేసినవి మాత్రమేనని వేరే చెప్పనవసరంలేదు. ఉభయులూ 1945 లో జరిగిన పాట్స్‌డాం షరతులను పాటించాలని వాదిస్తారేగాని, ఆచరణలో ఒక్కరూ అందులో ఒక్క షరతునూ అనుసరించరు. ఏదిఏమైనప్పటికీ, ఈవారం ఉభయకక్షిదారులు ప్రవేశపెట్టిన ద్రవ్య చలామణీ సంస్కరణలతో ఆర్థికంగా, రాజకీయంగా జర్మనీ రెండుముక్కలైపోయింది. జర్మనీగతి ఇక దుర్గతేనా, లేక ఏదైనా పరిష్కారమార్గం వున్నదా అని సందేహపడవలసివస్తున్నది.

ద్వితీయ మహాసంగ్రామానికి పూర్వం 1938 లో ఏ ప్రమాదపరిస్థితులు ఏర్పడినవో ఇప్పుడూ సరిగా అవే ప్రమాదపరిస్థితులు ఏర్పడినవి. ప్రపంచాన్ని మరొక ఘోరసంక్షోభంనుంచి తప్పించేమార్గం లేనట్లేనా? జర్మనీ భవిష్యత్తు విషయమై ఐక్యరాజ్యసమితి ఎందుకు ఇదమిత్థమని ఒక కార్యక్రమాన్ని అనుసరించకూడదు?

ఇక ఎన్నాళ్ళు జర్మనీని అగ్రరాజ్యాల వివాదాలకు విభేదాలకు క్రీడారంగంగా, సంఘర్షణ కేంద్రంగా వుంచవలసివున్నదే ప్రశ్న. ప్రపంచశాంతిస్థాపనార్థం ఏర్పడి తృతీయ వార్షికోత్సవాన్ని మొన్న 26-వ తేదీన జరుపుకొన్న ఐక్యరాజ్యసమితి ఈ సమస్యను సత్వరమే పరిష్కరించడానికి పూనుకోవాలి. జర్మనీపై అగ్రరాజ్యాల ఆధిపత్యం ఎంత త్వరగా తొలగిపోతే, జర్మన్ ప్రజలకే గాక, ప్రపంచశాంతికికూడా అంత మంచిది. కాని, చీటికీమాటికీ వీటో అధికార ప్రయోగానికి దిగి, అడ్డుపడే అగ్రరాజ్యాలు ఐక్యరాజ్యసమితి నిర్ణయాలను ఎంతవరకు పాటిస్తవన్నది కూడా సందేహాస్పదమైన విషయమే. ఏది ఏమైనప్పటికీ, జర్మనీ సమస్యా పరిష్కారంద్వారా సమితి తన భవిష్యత్తునుకూడా తేల్చుకొని, తన ప్రయోజనాన్ని సామర్థ్యాన్ని సార్థకం చేసుకోవలసిన సమయం ఆసన్నమైంది. లేకపోతే, జర్మనీ నడిగడ్డమీద మరొక భయంకర సంగ్రామజ్వాలలు ప్రజ్వలించే ప్రమాదం ప్రపంచాన్ని ఎదుర్కొంటుంది.

* * *


పాలస్తీనాలో యుద్ధవిరమణ నామమాత్రంగానే పరిణమించింది. దక్షిణ పాలస్తీనాలో యూదునివాసప్రాంతమైన నెగెబ్‌కు మధ్యవర్తి కౌంట్ బెర్నాడోట్ ఆజ్ఞాయిషీకింద రవాణా అవుతున్న యూదు ఆహారపదార్థాల వాహనాలపై ఈజిప్టు సైనికులు దాడిచేసి యుద్ధవిరమణ షరతులను ఉల్లంఘించారు. మరికొన్ని యూదు నివాసాలపై ఈజిప్టు విమానాలు దాడులు జరపడమేగాక, దక్షిణ పాలస్తీనాలో దిగుతున్న ఐక్యరాజ్యసమితి విమానంపైకూడా ఈజిప్షన్ స్పిట్‌ఫైర్ విమానాలు వరసవరసగా 15 సార్లు ఫిరంగి కాల్పులు సాగించినవి. అది ఐక్యరాజ్యసమితి నియమించిన యుద్ధవిరమణ పరిశీలకుడు ప్రయాణం చేస్తున్న విమానం. యుద్ధవిరమణ ఉత్తర్వులను ఈజిప్టు ఈ విధంగా బాహాటంగా ధిక్కరించిందని మధ్యవర్తి కౌంట్ బెర్నాడోట్ ఐక్యరాజ్యసమితికి వర్తమానం పంపడమేగాక, ఈజిప్టుకు తక్షణమే అధిక్షేపణను సైతం పంపించాడు. ఈజిప్టు ప్రభుత్వం అత్యవసర సమావేశాన్ని జరిపి, ఆ విమానం యూదు విమాన మనుకొని పొరపాటున కాల్పులు సాగించడమైనదని జవాబు చెప్పింది. యూదు విమానాలకు, ఈ పరిశీలకుడి విమానానికి ఓపినంత వ్యత్యాసం వున్నందున ఆ విధంగా పొరపాటు పడడానికే వీల్లేదు. ఈజిప్టు సమాధానం మధ్యవర్తికి సంతృప్తి కలిగించి వుండదు.

అరబ్ రాజ్యసమితి తరఫున దాని అధ్యక్షుడు సిరియా ప్రధాని జమిల్ మర్దాం బే, యూదు రాజ్యంతో అమెరికా రాజకీయ సంబంధాలు ఏర్పాటుచేసుకున్నందుకు ఆక్షేపణను తెలియజేశాడు.

ఈ పరిస్థితులలో రోడ్స్ దీవిలో యూదు అరబ్ ప్రముఖులను చేరదీసి పాలస్తీనా సమస్యా పరిష్కారానికి స్థిరవిధానాన్ని సాధించడానికై కౌంట్ బెర్నాడోట్ చేసే ప్రయత్నాలు ఎంతవరకు ఫలించగలవన్నది సందేహాస్పదమైన విషయం. యుద్ధవిరమణ గడువు పూర్తికాగానే, జూలై 10-వ తేదీనాటికి యూదు అరబ్‌వర్గాల మధ్య తిరిగి పెద్దపెట్టున సంఘర్షణ ప్రారంభమవుతుందనే భయం సైతం జెరూసెలంలో వ్యాపించివున్నది.

* * *

వచ్చే నవంబరులో అమెరికా అధ్యక్షపదవికి జరిగే ఎన్నికలలో డెమోక్రటిక్ పార్టీతో పోటీ చేయడానికి రిపబ్లికన్ పార్టీ న్యూయార్కు గవర్నర్ థామస్‌డ్యూయీని ఎన్నుకున్నది. ఇతడు ఇదివరలో ప్రెసిడెంట్ రూజ్వెల్టుతో పోటీచేసి ఓడిపోయిన వ్యక్తి.



౨౨

ఫెడోట్ గుర్రపు వాల చేరుకునేదాకా స్నేహితు లిద్దరూ మౌనంగానే ప్రయాణం చేశారు. అప్పుడప్పుడు ఒకటి రెండు మాటలు మాత్రం మాట్లాడుకున్నారు. బజరోవ్ కి మొత్తంమీద తన పరిస్థితి తనకే నచ్చలేదు. ఆర్కాడీకికూడా నచ్చలేదు. మరీ చిన్నవాళ్లని ఆవరించే అర్థంలేని విషాదం అతన్ని ఆవరించింది. బండివాడు గుర్రాలను మార్చి ముందు ఎక్కి కూర్చుని అడిగాడు—"కుడిపక్కా, ఎడం పక్కా బాబూ?"

ఆర్కాడీ అదిరిపడ్డాడు. కుడిపక్కకి మళ్లితే పట్టణం మీదగా వాళ్ల ఊరు చేరుకొంటారు. ఎడంపక్కదారి ఓడిన్ట్సోవ్ సతి ఇంటికి పోతుంది.

అతడు బజరోవ్ వేపు చూశాడు.

"యవ్గనీ," అతడు అడిగాడు. "ఎడం పక్కకేనా?"

బజరోవ్ ముఖం అవతలికి తిప్పుకున్నాడు. "ఏమిటీ అవకతవక?" అని మెల్లగా అన్నాడు.

"అవకతవక అని నాకు తెలుసును," ఆర్కాడీ సమాధానం చెప్పాడు. "అయితే మాత్రం ఏం? ఇది మొదటిసారి కాదుగా?"

బజరోవ్ టోపీ నుదుటిమీదకి లాక్కున్నాడు. "నీ ఇష్టం," అన్నాడు చివరికి. "ఎడంపక్కకి పోనీ." అని కేక వేశాడు ఆర్కాడీ.

నికోల్స్కోవేపు బండి నడిచిపోయింది. ఈ అవకతవక పని చెయ్యాలని నిశ్చయించుకున్న తరవాత స్నేహితు లిద్దరూ మరీ ముఖావంగా కూర్చున్నారు. చాలా చిరాకుగా కూడా ఉన్నారు.

ఓడిన్ట్సోవ్ సతి ఇంటిగుమ్మంమీద ఆమె గుమాస్తాని కలుసుకోటంతోనే తాము రావడంలో పెద్ద పొరపాటు చేశామని ఇద్దరూ గ్రహించారు. వారు వస్తారని ఎవరూ అనుకోలేదు. అతిథిమందిరంలో వెర్రిగా చూస్తూ వారు చాలా సేపటివరకు కూర్చోవలసివచ్చింది. చివరికి ఓడిన్ట్సోవ్ సతి వచ్చింది. మామూలు మర్యాద చూపిస్తూ ఆమె వారినిద్దరినీ సంభావించింది. కాని అంత త్వరగా వారు మళ్లీ వచ్చినందుకు ఆమెకు ఆశ్చర్యంగానే ఉంది. ఆమె మాటలనుబట్టీ, చేష్టలనుబట్టీ, వారి రాక ఆమెకు అట్టే నచ్చలేదని గ్రహించవచ్చు. ఊరికే దారిన పోతూ అక్కడ చూసి పోదామని వచ్చినట్టు ఇద్దరూ తొందరగా క్షమార్పణ చెప్పుకున్నారు. ఇంకో నాలుగు గంటలలో పట్టణానికి పోవాలని అన్నారు. అల్లాగా అన్నట్టు కొద్దిగా అస్పష్టంగా అని తన తండ్రిని అడిగానని చెప్పమని ఆమె ఆర్కాడీతో అంది. తనపినతల్లిని పిలిచింది. ఆ రాకుమారి నిద్రమత్తులో మునిగిఉన్నట్టు కనిపించింది. ముడతలు పడ్డ ఆ ముఖం మరీ అసహ్యంగా కనిపించింది. కాట్యాకి ఆరోగ్యం బాగా లేదు. ఆమె తన గది లోంచి ఇవతలికి రాలేదు. చటుకుని తనకి కాట్యాని చూడాలని ఉన్నట్టు ఆర్కాడీ గ్రహించాడు. ఆ నాలుగు గంటలలో దారీ తెన్నూ లేని సంభాషణలో గడిచిపోయింది. అనాసక్తిగా మాట్లాడినప్పుడూ, వింటున్నప్పుడూకూడా ఆమె ముఖంమీదికి చిరునవ్వు ఒక్కసారీ రాలేదు. చివరికి వారు సెలవు తీసుకొని వెళ్లిపోయేముందుమాత్రం ఆమెలో ఆ వెనకటి స్నేహభావం తిరిగి ఉదయించింది.

"నా కిప్పుడు కాలేయం కొంచెం పాడయింది," అంది ఆమె, "అయినా ఏమీ ఫరవాలేదు. త్వరలోనే మళ్ళీ మీరు ఇక్కడికి రావాలి —మీ ఇద్దరితోటీ చెప్తున్నాను."

ఆర్కాడీ బజరోవ్‌లు సమాధానంగా తలలు కొద్దిగా వంచి, బండి ఎక్కారు. ఇంక ఎక్కడా ఆగకుండా తిన్నగా మెరినోకి సుఖంగా మరునాటి సాయంకాలానికి చేరుకున్నారు. అంత ప్రయాణంలోనూ ఓడిన్ట్సోవ్ సతి పేరు ఇద్దరిలోను ఎవరుకూడా ఉచ్చరించలేదు. ముఖ్యంగా బజరోవ్ అసలు పెదవులు విప్పనేలేదు రోడ్డు పక్కకి అశక్తమయిన తీవ్రతతో తేరిచూస్తూ కూర్చున్నాడు.

వారు వచ్చినందుకు మెరినోలో అందరూ ఎంతో ఆహ్లాదించారు. ఇంతకాలం కొడుకు తిరిగి రానందుకు నికోలై పెట్రోవిచ్ మనస్సు అసలు ఆందోళనపడుతోంది. మెరుస్తున్న చూపులతో 'యువకులు' రాకను ఫెనీచ్కా పరుగెత్తుకుని వచ్చి చెప్పడంతోనే నికోలై పెట్రోవిచ్ సంతోషం పట్టలేక ఒక్క అరపు అరచి, సోఫానుంచి ఎగిరి గంతు వేశాడు. పావెల్ పెట్రోవిచ్ మనస్సులోకూడా సుఖావహమయిన ఉద్వేగం కొంత లేకపోలేదు. అతడు ఇద్దరుస్నేహితులతోటీ పెద్దతరహాగా చిరునవ్వు నవ్వుతూ కరస్పర్శ చేశాడు. సంభాషణ, కుశల ప్రశ్నలు ప్రారంభమయాయి. ఆర్కాడీ అందరికంటే ఎక్కువగా మాట్లాడాడు. భోజనాల దగ్గర మరీ మాట్లాడాడు. అర్ధరాత్రి దాటిన తరవాత చాలసేపటివరకు భోజనాలు తెమలలేదు. మాస్కోనించి అంత క్రితమే తెప్పించిన మధువు తీసుకురమ్మని నికోలై పెట్రోవిచ్ ఆజ్ఞాపించాడు. చెక్కిళ్లు ఎర్రబడేవరకు ఆ మధువు తాగుతూనే ఉన్నాడు. సగం సంకోచంతో, సగం అసంబద్ధంగా చిన్న నవ్వు లోపలే అణచుకుంటూ నవ్వుతూ కూర్చున్నాడు. ఉలాసా సేవకులనుకూడా ఆవరించింది. దున్యాషా ఏదో అవహించినట్టు ఇటూ అటూ పరిగెత్తుతూ తలుపులు మూస్తూ తెరుస్తూ హడావిడిగా ఉంది. తెల్లవారుగట్ల మూడుగంటలయినా, పీటర్, సితారా చేత పట్టుకుని కొసాక్కుల నృత్యగీతాన్ని ఒకదాన్ని పలికించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కదలిక లేని ఆ గాలిలో ఆ తీగల నినాదం ఆర్తనాదం లాంటి తియ్యటి ధ్వనం కదిలింది. కాని మొదట ఏవో ఒకటి రెండు చుళుక్కులు తప్ప ఆ నాగరక సేవకుడి ప్రయత్నాలు ఇంక ఫలించలేదు. తక్కిన లోకాన్ని మించిన సంగీతప్రతిభ ఏమీ ప్రకృతి అతనికి ప్రసాదించలేదు.

కాని మెరినోలో అదీ సవ్యంగా నడవడం లేదు పాపం నికోలై పెట్రోవిచ్ చాలా బాధపడుతున్నాడు. కమతంలో కొత్త ఇబ్బందులు అనుక్షణమూ పుట్టుకొస్తున్నాయి. రోజు కూలికి పనిచేసే పనివాళ్లతో గడుపుకు రావడం అసంభవమై పోతోంది కొంతమంది తమకు కావలసింది వెంటనే ఇచ్చివెయ్యమంటారు; కొంతమంది హెచ్చు కూలి కావాలంటారు. కొంతమంది హెచ్చు కూలీ ముందుతీసుకుని పనిచెయ్యకుండా పారిపోతారు. గుర్రాలకు జబ్బులు పట్టుకున్నాయి. జీనులు మండిపోయినట్టు ముక్కలు ముక్కలయిపోయాయి పనులు శ్రద్ధగా సాగుతున్నాయి. ధాన్యంనూర్చే మర ఒకటి మాస్కోనించి తెప్పించారు. బరువు ఎక్కువయిన కారణంచేత అది నిరుపయోగం అయిపోయింది. ఇంకొకటి ఒక్కసారి ఉపయోగించగానే పాడయిపోయింది. ఒక గుడ్డి ముసలిస్త్రీ కమతంలో ఇటూఅటూ గాలి వీస్తున్నప్పుడు నిప్పు తీసుకువెడుతుండగా గుర్రపుశాలలు అంటుకుని కాలిపోయాయి. ఆ ముసలిస్త్రీ, ఆ తప్పంతా యజమానిదేననీ, యజమాని కొత్తకొత్త ప్రణాళికలన్నీ అమలు జరపడం ప్రారంభించిననాటినించీ ఈ శని పట్టుకుందనీ అంటుండేది. కమతంలో నీటి సదుపాయాలూ, గృహనిర్మాణాలూ చూస్తుండే ఉద్యోగికి ఉన్నట్టుండి బద్ధకం బలిసిపోయి, లావెక్కడం ప్రారంభించాడు. ప్రతీ రష్యనూ ఒక సుఖమయిన ఉద్యోగం దొరకగానే లావెక్కడం ప్రారంభిస్తాడు. నికోలై పెట్రోవిచ్‌ని దూరాన్ని చూచినప్పుడు తన శ్రద్ధని చూపించడానికి ఏ పందిమీదో కర్రవిసరడమో, ఏ కుర్రకుంకనో బెదరించడమో చేస్తుంటాడు. తక్కినప్పుడు సుఖంగా నిద్రపోతాడు. కవులుకి భూమి పుచ్చుకున్న రైతులు సకాలంలో మక్తాలు తీసుకు వచ్చి ఇవ్వరు; పైగా చిట్టడవిలో కర్ర దొంగతనంగా కొట్టుకుపోతుంటారు. ప్రతీ రాత్రీ కమతపు పచ్చిక బీళ్లలో ఏవో రైతులతాలూకు గుర్రాలు పడి మేస్తూంటే కాపలావాళ్లు పట్టుకుంటారు; అప్పుడప్పుడు వాటిని తరిమివేస్తుంటారు. నికోలై పెట్రోవిచ్ ఆ నష్టపరిహారానికి కొంత డబ్బు జరిమానాగా విధిస్తుంటాడు. కాని సాధారణంగా ఒకటి రెండు రోజులు ఆ గుర్రాలను యజమాని కొట్టంలో కట్టివేసి ఉంచి తరువాత వదలివెయ్యడం జరుగుతుంది. ఇవన్నీ ఇల్లా ఉండగా రైతులు ఒకళ్లతో ఒకళ్ళు దెబ్బలాడుకోడం ప్రారంభించారు. అన్నదమ్ములు ఆస్తి పంపకాలకోసం తగువు పెట్టుకున్నారు; వాళ్ళ భార్యలకు పొత్తుకుదరడం లేదు. ఉన్నట్టుఉండి తగాదా ఒక్కసారిగా రేగుతుంది, ఊరంతా అక్కడికి మూగుతుంది; యజమాని దగ్గరకు, తరచుగా తెగతాగిన పరిస్థితిలో వెళ్లి వారు తగవు చెప్పుకుంటారు. చటుకుని పెద్దగొడవ బయలుదేరుతుంది, ఆడవాళ్లకీచుగొంతుకల్లో ఏడుపులు, మగవాళ్ల బూతులు కలిసిపోతాయి. అప్పుడు రెండుపక్షాలవారి తగవూ వినాలి. గొంతుకపోయేటట్టు అరవాలి. కాని న్యాయం నిర్ణయించడానికి సావకాశం లేదని తెలిసినా ఈ శ్రమ తప్పదు.... పండిన పంట కొయ్యడానికి కావలసినంతమంది లేరు. చాలా ఉపకారసుడులాగ కనిపించిన ఒక పరిసద్దు భూస్వామి కోతకు మనుష్యుల్ని ఏర్పాటు చేసిపెడతానని, ఎకరానికి ఒకరూబులు చొప్పున తను తీసుకుని, మంచీ మర్యాదా లేకుండా అతన్ని మోసగించాడు. రైతుస్త్రీలు ఎప్పుడూ ఎరగనంత కూలి కావాలంటారు. ఈలోగా పంట పాడయిపోతుంది. ఒక ప్రక్కని ఈ కోతపని బకాయిలో పడిపోతుంది; రెండో పక్కని అప్పులిచ్చిన వాళ్లు వడ్డీతో సహా తమ డబ్బు తక్షణం తెచ్చి ఇమ్మని కూర్చుంటారు.

"ఇంక నే నేం చెయ్యగలను!" నికోలై పెట్రోవిచ్ నిస్పృహ చెంది ఎన్నో సార్లు అంటుంటాడు. "వాళ్లని నేను చబుకుతో కొట్టలేను. పోనీ పోలీసు ఉద్యోగస్థుడిని పిలుద్దామంటే, అది నా పద్ధతికి విరుద్ధం. భయపెడితే గాని వాళ్లచేత ఏ పనీ చేయించుకోలేం."

"శాంతం! శాంతం!" పావెల్ పెట్రోవిచ్ ఆ సమయాల్లో అంటుంటాడు. కాని అతను కూడా కనుబొమలు ముడివేసి మీసాలు కోపంగా లాగుకుంటాడు.

ఈ విషయాల్లో జోక్యం పెట్టుకోకుండా బజరోవ్ దూరంగా ఉండేవాడు. అతిథిగా వచ్చిన తను నిజానికి ఇతరుల వ్యవహారాలలో కలగ చేసుకోకూడదు. మెరినోకి చేరుకున్న మరునాటి నించీ తన కప్పల పరీక్షలోనూ, రాసాయనిక ప్రయోగాలలోనూ నిమగ్నుడయిపోయాడు. వాటిలోనే నిరంతరమూ మునిగి ఉండేవాడు. ఆర్కాడీ మట్టుకు, తను తండ్రికి సహాయపడలేకపోయినా, అధమం సహాయపడడానికి సిద్ధంగా ఉన్నట్టు కనపడాలని ప్రయత్నించేవాడు. అతను చెప్పేవన్నీ శ్రద్ధగా వినేవాడు. ఒకసారి సలహాకూడా ఇచ్చాడు; ఆసలహా ఉపయోగపడుతుందని కాదు, తన శ్రద్ధను వ్యక్తపరచడానికి. కమతపు వ్యవహారాలంటే అతనికి అసహ్యం ఏమీలేదు. సేద్యం విషయమయి చాలా ఉత్సాహంగా మనస్సులో ఊహలు అల్లుకునేవాడుకూడా. కాని ఈరోజుల్లో అతని మెదడులో అనేకమైన ఊహలు అల్లిబిల్లిగా అల్లుకుపోతున్నాయి. నికోల్‌స్కో నిత్యమూ అతని మనస్సులో నిలిచి ఉండడం ఒకటి అతనికే వింతగా ఉంది. బజరోవ్ తనూ ఒక ఇంట్లో ఉండగా తనకి తోచకపోవడం ఉంటుందని ఎవరన్నా ఇదివరకు అంటే, అతను అపసవ్యంగా భుజాలు కుదించేవాడు—అదికూడా తనఇంట్లో! కాని అతనికి నిజంగా తోచడంలేదు; అక్కడినించి వెళ్లిపోవాలని ఉంది. అలసిపోయేదాకా దూరంగా తిరిగి తిరిగి రావడం మొదలుపెట్టాడు, కాని లాభం లేకపోయింది. ఒకరోజుని నికోలై పెట్రోవిచ్‌తో మాట్లాడుతుండగా, ఓడిన్ట్సోవ్ సతి తల్లి తనతల్లికి వ్రాసిన కొన్ని చిత్రమయిన ఉత్తరాలు అతని దగ్గర ఉన్నాయని తెలిసింది. ఆ ఉత్తరాలకోసం తండ్రిచేత ఒక ఇరవయి బీరువాలు, పెట్లు వెతికించి, అవి పైకి తీయించేదాకా అతని మనస్సు కుదుటపడలేదు. సగం చిరిగిపోతున్న ఆ ఉత్తరాలను చేత పట్టుకున్న తరవాత, అతని మనస్సు కొంతశాంతించింది; తను చేరవలసిన గమ్యస్థానానికి ఏదో సూచన దొరికినట్టు అతనికి అనిపించింది. "ఈ ఆహ్వానం మీ ఇద్దరినీ ఉద్దేశించి!" అంది ఆమె అంతట ఆమె! "నేను వెళ్లాలి. వెళ్లితీరాలి. పోతే పోయింది!" అనుకున్నాడు. కాని క్రిందటిసారి తాము వెళ్లినప్పుడు ఆమె అంత ఉత్సాహంగా సంభావించకపోవడం, తమకు చాలా ఇబ్బందిగా అనిపించడం అతను తలుచుకుంటే మళ్లీ పిరికితనం అతన్ని ఆవరించింది. యౌవన సహజమయిన ముందుకి సాగిపోయే ఉత్సాహం, తన అదృష్టాన్ని దృఢపరుచుకోవాలనే రహస్యవాంఛ, తను ఒక్కడూ, ఇతరుల సహాయం లేకుండా, తన విలువను రుజువు చేసుకోవాలనే పట్టుదల, ఇవి చివరకి పిరికితనాన్ని జయించాయి. మెరినోకి చేరుకున్న తరవాత పదిరోజులు దాటకుండానే, ఆదివారం బడులు ఎల్లా పనిచేస్తున్నాయో చూడాలనే మిష మీద, తిరిగి పట్టణానికీ, అక్కడ నించి నికోల్‌స్కోకి ప్రయాణమయి వెళ్లాడు. విరామం లేకుండా బండి తోలించాడు — యుద్ధానికి పోయే సేనానాయకుడిలాగ, ఎగిరిపోయాడు. ఒక పక్కని భయమూ, ఒక పక్కని నిర్లక్ష్యమూ అతని మనస్సుని బాధపెట్టాయి. తొందరగా చేరుకోవాలనే ఆదుర్దాలో అతనికి ఊపిరి ఆడలేదు. "అసలు గొప్పసంగతి ఏమంటే ఆలోచన కూడదు," అని తనలో తను అను

(19 వ పేజీ చూడుడు)

విజ్ఞానరంగములో రాజాజీ

శ్రీ ఆర్. యస్. శర్మ, బి. ఏ.

భారత దేశపు గవర్నరు జనరలుగ శ్రీ రాజగోపాలాచార్యులవారి నియామకము ఒక అపూర్వ సంఘటన. శ్రీ ఆచార్యులవారు అనేక దశాబ్దములనుండి భారతీయ రాజకీయ రంగమున ప్రముఖపాత్ర వహించినవారు. గాంధిజీ భాష్యకారులుగ మిగుల వినుతికెక్కిరి. కాని ప్రజాజీవితరంగమున ఆయనకు గల ప్రాముఖ్యత ఆయన యొక్క ఘనతయందొక భాగము మాత్రమే. స్వర్గీయ బాల గంగాధర తిలక్, నేడు పండిత జవహర్ లాల్, మౌలానా ఆజాద్, కె. యం. మున్షీ మున్నగువారివలెనే ఆయన చేసిన సాహిత్యకృషి అపారమైనది. రాజకీయ రంగములో ఆయనకు గల విఖ్యాతి విస్మరింపబడిన పిదపకూడ, సాహిత్యరంగమున ఆయనకు గల ప్రఖ్యాతి ఆయన పేరును దేశచరిత్రలో నాచంద్రార్కము నిలుపగలదు.

సర్వతోముఖ ప్రతిభ

శ్రీ ఆచార్యులవారి విజ్ఞాన కృషియందు మనకు గోచరించెడు ప్రధాన లక్షణము సర్వతోముఖ ప్రతిభ. జవహరు పండితుని సాహిత్య ప్రతిభను ఎవరును కాదనలేరు. కాని ఆయన విజ్ఞాన కృషి ఆధ్యాత్మిక విషయములందును, దేశీయ సాహిత్యముతోను సంబంధము కల్గించుకొన్నట్లు తోచదు. మౌలానా ఆజాద్ గారి విజ్ఞానము యిందుకు సరిగా వ్యతిరేకము శ్రీ ఆచార్యులవారి కృషియందు ఈ రెండు విధానముల యొక్క సమన్వయము కానవగును. గీత, ఉపనిషత్తులు, రామాయణము మున్నగు ఆర్షమత గ్రంథములందు వారి కెంతమక్కువో కురళ్, శిలప్పధికారం మున్నగు తమిళ గ్రంథములందు వారి కంత యిష్టము. శాస్త్రము ఆంగ్ల సాహిత్యమునందు కూడ వారి కంతటి ప్రీతి గలదు. ఆయన ఎంత సమర్థుడగు వక్తయో అంత నేర్పుగల వ్రాయసగాడు. ఆయన విషయవిజ్ఞానము ఎంత అపారమో సాధారణ విషయములందు వారికి గల ప్రపంచజ్ఞానము అంత విస్తారము.

పాండిత్య ప్రకర్ష

రాజాజీ పాండిత్య ప్రకర్ష విస్తారమైనదే గాదు. లోతైనది గూడ. ఆయన నిశితమగు యోచనాశక్తి ఆయన గ్రహించిన విషయమును ఆయనలో నంతర్భాగము చేసివేయగలదు. కేవలము విషయసామగ్రిని లోభిధనమును నిలువచేసినట్లు నిలువచేయుటతో నాయన తృప్తిపడడు. కన్ ఫ్యూషియస్ యేనాడో "Thinking without learning makes one feighty but learning without thinking is a disaster" అని వాకొనినాడు. ఇటీవలి రచయితయగు ఆర్నాల్డు బెన్నెట్ మనము గ్రంథపఠన మొనరించిన కాలమెంత యుండునో అంతే కాలమును చదివిన విషయమునుగూర్చి ఆలోచించుటకు ఖర్చుపెట్టనిచో గ్రంథకర్తను అగౌరవము చేసినవార మగుదుమని వాకొనియున్నాడు. పై వాక్యములందలి సత్యమును గుర్తించిన పండితులలో శ్రీ రాజగోపాలాచార్యులు గారొకరని వారి రచనలు ఉపన్యాసములు రుజావు చేయగలవు.


ఇటీవలనే నటేశం కంపెనీవారు ప్రచురించిన ఒక వ్యాసావళిలో వ్రాయుచు రాజాజీ తనపై నుత్తేజము కల్గించిన గ్రంథములను పేర్కొనియున్నాడు. Thoreau మహాశయుని Duty of Disobedience అను గ్రంథము, Mill చే విరచితమైన "Liberty" అను వ్యాసము, మన బాలబాలికలకు చిరకాలపరిచితమైన Robinson Crusoe, యివిగాక Trial and death of Socrates, meditations of Marcus Aurelius అను గ్రంథములు ఆయన దృక్పథమును తీర్చిదిద్దెనట. ఆయన రాజకీయ జీవితమును, ఈ గ్రంథముల పట్టికను దృష్టిలో నుంచుకొని పరిశీలించినవారు ఉద్గ్రంథములకు మానవజీవితముపైగల ప్రభావము గుర్తింపకపోరు.

చెరసాలలో నున్నపుడు విజ్ఞానకృషికై ఆయన తన కాలమును గడిపిన విధానము ఆదర్శప్రాయమైనది. ఒకవంక షేక్స్‌పియరు మహాకవి రచనలపై అమృతోపమానములగు ఉపన్యాసముల నిచ్చుచుండిరి. మరొక వంక ఉపనిషత్తులు మున్నగు సంస్కృత రచనలు అందభిరుచి గలవారితో కలసి పఠించుచుండిరి. వేరొక వంక తాను తమకు చిరపరిచితములగు కురళ్, కంబర్ రామాయణము మున్నగు తమిళ గ్రంథములలోని మాధుర్యము నాస్వాదించుచుండిరి. సోదర నిర్బంధితు లొకరు చెప్పినట్లు వారి విజ్ఞానకృషి చెరసాలను విశ్వవిద్యాలయముగా మార్చివైచెను.

రచనా సామర్థ్యము

రాజాజీ చెప్పుకోదగ్గ రచయితలలో నొకరు. ఆయన తన స్వభాషయగు తమిళమునను, ఆంగ్లమునను గూడ అనేక గ్రంథములను హృదయంగమముగా రచియించినాడు. ఆయన తమిళ గ్రంథములు అనేక తెగలకు చెందియుండి ఆయన సర్వతోముఖ ప్రతిభకు నిదర్శనములుగానున్నవి. గీత, ఉపనిషత్తులు మున్నగు ఆధ్యాత్మిక గ్రంథముల వ్యాఖ్యానించుచు ఆయన చేసిన రచనలు మొదటిరకము. మన ఆంధ్రులకు పరిచితమైన శ్రీకృష్ణుడు బోధించిన మార్గము అను గ్రంథము ఈ తెగలోనిదే వచ్చును. సులభశైలిలో వృక్ష, జంతు, రసాయనాదిశాస్త్రములలో ఆయన వయోజనులలో విజ్ఞానము వెదజల్లుటకు రచియించిన గ్రంథములు (తిన్నై రసాయనం) మున్నగునవి రెండవరకము. ఈ గ్రంథములలో ఆయన విషయమును విడమర్చుటకు చూపిన సామర్థ్యము, వాడిన మృదుమధురమగు తేటతెలుగుశైలి ఆదర్శప్రాయము లని చెప్పుదురు. మూడవవర్గమునకు చేరినవి ఆయన వ్రాసిన చిన్న కథలు. ఇవి ఆయన సంఘసంస్కరణములను దృష్టిలో నుంచుకొని వాని ప్రచారార్థము రచియించిన వగుటచే కొంత కళావైభవము లోపించవచ్చును. కాని ఆయన కథలలో అనేకము లక్ష్యోత్తమములై యితరభాషలలోనికి అనువదింపబడినవి. మద్యపాననిషేధముపై రచియింపబడిన ఒక కథ వెండితెరపై నెక్కనున్నదని ఆమధ్య ప్రకటింపబడినది. వ్యాసరచనమందు గూడ ఆయన అందెవేసిన చెయ్యి. తమిళులు కానివారు తమిళరచయితగా ఆయనకు గల ప్రతిభనుగూర్చి చర్చించుట సాధ్యముకానిపని. కాని స్వభాషయం దాయన చూపుచున్న శ్రద్ధ ప్రశంసాపాత్రమే గాదు. ఆంగ్లభాషావ్యామోహితులగు రాజకీయవేత్తలనేకులకు ఆదర్శప్రాయము.

ఆంగ్లమునగూడ ఆయన సమర్థుడగు వ్రాయసగాడు. ఇటీవలి భారతరాజకీయములపై ఆయన రచయించిన The way out, Reconcilliation, why and how అను గ్రంథములు మిగుల వ్యాప్తిలోనికి వచ్చినవి. ఇవిగాక మరి రెండు ఆంగ్ల గ్రంథములను గూర్చి ముఖ్యముగా పేర్కొనవలసి యున్నది. అందొకటి ఆయన తన అభిమానవిషయమగు మత్యపాననిషేధముపై రచియించిన గ్రంథము. ఇది నెహ్రూపండితునిచే మిగుల శ్లాఘింపబడినది. త్రాగుడువలని అనర్థములను నిరూపించుటకు శ్రీ ఆచార్యులవారు మతసూత్రములపై నాధారపడక శాస్త్రమును, జాతీయాభ్యుదయమును ఆధారముగ చేసుకొని సహేతుకముగ మద్యపానపిశాచివలని నష్టములు పేర్కొనినందులకు నెహ్రూపండితుడు మిగుల ప్రశంసించినాడు. రెండవది డాక్టర్ అంబేద్కర్ కాంగ్రెస్‌పై చేసిన విమర్శలకు ప్రత్యుత్తరముగా ఆయన రచియించిన గ్రంథము. 380 పేజీల విమర్శకు 38 పుటలలో ఆయన సంతృప్తికరమైన ప్రత్యుత్తర మొసంగినాడు. ఆయన వాడిన తర్కము అభేద్యమైనది. ఈ గ్రంథము యొక్క క్లుప్తత అబ్రహాం లింకన్ గెటిజ్‌బర్గ్ ఉపన్యాసమును, సురేంద్రనాథ బెనర్జీ లార్డు క్రోమర్ భారతదేశపత్రికలపైన చేసిన ఆక్షేపు విమర్శలకు జవాబుగా చేసిన ఉపన్యాసమును మనకు జ్ఞప్తికి తేగలదు.



వక్తృత్వ ప్రతిభ

కాంగ్రెసు సందేశమును తమిళనాడులో మారుమూలల గ్రామములకుకూడ గొంపోయినవాడు రాజాజీ. గాంధీ తత్వమును సామాన్యజనులకు అవగాహన మగునట్లు వ్యాఖ్యానించినవాడు రాజాజీ. వక్తగా ఆయనకుగల విశిష్టత శ్రీనివాస శాస్త్రిగారి విషయములోవలె భాషాసౌలభ్యము వలన కల్గినదిగాదు. ఈయన గ్రామకాంగ్రెసు వారి యాజమాన్యమున జరిగిన బహిరంగసభ మొదలుకొని ఏదైన నిపుణులయొక్క అఖిల భారత సమావేశమువరకు ఏ సమావేశమునకును సరిపడకపోవుట యుండదు. ఏ క్లిష్టవిషయమునైనను అతివిపులముగ విడదీసి చెప్పుటలో సాటిలేనివాడు. ఎట్టి వివాదకరమైన రాజకీయ సమస్యనైన ఉద్రేకపడక స్థిమితచిత్తముతో చర్చించగలడు. ఆయన వాడు పిట్టకథలు వక్తగా ఆయన కొక విశిష్టతను తెచ్చిపెట్టినవి. త్రిపురి కాంగ్రెసు సమావేశమున ఆయన వాడిన ఓటిపడవ - గట్టి పడవ కథను దేశీయులింకను మరచిపోలేదు. ఇతరులకు తాను చెప్పదలచుకొన్న విషయమును నచ్చచెప్పుటలో ఆయనకుగల సామర్థ్యము జగద్విఖ్యాతము. నిజమునకు వక్తృత్వ సామర్థ్యము కేవలము వ్యక్తులకు అలంకారప్రాయము కారాదనియు వారికి గల నిశ్చితాభిప్రాయములను వ్యాప్తి చేయుటకు సాధనముగ తోడ్పడవలయుననియు ఆయన అభిప్రాయము.

చెన్న రాష్ట్రమునకు ఈయన ప్రధానిగానున్నపుడు గవర్నరయిన ఎర్‌స్కిను ప్రభువు ఈయన వివిధ విషయములపై నిశ్చితములగు అభిప్రాయములు గల వ్యక్తియని ప్రశంసించినాడు. 1946 లో మన దేశము వచ్చిన పార్లమెంటరీ దళమువారు ఆయనకుగల సునిశితముగను, సుస్పష్టముగను ఆలోచన చేయగల మేధాశక్తిని పొగడియుండిరి. ఈ రెండు ప్రశంసలలోని సత్యము మనకు ఆయన ఉపన్యాసములలో గోచరింపగలదు. వర్ణాంతర వివాహములు, మద్యపాననిషేధము, మాతృభాషలలో విద్యాభ్యాసము, స్త్రీ పురుషులకు భిన్నమార్గములలో విద్యాభ్యాసము చేయవలసిన ఆవశ్యకతమున్నగు విషయములలో ఆయనకు గల నమ్మకము అపారమైనది.

రాజాజీ అనేక విశ్వవిద్యాలయములచే స్నాతకోపన్యాసకుడుగా ఆహ్వానింపబడి గౌరవింపబడినాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయమాయనకు డాక్టర్ ఆఫ్ లాస్ అను పట్టము నొసంగి గౌరవించినది. 1937 లో ప్రధానిగానున్నపుడీయన ఆంధ్ర విశ్వవిద్యాలయ పట్టభద్రుల నుద్బోధించినాడు. 1941 లో లక్నో విశ్వవిద్యాలయమందొసంగిన స్నాతకోత్సవము అనేకుల నాకర్షించుటకు ప్రధానకారణము అది నాడు ప్రధాన సమస్యయగు దేశరక్షణపై గావింపబడినది. దీనిని గాంధిజీపై తిరుగుబాటుగా ననేకులు వ్యాఖ్యానించినారు. 1944 లో ఆయన నాగపూరు విశ్వవిద్యాలయమునందొసంగిన స్నాతకోపన్యాసములో భారత రాజకీయ సమస్యలగురించి చర్చించినందులకు ప్రసిద్ధ లిబరలు నాయకులగు శ్రీ॥ శే॥ సర్ చిమన్‌లాల్ శతల్‌వాడుగారు తీవ్రముగా విమర్శించి రాజకీయములను స్నాతకోత్సవప్రసంగములలోనికి రానీయరాదని దీర్ఘప్రకటన గావించుటచే ఆ ఉపన్యాసముగూడ లక్నో ఉపన్యాసమువలెనే మిగుల వ్యాప్తిలోనికి వచ్చెను.

వక్తగా రాజాజీనిగురించి ప్రసిద్ధ రచయితయగు D. F. Karaka గారు వ్రాసిన కొన్ని వాక్యములు ఉల్లేఖింపవగినవి:—

"His approach to life is analytical, systematic and positive. He is sure of what he says, always well armed with facts and figures, never badly informed, never vague or hesitating in his arguments. He produces arguments as if he were a slot-machine and you had only to press a button to make it work............

"As a speaker Raja Gopalachari does not come within the class of orators. There is no flam boyance, or verbosity in his untterances. His similies are few but to the point. He is easy to understand, simple to follow. He speaks down to the smallest brain in the audiences so that no one feels left out...... There are no perorations in Raja Gopalachari's speech, no purple patches, no passages one wants to memorise. Sometimes he is unbearably prosaic but he never misses making his point on any occasion"......

రాజకీయవేత్తగా రాజాజి అనేకుల విమర్శకు పాత్రుడైనాడు. పరిపాలకుడుగాకూడ ఆయన అందరి మన్నలను గాంచలేదు. కాని విజ్ఞాన రంగములో నాయనకు గల ప్రతిభను ఎవ్వరూ కాదనలేరు. మన ప్రధాని నెహ్రూ మహోజ్వల విజ్ఞానమూర్తి. అట్టి గవర్నరుజనరలే మనకు లభించినందుకు తగిన అన్నములోనికి తగిన కూర దొరకిం దని మనము గర్విద్దాము. వారి నాయకత్వాన భారతీయవిజ్ఞానసౌరభము నాగరక లోకపు నలుమూలల వ్యాపిస్తుందని ఆశిద్దాము.

అమెరికా అధ్యక్షపదవికి ఎన్నికల సంరంభం

రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా గవర్నర్ థామస్ డ్యూయీ ఎన్నిక



డ్యూయీ

యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా నూతన అధ్యక్షుడు నవంబరు నెలలో ఎన్నుకొనబడును. ఆ ఎన్నికలకు ప్రచారము దాదాపు ఆరు నెలలనుండి విరివిగా జరుగుచునేయున్నది. ఈనాడు పశ్చిమ ప్రజాస్వామ్య రాజ్యములకు అమెరికాయే నాయకత్వము వహించి నడుపుచున్నది. పశ్చిమ ప్రజాస్వామ్య వర్గముయొక్క భవిష్యత్తు అమెరికా ప్రభుత్వముపైననే ఆధారపడియున్నది. అమెరికా ప్రభుత్వ యంత్రమునకు ఏకైక అధికారి అమెరికా అధ్యక్షుడు. అందువలన అమెరికన్ ప్రజలేగాక ప్రపంచమంతయు అమెరికన్ అధ్యక్షుని ఎన్నికలకు అత్యంత ప్రాముఖ్యత యిచ్చుచు, అతిజాగ్రత్తగా పరిశీలించుచున్నారు.

అమెరికాలో ముఖ్యమైన రాజకీయ పక్షములు రెండు: డెమోక్రటిక్ పార్టీ, రిపబ్లికన్ పార్టీ. ఇవి రెండుగాక మూడవపక్షమొకటి ఈ మధ్యనే మజీ ఉపాధ్యక్షుడు హెన్రీవాలెస్ చే స్థాపింపబడెను. కాని ఈ పక్షము అంత ఎక్కువ ప్రచారములోనికి ఇంకా రాలేదు. యుద్ధకాలములో అమెరికా అధ్యక్షుడుగానున్న రూజ్వెల్టు, ప్రస్తుతము అధ్యక్షుడుగానున్న ట్రూమన్ లు డెమాక్రెటిక్ పక్షమునకు చెందినవారలే. డెమాక్రెట్ లు అమెరికాను గత 20 సంవత్సరముల నుండి అవిచ్ఛిన్నముగా పాలించుచున్నారు. వీరి పరిపాలనలో అమెరికా ప్రపంచ నాయకత్వము నందుకొన్నది. రూజ్వెల్టు మరణానంతరము ఈ పార్టీ పలుకుబడి పడిపోవుచున్నదని చాలమంది అభిప్రాయపడుచున్నారు.

రిపబ్లికన్ పార్టీకూడ అమెరికాను అనేక పర్యాయములు పాలించినది. గత 20 సంవత్సరములనుండి అట్టి భాగ్యము ఈ పార్టీకి లభింపకపోయినను ప్రజలలో వీరికి కొంత పలుకుబడి లేకపోలేదు. పారిశ్రామిక వేత్తలు, పెద్ద భూస్వాములు ఈ పార్టీని ప్రోత్సహింతురు. ప్రథమ ప్రపంచ సంగ్రామానంతరము అమెరికా అంతర్జాతీయ వ్యవహారములలో ఏమీ జోక్యము కల్పించుకొనకుండుటకు ఈ పక్షమే కారణము. 'అమెరికాను వేరుంచు' అన్నదే అప్పట్లో వీరి విధానము. వెండెల్ విల్కీ, థామస్ డ్యూయీ, ఆర్థర్ వాండెన్ బర్గ్, ఆర్థర్ స్టాసెన్ లు ఈ పార్టీ నాయకులైనప్పటినుండి అంతర్జాతీయ వ్యవహారములలో జోక్యము కలుగజేసుకొనక పోవుట తప్పని గుర్తించిరి. ఇప్పటికికూడ 'అమెరికాను వేరుంచు' వాదులు ఈ పార్టీలో లేకపోలేదు. రిప్రజెంటివ్స్ సభ స్పీకరు అయిన జోసఫ్ మార్టిన్, రిప్రజెంటివ్స్ సభలో రిపబ్లికన్ పక్ష నాయకుడు చార్లెస్ హాల్లెక్, జాన్ టేబర్ లు ఈ వర్గమునకు నాయకులు.


ప్రెసిడెంట్ ట్రూమన్ అమెరికన్ ప్రజలలో తన పలుకుబడిని పోగొట్టుకున్నాడనీ, ఇతడు రూజ్వెల్టు అంత సమర్థుడు కాడనీ, ఈ పర్యాయము బహుశః అతడు అధ్యక్షపదవికి ఎన్నుకొనబడక పోవచ్చుననీ ఎక్కువ ప్రచారము జరుగుచున్నది. ఇది వాస్తవమైనా కాకపోయినా ఇందువల్ల రిపబ్లికన్ పక్షనాయకులకు, వారి ప్రకటనలకు ఎక్కువ ప్రాముఖ్యత, విలువ లభించినది. రిపబ్లికన్ పార్టీ చే అధ్యక్షపదవికి అభ్యర్థిగా నిలబెట్టబడినతడు ఈ పర్యాయము తప్పక గెలుచునను భావముతో రిపబ్లికన్ పార్టీ వ్యవహారములు అతి జాగ్రత్తగా పరిశీలింపబడుచున్నవి.

అమెరికన్ అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ తరఫున నిలబడదలచిన అభ్యర్థిని, రిపబ్లికన్ పార్టీ ప్రతినిధులు ఎన్నుకొనవలెను. రిపబ్లికన్ పార్టీ సభ్యులందరు నియోజక వర్గములుగా విభజింపబడి, తమతమ ప్రతినిధులను ఎన్నుకొందురు. ఈ ఎన్నికలకు నిలబడు అభ్యర్థులు తాము ఫలానా వ్యక్తి అధ్యక్షుడుగా నుండవలెనని వోటుచేసెదనని నియోజకవర్గమునకు ముందుగనే తెలియపరచుదురు. రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్షపదవికి పోటీ చేయదలచిన అభ్యర్థులు దేశమంతటను తిరుగుచు, తాము అనుసరింపదలచుచున్న విధానములను ప్రచారము చేతురు. కాబట్టి పార్టీ సభ్యులు తాను ఏ ప్రతినిధికి వోటు చేసిన తాను కోరుతున్న వ్యక్తి అధ్యక్ష స్థానమునకు పోటీ చేయగలడో తెలిసికొనగలరు. ఈ విధముగా అన్ని రాష్ట్రములనుండి ఎన్నుకొనబడిన ప్రతినిధులు 'జాతీయ సమావేశము' జరిపెదరు. ఈ జాతీయ సమావేశము ఈ సంవత్సరము ఫిలడెల్ఫియా పట్టణమున జరుగుచున్నది. ఇచ్చట చేరిన ప్రతినిధుల సంఖ్య దాదాపు 1096 అని తెలియుచున్నది. అధ్యక్ష స్థానమునకు రిపబ్లికన్ పార్టీ చే నిలబెట్టబడుటకు పోటీచేయుచున్న అభ్యర్థులు: థామస్ డ్యూయీ, రాబర్ట్ టాఫ్ట్, హెరాల్డ్ స్టాసెన్, జనరల్ మెకార్థర్, సెనెటర్ ఆర్థర్ వాండెన్ బర్గ్, స్పీకర్ జోసఫ్ మార్టిన్, ఎర్ల్ వారెన్ (కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్) సెనెటర్ రేమండ్ బాల్డ్విన్, మొదలగువారు.

థామస్ డ్యూయీ రిపబ్లికన్ పార్టీలో చాల కాలమునుండి ఒక ప్రముఖ నాయకుడు. ఈయన న్యూయార్క్ రాష్ట్ర గవర్నర్ గత పర్యాయం ఎన్నికలలో కూడా రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్షపదవికి ఈయనే పోటీచేసి, ఓడిపోయాడు. ప్రస్తుత రిపబ్లికన్ నాయకులలో కెల్లా ఇతడే అధ్యక్షపదవికి అన్ని విధముల తగినవాడు. అంతర్జాతీయ వ్యవహారములలో అమెరికా తన పాత్రను నిర్వహించవలెననే ఈయన వాదించటమే గాక ఇతడొక 'అంతర్జాతీయవాది'వలె కనిపించును. ఇతడు నిలబడినచో ప్రెసిడెంట్ ట్రూమన్ నెగ్గుట చాల కష్టమగును. అమెరికన్ రాజకీయాలలో, ఒకపర్యాయం ఓడిపోయిన అభ్యర్థికి ఎట్టి భవిష్యత్తూ వుండదుగాని డ్యూయీవ్యక్తిగత ఆకర్షణ, చక్కని గొంతుక అతనికి ఒక విశిష్టస్థానం సంపాదించిపెట్టినది. ఒకవేళ డ్యూయీ అధ్యక్షుడుగా ఎన్నుకొనబడినచో, బ్రిటన్ తోను, ఇతర దేశములతోను ఇప్పటి సంబంధములను యథాతథముగా సాగించగలడు.

సెనెటర్ రాబర్ట్ టాఫ్ట్ ఒక మాజీ అధ్యక్షుని కుమారుడు. ఇతడు కరుడుకట్టిన కన్సర్వేటివ్. ఇతనిని బలపరిచెడిది కూడ పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు, పెద్ద భూస్వాములు మాత్రమే. ఇతడు అధ్యక్షుడైతే అమెరికాలో లేబర్ పార్టీ ఒకటి ఏర్పడి, త్వరగా బలపడును. కార్మికులు సమ్మెలు చేయుటను నిషేధించే ఒక చట్టాన్ని ఈయనే ప్రతిపాదించాడు. అందువల్ల ఈయనంటే కార్మికజనానికి అసహ్యం. అమెరికన్ ప్రభుత్వంతో ఈయనకు చాలకాలం నుంచి సంబంధం వుంది. వాషింగ్టన్ లోని ప్రభుత్వ యంత్రాన్ని గురించి ఈయనకు తెలిసినంత మరే ఇతర అభ్యర్థికీ తెలియదు. ఒకవేళ ఈయనే అధ్యక్షుడుగా ఎన్నుకొనబడితే, బ్రిటన్ కూ ఇతర సోషలిస్టు రాజ్యాలకూ తలనొప్పి పుట్టుకు రాకపోదు.

హెరాల్డు స్టాసెన్ అమెరికన్ రాజకీయాలలో ఒక క్రొత్తదనమును ప్రారంభించినాడు. తాను అధ్యక్షస్థానమునకు పోటీచేయుదునని నేరుగా ప్రకటించి, తనను బలపరచు ప్రతినిధులు ఎన్నికగునట్లు వివిధరాష్ట్రములలోను ప్రచారముచేసి, చాలవరకు సఫలుడైనాడు. చాల రాష్ట్రములలో ఇతని పక్షమువారే ప్రతినిధులుగా ఎన్నికైరి. స్టాసెన్ వయస్సు ఇప్పటికి 41 సంవత్సరములే. ఇతడిప్పటికే మిన్నెసోట రాష్ట్రమునకు గవర్నర్ గా పనిచేసెను. పార్టీ పెద్దల దృష్టిలో ఇతడు కుర్రవాడు. అమెరికన్ ప్రజలే నేరుగా తమ అధ్యక్షుని ఎన్నుకొన్నచో ఇతనినే ఎన్నుకొందురు. అతనికి ప్రజలలో గల గౌరవ, పలుకుబడి ఇందుకు కారణము. ఎట్టి సభలోనైనా, ఎన్నిక ప్రశ్నలకైనా తడుముకోకుండా, కాదనకుండా, నిర్భయంగా సమాధానాలు చెపుతాడు. పార్టీ ప్రతినిధుల జాతీయ సమావేశములో డ్యూయీ, టాఫ్ట్ లకు పెద్ద పోటీ జరిగినచో, ఎక్కువమంది ప్రతినిధులు ఇతనికే వోటుచేసి, ఇతనినే రిపబ్లికన్ అభ్యర్థిగా ఎన్నుకొనవచ్చునని భావించుచున్నారు.



మెకార్థర్

జనరల్ డగ్లస్ మెకార్థర్ పసిఫిక్ ప్రాంతములో మిత్రరాజ్యముల సర్వసేనానిగా, జపాన్ ను ఓడించినాడు. అప్పటినుండి జపాన్ ను పాలించుచున్నాడు. ఈయనకు పలుకుబడికన్న గౌరవము ఎక్కువ వున్నది. సైనికుడుగా ఈయన సాధించిన విజయములకు ఈయనను అందరు అభినందించెదరుకాని రాజకీయవేత్తగా ఈయనకు వోటు ఎవ్వరూ వేయరు. కొంతమంది మిత్రుల ప్రోత్సాహంతో, దేశాంతరాలలో వుండికూడా, ఈయన పోటీ చేస్తున్నాడుగాని, ఎన్నుకొనబడే అవకాశాలు శూన్యమేనని ప్రతినిధుల ఎన్నికలలోనే తేలిపోయింది.

రిపబ్లికన్ పార్టీలో కుడిపక్షమునకు నాయకుడు స్పీకర్ మార్టిన్. ఈయన బ్రహ్మచారి. వయస్సు 63. ఈయనకు సర్వమూ రాజకీయాలే. కాని ఎన్నుకొనబడే అవకాశములేదు.



సెనెటార్ వాన్ డెన్ బర్గ్

రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులలో ప్రజ్ఞావంతుడు, రాజనీతిజ్ఞుడు సెనెటర్ ఆర్థర్ వాండెన్ బర్గ్. అమెరికన్ సెనేట్ లో విదేశవ్యవహారముల సంఘమునకు ఈయన అధ్యక్షుడు. ఆ హోదాలో మార్షల్ పథకమును ఈయన బలపరచినాడు. మార్షల్ పథకము ప్రకారం విదేశాలకు చేయవలసిన ధనసహాయపు మొత్తాన్ని అమెరికన్ శాసనసభ ఈయన వద్దంటున్నా తగ్గించివేయటంవల్ల రిపబ్లికన్ లలో ఈయనకు ఎంతో పలుకుబడి లేదని తేలిపోయింది. రిపబ్లికన్ పార్టీ తరఫున ఈయన నిలబడితే, ప్రెసిడెంట్ ట్రూమన్ తిరిగి ఎన్నుకొనబడే అవకాశం సన్నగిలిపోగలదనే అనేకుల అభిప్రాయం. కాని చివరివరకు ఈయన పోటీచేయటానికే అంగీకరించలేదు. పార్టీ సమావేశం జరుగుతుండగా, ఈయన కూడా పోటీలో చేరాడు.

రిపబ్లికన్ పక్ష జాతీయ సమావేశము ఫిలడెల్ఫియాలో గత సోమవారంనాడు ప్రారంభమైనది. అన్ని రాష్ట్రాలనుండి 1096 మంది అభ్యర్థులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రిపబ్లికన్ పార్టీ తరఫున అమెరికన్ అధ్యక్షపదవికి అభ్యర్థిగా ఎవరు పోటీ చేయాలా అనే విషయమును నిర్ణయించటమే ఈ సమావేశ కార్యక్రమం. పార్టీ అభ్యర్థిత్వమును సంపాదించటానికి పైజెప్పిన వ్యక్తులందరూ పోటీచేశారు. మొదటి పర్యాయం ఓట్లు తీసుకొన్నప్పుడు డ్యూయీకి 435; టాఫ్టుకు 224; స్టాసెన్ కు 157; వాండెన్ బర్గ్ కు 62; వారెన్ కు 59; మెకార్థర్ కు 11 వోట్లు వచ్చాయి. మొత్తం ప్రతినిధుల సంఖ్యలో అందులో సగమైనా వోట్లు సంపాదించినగాని ఏ వ్యక్తి గెలుపొందినట్లు నిర్ణయించుటకు వీలులేదు. మొదటి బాలెట్ లో ఏ అభ్యర్థికీ తగినన్ని వోట్లు రాలేదు కాబట్టి అట్టి మెజారిటీవోట్లు వచ్చేవరకూ బాలెట్ లు జరుపుతూనే వుంటారు. రెండవ పర్యాయం జరిగిన బాలెట్ లో డ్యూయీకి 515; టాఫ్టుకు 274; స్టాసెన్ కు 149; వాండెన్ బర్గ్ కు 62 వోట్లు వచ్చాయి. ఈ పర్యాయంకూడా ఏ అభ్యర్థికీ కావలసినన్ని వోట్లు రాలేదు. అందువలన మూడవపర్యాయం కూడా బాలెట్ జరుగవలసివున్నది. కాని స్టాసెన్, టాఫ్టు లిద్దరూ పోటీనుండి విరమించిరి. అందువలన డ్యూయీ ఏకగ్రీవముగా పార్టీ అభ్యర్థిగా ఎన్నుకొనబడెను.

డ్యూయీతో పోటీచేయుట ప్రెసిడెంట్ ట్రూమన్ కు కష్టమే. అయినా డ్యూయీ ఇదివరకు ఒక పర్యాయము ఓడిపోయివున్న వ్యక్తి కాబట్టి ప్రెసిడెంట్ ట్రూమన్ ఈ పర్యాయం ఎన్నికలలో విజయము పొందే అవకాశము సన్నగిలిపోలేదనే చాలమంది అభిప్రాయపడుచున్నారు. అమెరికన్ ఎన్నికల సంరంభములో ఇప్పటి కొక దశ గడచినది. రానున్న నెలలో రిపబ్లికన్, డిమాక్రెట్ అభ్యర్థులు తమతమ విధానములను తెలియజేస్తూ ఇంతకన్న విరివిగా ప్రచారము సాగింపగలరు.

శ్రీ సీతంరాజు సుబ్రహ్మణ్యశర్మ.

భారతరాజకీయాలు :

నిజాంతో తిరిగి సంప్రదింపులు జరుగునా?

కాంగ్రెస్ నాయకుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సోషలిస్టు నాయకుడు శ్రీ జయప్రకాశ్‌నారాయణ లక్నోలో ఒకే రోజున పరస్పర విధానాలను విమర్శించుకొనుచు బహిరంగసభలలో ఉపన్యసించిరి. సోషలిస్టులు కాంగ్రెస్‌నుండి వైదొలగినప్పుడు, కాంగ్రెస్ టికెట్టుపై ఎన్నికైన శాసనసభ్యులు తమ శాసనసభా సభ్యత్వమునకుకూడ రాజీనామా నిచ్చిరి. యు. పి. శాసనసభలో అట్టి ఖాళీలను భర్తీ చేయుటకు ఇప్పుడు ఎన్నికలు జరుగుచున్నవి. రాజీనామా సోషలిస్టు సభ్యులు సోషలిస్టుపార్టీ అభ్యర్థులుగా తిరిగి నిలబడుచున్నారు. వీరితో పోటీచేయుటకు కాంగ్రెస్ క్రొత్త అభ్యర్థులను నియమించెను. ప్రఖ్యాతనాయకుడు ఆచార్య నరేంద్రదేవ్‌తోకూడ పోటీ చేయవలెననియే కాంగ్రెస్ నిర్ణయించినది. ఈ పోటీ కాంగ్రెస్ సోషలిస్టుపార్టీల బలాబలప్రదర్శనగా పరిణమించినది. కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారము జరుపుటకు భారత ప్రధాని పండిట్ నెహ్రూ స్వయముగా ఏతెంచెను. సోషలిస్టు అభ్యర్థుల తరఫున సోషలిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి జయప్రకాశ్ నారాయణ ప్రచారమునకు గడంగిరి. నిన్న మొన్నటివరకు కలసి పనిచేసిన ఈ అగ్రనాయకు లిరువురు ఇప్పు డొకరొకరికి వ్యతిరేకముగా విచిత్రముగా ప్రచారము చేసుకొనుచున్నారు. యు. పి. పండిట్ నెహ్రూ స్వరాష్ట్రము. అందును లక్నోపట్టణము ఆయన స్వంతగృహమువంటిది. అయితే యు. పి. లోనే సోషలిస్టుల కెక్కువ బలమున్నది. మొన్న మొన్ననే సోషలిస్టులు కాంగ్రెస్‌వారితో జిల్లా బోర్డు ఎన్నికలలో తీవ్రముగ పోటీచేసి ఆశాతీతమైనంతటి జయము సాధించిరి. సోషలిస్టు పార్టీ విడిపోయి అప్పటికి కొన్ని నెలలైన కాలేదని జ్ఞాపక ముంచుకొన్నచో ఆ విజయము గణింపదగినదేనని ఒప్పుకొనక తప్పదు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోయినచో కాంగ్రెస్ ప్రతిష్ఠ చాల నశించును. సోషలిస్టులకు మంచి స్థైర్యము, ఉత్సాహము లభించును. అందువలననే కాంగ్రెస్‌వారు ఈ ఎన్నికలను గురించి అతి జాగ్రత్తపడుచున్నారు.

వస్తుతః పండిట్ నెహ్రూ సోషలిస్టు. భారతదేశములో సోషలిస్టు వ్యవస్థను స్థాపించవలెననియే ఆయన వ్యక్తిగత ఆశయము. పరిపాలనా యంత్రమును వశపరచుకొనువాడు కూడ తన ఆశయమును సాధించితీరవలెనని ఆయన బహుశః గట్టిగా నిర్ధారణ చేసికొని యుండవచ్చును. కాని పరిపాలన తన హస్తగతమై, అందలి సాధక బాధకములు తెలిసివచ్చిన తర్వాత ఇప్పుడా యనుభవముతో ఆయన ఉద్దేశ్యములను, ఆశయములను మార్చుకొనక పోయినను కొంతవరకు వెనకకు నెట్టివేయక తప్పలేదు. 'బయటవుండి ఎన్నికబుర్లైనా చెప్పవచ్చు. పని ప్రారంభిస్తే కదా కష్టసుఖాలు తెలిసివచ్చేది. బయట వున్నప్పుడు నేనూ నీకన్న ఎక్కువగానే ఆశించాను' అనే ధోరణిలో ఆయన లక్నోలో ఉపన్యసించాడు. కాంగ్రెస్ విధానములలోగాని, వ్యక్తులలోగాని లోటుపాట్లు లేవని ఆయన అనలేదు. ప్రస్తుత పరిస్థితులలో దేశరక్షణ, పురోభివృద్ధి భారమును వహింపగల్గిన సంస్థ కాంగ్రెసు ఒక్కటే కాబట్టి దానినే అందరు బలపరచవలెనని ఆయన వాదము. కాంగ్రెస్‌వంటి బలవత్తరమైన సంస్థ ఈనాడు దేశములో లేకపోవచ్చును. కాని మరికొంత కాలము రాకూడదా? కాంగ్రెస్‌లో లోటుపాట్లను సరిదిద్దుకొనుటకు ప్రయత్నములు చేసిరా? ఒకవంక కాంగ్రెస్ దినదినము బలహీనపడిపోవుచు, వేరొకవంక, ఇతర సంస్థలు దినదినాభివృద్ధి గాంచుచున్న కాంగ్రెస్‌ను అణగద్రొక్కివేయుటకు ఎంతకాలము పట్టును? అను ప్రశ్నలకు ఈ వాదము నిలువదు. కాంగ్రెస్ భవిష్యత్తులోకూడ భారతదేశమునకు సేవచేయుచుండవలెనన్న, అంతరంగిక లోటుపాట్లను సరిచేసుకుని, ఆశయసాధనకొరకు దినదినము ప్రయత్నించుచు, పురోగమించుచు, బలపడుచుండవలెను. లేనిచో అది త్వరలోనే తన ప్రాబల్యమును పోగొట్టుకొనును. అనుకున్న పనులు, పరిపాలనాయంత్ర ఆటంకములవలన కొంతకాలము వెనుకపడవచ్చునుగాని అవి మొదట ఆశించిన ధోరణిలో నున్నవా లేదా అనునది పరిపాలనా యంత్రమునకు సంబంధించని ప్రశ్న. కాంగ్రెస్ ఆర్థికాశయము లొకవిధముగా నుండగా, వ్యవహారధోరణి వేరొకవిధముగా నున్నదనియే సోషలిస్టుల ఆరోపణ.

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరులో వలెనే జయప్రకాశ్‌నారాయణ పేరులో కూడ ఒకవిధమైన ఆకర్షణ వున్నది. అన్ని రాష్ట్రములలోను, ముఖ్యముగా బీహార్, యు. పి లలో ఆయనకు మంచి పలుకుబడి వున్నది. నిన్న మొన్నటివరకు ఈయన కాంగ్రెస్‌లో వుండి గాంధీజీ, నెహ్రూజీలను అనుసరించినవాడే. కాంగ్రెస్‌నుండి విడిపోవుటకు సోషలిస్టులు అంతకాలము తటపటాయించుటకు బహుశః ఈయనయే కారణమై వుండవచ్చును. ఈయన లక్నో ఉపన్యాసమంతయు కాంగ్రెస్‌ను విమర్శించుటకే వినియోగింపబడినది. ఆగస్టు 15 వ తేదీ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వపక్షముగా మారిపోయినది. ప్రభుత్వయంత్రములోను పరిపాలనా విధానములోను మార్పు తేవలెనని ఆశించుచుండిన కాంగ్రెస్ వాటిని మార్చలేక తానే మారిపోయినది. ప్రభుత్వవ్యవహారము లిప్పుడు బ్రిటిష్‌పాలనాసమయమునకన్న అధ్వాన్నముగ నున్నవి. కాంగ్రెస్ వ్యతిరేకులను అనవసరముగ మిషలపై నిర్బంధించుచున్నారు. ప్రభుత్వము సోషలిస్టుల హస్తగతమైనచో అరాచకము వచ్చునని అనవసరముగా ప్రజలను హెచ్చరించుచున్నారు. నిన్నటివరకు సోషలిస్టులు కాంగ్రెస్‌లోనే వుండిరికదా! అప్పుడే అరాచకమేమైనది? అను ధోరణిలో ఆయన కాంగ్రెసును విమర్శించినాడు. ఆగస్టు 15 వ తేదీ తర్వాత కాంగ్రెసులో ప్రతీపశక్తులకు ప్రవేశము లభించి అధికారము వారి హస్తగతమై, నెహ్రూలాంటి అభ్యుదయవాదులు అనుకున్నట్లు పని జరుగుటలేదు. భారతదేశములో సోషలిస్టు వ్యవస్థను స్థాపింపవలెనన్న సోషలిస్టుపార్టీయే అపని చేయగలదు అని ఆయన వాదము. సోషలిస్టుపార్టీకి కొన్నిచోట్ల మంచి ప్రాబల్యమున్నదను సంగతి అందరు అంగీకరింతురు. మరికొన్నిచోట్ల సోషలిస్టుపార్టీ పేరునకు మాత్రమే వున్నది. గ్రామముల సంగతటుంచి, అనేకపట్టణములలోనే సోషలిస్టు పార్టీ యంత్రము పనిచేయుటలేదు. ఈ పార్టీ ఎప్పటికో బలపడి, అధికారము వహించి, సోషలిస్టు వ్యవస్థను స్థాపించునని నోట్లో వేలువేసుకుని వేచివుండవలెను కాబోలు! సోషలిస్టులు తమ విజయమునకు తమ బలముపైకన్న కాంగ్రెస్ బలహీనతపైననే ఎక్కువ ఆధారపడదలచినట్టున్నది. సోషలిస్టుపార్టీ యంత్రనిర్మాణము, పార్టీ ఆశయప్రచారము బహుమందముగ జరుగుచున్నవి. ఇవి ఇట్లే జరిగినచో కాంగ్రెస్‌ను బలపరచుటకన్న గత్యంతర ముండదు.

కాంగ్రెస్, సోషలిస్టు నాయకు లిరువురు ఒకరి లోపముల నొకరు ఏకరువు పెట్టుకొనిరి. కాని తమ లోటుపాట్లను గురించి విచారించినట్టు లేదు. తమ లోటుపాట్లను పరిశీలించుకొనుటకు వీరు ఇకముందైనను తీవ్రకృషి చేసినచో రెండు పక్షములు బలపడి, దేశఅభ్యుదయమునకు చక్కగా తోడ్పడగలవు.

నిజాంతో తిరిగి సంప్రదింపులా?

నిజాం భారతప్రభుత్వాల సంప్రదింపులు భగ్నమైనప్పుడు పత్రికావిలేఖరుల సభలో పండిట్ నెహ్రూ ప్రసంగించుచు ఇక సంప్రదింపులు జరిపే అవకాశం లేదని చెప్పాడు. భారతప్రభుత్వమునకు అంగీకారయోగ్యమైన కనీసషరతులు సూచింపబడినవి. వీనిని అంగీకరించటమో, లేదో నిజాం తేల్చుకొనవలెను. అంతేగాని భారతప్రభుత్వం ఈ షరతులలో ఎట్టిమార్పును అంగీకరింపజాలదు. అని ఆయన స్పష్టముగా చెప్పెను. అందువల్లనే అప్పుడు నిజాం-భారత ప్రభుత్వాల సంప్రదింపులు భగ్నమైపోయినట్లే భావించబడెను. కాని నిజాం, అతని సలహాదారులు వేరొకవిధముగా భావించుచున్నట్లున్నది. ప్రతిపర్యాయము సంప్రదింపులలోను వారు భారతప్రభుత్వమునుండి ఒకటి రెండు ప్రత్యేక సౌకర్యములను గుంజుకొనుటకు అలవాటుపడిరి. సంప్రదింపులు ఆపివేసి మరల సంప్రదింపులు ప్రారంభించుటల్లా వారికి లాభదాయకముగానే పరిణమించుచుండెడిది. ఈ విషయములో వారికి ముస్లింలీగ్-కాంగ్రెస్ సంప్రదింపుల చరిత్రకూడ మార్గదర్శకముగా నున్నది. సంప్రదింపు లన్నచో భారతప్రభుత్వము కొన్ని సౌకర్యములను అవతలి పక్షమునకు కట్టబెట్టుట అని యర్థముగా పరిణమించినది. అందువలన నిజాంతో ఇక సంప్రదింపులు జరుపబోవుట లేదని పండిట్ నెహ్రూ ప్రకటించినప్పుడు భారత ప్రజలు సంతసించిరి. నిజాం ఆటలు ఇక సాగవని తలంచిరి. కాని తరువాత జరుగుచున్న సంఘటనలు అసంతృప్తి కల్గించునవిగా నున్నవి. భారతప్రభుత్వము సూచించిన ముసాయిదాను అంగీకరించవలసిందని మౌంట్‌బాటన్ ప్రభువు పదవీవిరమణకు పూర్వము మరొక్కమారు నిజాంకు విజ్ఞప్తిచేసెను. కాని ఈ విజ్ఞప్తి కూడ, అనుకొన్నట్లుగానే, త్రోసిపుచ్చబడెను. మౌంట్‌బాటన్ తరువాత గవర్నర్ జనరల్ పదవి నాక్రమించిన శ్రీమాన్ రాజగోపాలాచారిగారు తనకు సహాయముచేయుదురని నిజాం ఆశ. ముస్లింలీగ్ కోరిన పాకిస్థాన్‌కు ఒప్పుకొనిన ప్రథమ కాంగ్రెస్ నాయకుడు రాజాజీయే. జిన్నాకన్న ఎక్కుడుగ పాకిస్థాన్ నప్పుడు ఈయన సమర్థించెను. ఇప్పుడు అతడు తనకు సాయపడకపోవునా అని నిజాం ఆశపడుచున్నాడు. పైగా భద్రతామండలి కాశ్మీర్ సంఘము త్వరలోనే ఇండియాకు రానున్నది. ఈ సంఘము భారతదేశములో నుండగా నిజాం సమస్య చర్చకు వచ్చును. విదేశప్రతినిధుల దృష్టిలో ముస్లిములపట్ల సౌజన్యముతో వ్యవహరించుచున్నట్లు కనపడుటకైనను భారత ప్రభుత్వము నిజాంకు మరి ఒకటిరెండు ప్రత్యేక సౌకర్యము లివ్వవచ్చును. కాబట్టి కొద్దికాలము పోయిన తర్వాత తిరిగి సంప్రదింపులు ప్రారంభించినచో మరి రెండు సౌకర్యములు గుంజుకొనవచ్చునని ఆశించి, నిజాం భారతప్రభుత్వము సూచించిన షరతులను నిరాకరించెను. ఇప్పుడు సంప్రదింపులు తిరిగి ప్రారంభించుటకు నిజాం ప్రతినిధులు ప్రయత్నించుచున్నారు.

రాజాజీ గవర్నర్ జనరల్‌గా పదవీస్వీకరణ చేసిన సందర్భమున కాశింరజ్వీ, నిజాంలు ప్రత్యేక అభినందనల నంపిరి. ఖాసింరజ్వీ తన జన్మలో ఇంతవరకు ఏ హిందువును పొగడి యుండకపోవచ్చును. కాని రాజాజీని మాత్ర మాతడు కడుంగడు శ్లాఘించెను. దీని కాతడాశించు ప్రతిఫలమేమో మనకు తెలియక పోలేదు. నిజాం రాజాజీని అభినందించుచు, కల్లోలపూరితమైవున్న భారతదేశములో శాంతిని స్థాపించవలసిందని అర్థించినాడు. ఈనాడు భారతదేశములో కల్లోలపూరితముగ నున్నది. హైదరాబాద్ సంస్థానమొక్కటే. అందు శాంతి స్థాపించుటకు నిజాం వైదొలగుటొక్కటే మార్గము. రాజగోపాలాచారిగారందుకు తప్పక కృషి సల్పెదరుగాక!

రాజాజీ పదవీస్వీకరణ చేసిన మరునాడే నిజాం ఏజెంట్-జనరల్ ఆయనను దర్శించి సుదీర్ఘకాలము సంప్రదింపులు జరిపెను. తరువాత ఆతడు పండిట్ నెహ్రూనుకూడ దర్శించెను. వెంటనే ఢిల్లీనుండి హైదరాబాద్ వెళ్లి నిజామును, ఆయన ప్రధాని లాయిక్‌అలీని దర్శించి, భారత గవర్నర్ జనరల్, ప్రధానులతో తాను జరిపిన మంతనముల వివరముల నెరింగించెను. మరొక 10 రోజులలో నిజాం భారత ప్రభుత్వాలమధ్య సంప్రదింపులు తిరిగి ప్రారంభమగునని అభిజ్ఞ లభిప్రాయపడుచున్నారు. ఢిల్లీ అధికారవర్గము ఈ ఊహ సరికాదని చెప్పలేకున్నారు. పండిట్ నెహ్రూ 10 రోజుల క్రితమే చేసిన విస్పష్ట ప్రకటన ఏమైపోయినది!

ఇట్లొకవంక తిరిగి సంప్రదింపుల జరుపుటకు ప్రయత్నించుచు వేరొకవంక యుద్ధసన్నాహములను నిజాం తీవ్రతర మొనర్చుచున్నాడు. పాకిస్థాన్‌నుండి ప్రతిదినము రహస్యముగా విమానముల ద్వారా ఆయుధములు నిజాంకు అందుచున్న సంగతి ఇప్పుడు స్పష్టపడినది. హైదరాబాద్ సంస్థానములోని ప్రజల బాధలు నానాటికి హెచ్చు పెరిగిపోవుచున్నవి. భారత ప్రభుత్వ మిప్పుడైనను సంప్రదింపుల అధ్యాయమును సమాప్తమొనరింపకపోయినచో ప్రమాదము తప్పకపోవచ్చును.

గవర్నర్ జనరల్ అధికారములు

భారత గవర్నర్ జనరల్‌గా లార్డ్ మౌంట్‌బాటన్ తన పదవిని విరమించినాడు. శ్రీమాన్ చక్రవర్తి రాజగోపాలాచారి ప్రథమ భారతీయ గవర్నర్ జనరల్‌గా పదవీ స్వీకరణ చేసినాడు. సోదర భారతీయుడు గవర్నర్ జనరల్ అయినందుకు భారతదేశము గర్వించినది; ప్రపంచము హర్షించి, అభినందించినది.

భారత అధినివేశ గవర్నర్ జనరల్‌కు ఇతర అధినివేశ గవర్నర్ జనరల్‌లకన్న, ఎందువలననో గాని, ఎక్కువ అధికారములు, ప్రాబల్యము లభించుచున్నవి. భారతదేశము క్రొత్త అధినివేశమగుటయే, బహుశః ఇందుకు కారణము కావచ్చును. కాని ఇది చాల త్వరలో ఆపివేయదగిన దురాచారమని చెప్పక తప్పదు. రాజ్యాంగ చట్టరీత్యా, గవర్నర్ జనరల్‌కు ఏ అధికారము లేదు. మంత్రివర్గము, అందును ప్రధానమంత్రి, ఏమిచెప్పిన అది చేయుటే అతని కర్తవ్యము. మౌంట్‌బాటన్ ఏదో గొప్ప రాజకీయ వేత్తయని మనవారు కోరితెచ్చుకొనిరి. అందువలన అతడు ప్రత్యేకాధికారములు చెలాయించెను. నిజాం, కాశ్మీర్ వ్యవహారములలో ఆయన తరచు పాల్గొనుచుండెడివాడు. నిజాం సలహాదారు సర్ వాల్టర్‌మాంక్టన్ సరాసరి మౌంట్‌బాటన్‌తో సంప్రదింపులు జరుపుచుండెడివాడు. ఇట్టి అశాస్త్రీయ చర్యలవలన భారతప్రభుత్వ మిప్పటికే చాల నష్టపడినది. నూతన గవర్నర్ జనరల్ రాజాజీకూడ మౌంట్‌బాటన్ పంథానే అనుసరించునట్లున్నాడు. ఈయన పదవీస్వీకరణ చేసిన మరునాడే నిజాం ఏజెంట్ జనరల్‌తో మంతనములాడుట, నిజాంతో సంప్రదింపులు తిరిగి ప్రారంభింపబడును అను అనుమానమును దృఢపరచినది. భారత ప్రభుత్వము సంప్రదింపులు సాగించబోవుట లేదని ప్రధాని నెహ్రూ ప్రకటించి 10 రోజులైన కాలేదు. ఆయన మాటను గవర్నర్ జనరల్ త్రోసిపుచ్చినచో ప్రధాని మంత్రిపదవికే అగౌరవము వాటిల్లును. గవర్నర్‌జనరల్ తన మంత్రుల నిర్ణయములను మీరిపోరాదను సూత్రమును ఇప్పటికైనను ఆచరణలో గౌరవించుట అత్యవసరము. క్రొత్త గవర్నర్ జనరల్, అతని మంత్రివర్గము ఈ విషయమై ఒక సాంప్రదాయమును త్వరలోనే ప్రారంభించునని ఆశించుచున్నాము.

బ్రాహ్మణ బిరుదాలు

బ్రహ్మశ్రీ శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు

'అవధాని' 'శాస్త్రి' 'సోమయాజి', 'కవి', 'భట్టారక', 'శర్మ'—యిత్యాదులు బ్రాహ్మణ బిరుదాలు. యిందులో విద్యాప్రయుక్తాలు కొన్ని; కొన్ని కర్మప్రయుక్తాలు. యివి కాక 'రావు' అనేది కూడా కొన్ని శతాబ్దాల క్రిందటనే బ్రాహ్మణులకి బిరుదంగా వాడుకలోకి వచ్చింది. బహుశః యీ రావు రాజశబ్దానికి వికృతిగా వూహించబడుతుంది. మహారాష్ట్రులు కొంతకాలం రాజులుగా వుండడం చేతనూ, వారు బ్రాహ్మణజాతి (పంచద్రావిళ్లు చూ.) కావడంచేతనూ ఆ రోజుల్లో యీ రావు శబ్దం ప్రత్యేకించి వారికోసం పుట్టినట్టు కనిపిస్తుంది. బాలాజీ బాజీరావు లోనైనవి దీనికి వుదాహరణం. యీ ప్రభువును బాజీరాయడనికూడా వాడడం వుంది. కనకనే "బాజీరాయడా చోరగ్రహణం, తోవలో చోరగ్రహణం" అనే పనసలో రావుకు పర్యాయంగా ఆ ఘనాపాఠీలు ఆ విధంగా సంబోధించారు.

బాజీరావుగారిచే సన్మానింపబడి స్వదేశానికి వస్తూ వుండగా ఆస్వాధ్యాయపరులకు చోరబాధ తటస్థించిందనిన్నీ వెంటనే మళ్లా ఆ శ్రీమంతుడి దగ్గఱికి (ఈ ప్రభువుకు శ్రీమంతుడనిన్నీ ఒకపేరు వుంది) వెళ్లి ఆ విషయం వేదస్వరంతో మనవి చేసికొన్నారనిన్నీ, తిరిగీ సన్మానించి పంపినారనిన్నీ వినికి. ఆయీ శ్రీమంతుడే కాశీలో అన్నపూర్ణసత్రం పెట్టించిన పుణ్యపురుషుడు.

ప్రస్తుతం రావుశబ్దం బ్రాహ్మణులలోకి యేలా వచ్చిందో దాన్ని గూర్చి వ్రాస్తూన్నాను. మహారాష్ట్రులనుండి కర్ణాటకులు (ద్వైతులు) స్వీకరించారు. వారినుండి నియోగులు, వారినుండి వైదికులు, క్రమంగా కోమట్లు, కాపులు తక్కిన నిమ్నజాతులు. వాళ్లేమిటి, వీళ్లేమిటి యావన్మందీ దీన్ని ప్రేమించారు గాని, క్షత్రియులు దీని జోలికి వచ్చినట్లు లేదు. కమ్మవారు కూడా దీన్ని ప్రేమించినట్లు కనపడదు. (దీన్ని గూర్చి వాకబు చేయాలి).

బ్రాహ్మణుడు పుట్టీ పుట్టడంతోనే అవధాని గాని, శాస్త్రిగాని కాడు. ఉపనయనందాకా యే బిరుదూ లేకుండానే వుండి, అది మొదలు "అసుబ్రహ్మణ్యశర్మ అహంభో అభివాదయే" లోకి వస్తాడు. "భూసురకీర్తి బ్రాహ్మణుడు పుట్టినతోడనే పుట్టు సుత్తమజ్ఞానము ఇయ్యది అనకట్టుకు పూర్వమ్మట". భవతు—అయితే సోమయాజి అనిపించుకోవడానికి యజ్ఞం చేయడం యేలాటిదో శర్మ అనిపించుకోవడానికి వుపనయనం అలాటిది కాదు. యిక నేమిటంటే, బ్రాహ్మణమాత్రుడికి యీ శర్మబిరుదమందు హక్కు జన్మతోనే (స్వరాజ్యం నా జన్మ హక్కు అన్నట్లు) కలుగుతుం దన్నమాట.

యీ పదానికి అర్థం సుఖం. బ్రాహ్మడు క్షత్రియాదులవలె కాయకష్టంతో సంబంధించిన యుద్ధాదులు చేయక చదువుసంధ్యలతో కాలక్షేపం చేస్తాడు కనక, ఆ జాతికి యిది సమన్వయిస్తుందని నా వూహ. యేదో వేదమో, శాస్త్రమో, చదివి, అందులో పాండిత్యాన్ని సంపాదించుకుంటే వారు తత్తదనుగుణమైన బిరుదులతో వ్యవహరింపబడడమే సర్వత్రా అనుభూతం. కాని కొందఱు (నూటికొకరు) అలాటివారుకూడా శర్మలుగానే వుండిపోతారు. యింకో విశేషం. వేదాదివిద్యలలో పాండిత్యాన్ని సంపాదించి అవధానీ, శాస్త్రీ లోనైన బిరుదులు సంపాదించి, లోకవ్యవహారంలో ఆ పేళ్లతో వ్యవహరింపబడేవారు కూడా శ్రౌతస్మార్తకర్మలలోమాత్రం ఆ బిరుదులు వ్యవహరించుకోక శర్మబిరుదాన్నే వ్యవహరించుకోవడం అనాదిగా శిష్టాచారంగా వస్తూ వుంది. బాగా పరిశీలిస్తే బ్రాహ్మడికి శర్మబిరుదం వంటిది యే బిరుదమూ కాదని తేలుతుంది. కర్మప్రయుక్తమైన బిరుదాలకంటె కూడా దీనియందే మన ఆర్యులకు గౌరవం ఎక్కువ. యింతటి పవిత్రమయింది వేఱొకటి కాదని అనుకోవాలి. యీ శర్మబిరుదాన్ని నేటి వఱకు నాన్‌బ్రామిన్సు (యెవరో వొకాయన తప్ప) ప్రేమించినట్లు లేదు. శాస్త్రి బిరుదం మట్టుకు క్వాచిత్కంగా బ్రాహ్మణేతరులలో నేడు కనపడుతుంది. ఆ కనపడడం ఆ బిరుదుగలవారియందు వుండే భక్తి ప్రపత్తులను పురస్కరించుకొని తల్లిదండ్రులు వారిపేరు పెట్టడంగాని మఱొకటి కాదు.

> "బిడ్డల కెందఱు పేరు పెట్టిరన్
> దీరునె? మీ ఋణం బయిన
> దచ్చితి గాన పరిగ్రహింపుమ,
> య్యా! రఘునాథభూప! రసి
> కాగ్రణి! మామక కావ్యకన్యకన్"

అన్నాడు చేమకూర. అయినా తలోచితంగా వుండక పోవడంచేత కాబోలు ఆ పేరు యేమిటో వినేవాళ్లకు యెబ్బెట్టుగా వుంటుంది.

కర్మలు నెఱవేర్చుకునేటప్పుడు నిన్నమొన్నటి దాకా శూద్రులు—'దాస' అనే బిరుదాన్ని అంగీకరించేవారు కాని యిటీవల యెవరో బ్రాహ్మణులే ఆ పదానికి అపార్థం వుందని బోధించడంచేత దాన్ని త్యజించి క్షత్రియోచితమైన వర్మపదాన్ని ధరిస్తూన్నారు. యీ ధరించడం కృష్ణా, గుంటూరుజిల్లాలలోనే విస్తరించి కనపడుతుంది.

లోగడ వేలంవెఱ్ఱిగా యీ బ్రాహ్మణబిరుదాలకోసం యెగబడ్డారు గాని, క్రమంగా ఆ మోజున్నూ యిటీవల తగ్గినట్లే కనపడుతూ వుంది. నిజమైన బ్రాహ్మణవర్తనవంటి సుఖం లేదు గాని, అది పూర్తిగా ఆ కులస్థులయందే క్షి॥ శే॥ బిరుదాన్ని పొందింది. యిప్పు డున్న బ్రాహ్మణత్వం యావత్తూ కృత్రిమం. నాన్‌బ్రామిన్సు దీన్నే అనుకరించాలి. వేషభాషలు నూటికి 90 మంది అనుకరించ గలరనే నేననుకుంటాను. కాని "తన్మంత్రం బ్రాహ్మణాధీనం"—యిక్కడ చిక్కు. భోజరాజంతటి మహాకవి—"శేషాం ప్రకాశనదశా చ మహీసురైశ్చేత్, శానంతరేణ నిపతేత్క్వను మన్త్రిణా మః" అన్నాడు. ఆ విద్వన్మహాకవి నాటికే యీ తెలుగు ద్విజులలోనే (క్షత్రియులూ, వైశ్యులూ బ్రాహ్మణులు కారుగాని ద్విజులే కదా) అంకురించినట్లు ఆయన చంపూరామాయణశ్లోకం చెపుతూ వుందిగదా. అంకురించినా క్షత్రియప్రభుత్వ మున్నంతకాలం వర్ణాశ్రమాచారాలకు చ్యుతి కలగడానికి వీలు కలగలేదు. అది సందులతో అంతరించింది. చంద్రగుప్త ప్రభృతులు ద్విజేతరులైనా వైదికాచారాలకు భంగం కలిగించేవారిని క్షమించలేదు. ఇకనల్లా హూణప్రభుత్వం "బాపడు బుఱ్ఱలక్ గొఱుగ వచ్చును"—యిత్యాది మార్పులకు అవకాశం యిచ్చింది. క్రమంగా యిప్పుడు బ్రాహ్మణాదిభేదం తొలగి 'శాకాహారులు, మాంసాహారులు'—యీ రెండే జాతులుగా యేర్పడ్డాయి. యివేనా కంచప్పొత్తుకే గాని మంచప్పొత్తుకు కాదు. స్వరాజ్యం వచ్చి మన హిందూదేశానికి చేసిన మహోపకారం యిప్పటి కిది.

యీ అల్లకల్లోలంలో శర్మ బిరుదానికి ఆపేక్షపడే నాన్‌బ్రామి న్సంటూ వుంటారా! వుండరనే నా నమ్మక. అంత ఖంటే పిమ్మట చూచుకుందాం. అందుచేత దాన్ని గుఱించి యేదో కొంత సుమారు రెండేళ్ళనాడు వ్రాసిన యీ వ్యాసపు కాగితాలు దొరికినా వాట్లను అంతటితోనే ముగించడమే యుక్తంగాని ధర్మశాస్త్రాలు గిర్మశాస్త్రాలు యెత్తుకొని కోలాహలం చేయడం, యుక్తం కాదని తోచి (దేశకాలపాత్రాలు గుఱితింపని జ్ఞానం జ్ఞానం కాదు గదా!) విరమించుచున్నాను.

ఉత్తరభారత కధలు :

జనమేజయుడు

శ్రీ పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి

పరీక్షిన్మహారాజు తక్షకునిచే దారుణమరణము నొందునాటికి జనమేజయమహారాజు తండ్రిని బాగుగా నెఱుగనంతటి చిన్నవాడుగా నుండెను. పరీక్షిత్కుటుంబమునందును, కురురాజ్యము నందును భక్తిప్రేమలు గల మంత్రులు జనమేజయుని సింహాసనముపై నుంచి యాతని పేరుతో తాము రాజ్యమునం దల్లకల్లోలములు లేకుండగ పరిపాలించు చుండిరి. ఆకాలముననే తక్షకాది నాగులు సింధు, గాంధారాదిదేశములను జయించి తక్షశిలారాజ్యమును స్థాపించిరి. జనమేజయుడు ఉపనీతుడై పాండవపురోహితుడగు ధౌమ్యుని శిష్యుడైన 'వేదుడు' అను ముని కడ, 'పుష్యుడు' అను ఇక్ష్వాకువంశజుడగు రాజపుత్రునితో విద్యాభ్యాసము చేసెను. జనమేజయుడు గుర్వాశ్రమమునుండి వదలుకాలమున 'ఉద్దాలకుడు' అను మునిపుత్రుడు వేదునికడ శిష్యుడుగా జేరెను. జనమేజయుడు హస్తిపురికి వచ్చినపిమ్మట మంత్రులు అతని సమ్మతితోడనే 'కాశీరాజగు 'సువర్ణవర్మ' అనువానియొక్క పుత్రికయగు 'వపుష్టమ' అను కన్యను అడిగి తెచ్చి జనమేజయమహారాజునకు వివాహము చేసిరి. (వపుష్టమ-రంభయొక్క అవతారమని హరివంశమున గలదు). యౌవనమున, వపుష్టమా జనమేజయులు కొంతకాలము శృంగారలోలురై వనవిహారాదులం జేయుచుండిరి. ఆ కాలమున తక్షశిలారాజ్యమునుండి నాగజాతులవారు తొమ్మిది ఆయుధ జీవిక గణములుగా* జేరి పరిసరరాజ్యములకు నుపద్రవములం గల్గించు చుండిరి. ఇట్లుండ వేదుని శిష్యుడగు 'ఉదంకుడు' విద్యాసమాప్తి చేసి తన గురువునకు దక్షిణగా నేదేని యిత్తుననగ, వేదునిభార్య పుష్యు డను రాజుయొక్క భార్యధరించు మకరకుండలముల దెమ్మని కోరెను. ఉదంకుడు పుష్యునిభార్యను అడిగి మకరకుండలములను దెచ్చుచుండ తక్షకుడు ఉదంకుని మోసగించి మకరకుండలముల నపహరించి పరుగిడెను. ఉదంకుడును వానిని వెన్నాడి ఇంద్రుని సహాయమున భూగర్భమునందుండిన తక్షశిలాపురిని జేరి ఎన్నివిధములనో తక్షకుని, ఆతని అనుయాయులను బ్రతిమాలినను తక్షకుడు మకరకుండలముల నీయకుండుటచే ఇంద్రుని సహాయమున పూర్వము హనుమంతుడు లంకాపురిని దహించినటుల తక్షలానగరికి అగ్గిని ముట్టింప తక్షకుడు భీతిచే ఉదంకునికి మకరకుండలముల నిచ్చెనట! ఉదంకుడు మకరకుండలములను గురుపత్నికిచ్చి తన యాశ్రమమునకు బోవుచు తక్షకుడు తనకు చేసిన అపకారబాధకు తగిన యపకారము తక్షకునకును, నాగులకును చేయదలచి తనకు 'సతీర్థ్యుడు' అయిన (Senior) జనమేజయునకడకు వచ్చి యాతనిని తక్షకునిపై బురికొల్పదలంచి యిట్లనెను.

"ఓ రాజా! ఇపుడు తక్షశిలాపురినుండి కురురాజ్యముల నల్లకల్లోలపరచు నాగజాతిని గుర్తింపలేదా? వీరికి నాయకుడైన తక్షకుడే నీతండ్రియు, ధర్మాత్ముడును, దేవసముడునగు పరీక్షిన్మహారాజును మాయోపాయముచే దారుణవిషాగ్నిపాలు గావించి యున్నాడు. నీవు ఆ తక్షకుని దండించి నీ పితృఋణమును తీర్చుకోవలదా? ఇట్లు తీర్చుకొననియెడల నీ పరాక్రమము వ్యర్థమని పించుకొనునుసుమా!"

అని యుదంకుడు పురికొల్ప యంతకు పూర్వము ఏదియో పాముకాటుచేత తన తండ్రి మరణించె నని మాత్రమే యని తలంచుచుండిన జనమేజయుడు కోపోద్రిక్తుడై తన మంత్రుల వీక్షించి ఎట్టెటు! నాతండ్రిని ద్రోహియగు తక్షకుడే వధించెనా? ఇంతవరకు నాకేల యీ వృత్తాంతము చెప్పరైతిరి!" అని అడిగెను. అందులకు మంత్రులు "ప్రభూ! నీవు విద్య నభ్యసించు కాలమున చెప్పిన, నీవిద్యాభ్యాసమునకు విఘ్నము కలుగుననియు, అపుడు నీవు కోపముచే తక్షశిలపై దండయాత్ర జేయుటకు తగిన శక్తిలేనివాడవై యుందువనియు, పిమ్మట నీవు వివాహితుడవై భార్యతో విహరించుచు నానందమున నుండు కాలమున జెప్పిన మీ దంపతుల యానందమునకు అంతరాయము కలుగుననియు సందేహించి మిన్నకుంటిమి. ఇప్పుడు మన రాజ్యపు పొలిమేరలలో నాగులు గలిగించు ప్రజోపద్రవకార్యములను కని నేడే నీకీ వృత్తాంతమును జెప్పి తక్షశిలపై దండయాత్ర జేయవలయునని ప్రోత్సహింప దలంచుచుండగా, నీ యుదంకముని వచ్చి నిన్ను ప్రోత్సహించి యున్నాడు. కావున, తగు రీతిని మనము తక్షశిలాపురిపై దండయాత్రను చేయు సమయ మాసన్నమైనది" అని చెప్పిరి.

అంత జనమేజయుడు ఉదంకుని జూచి "మిత్రమా! తక్షశిలాపురియొక్క దుర్గప్రాకారాదుల పరిస్థితి ఎట్టిదో వారి సైనిక, సైతికశక్తి సంపద లెట్టివో చెప్పుమని కోరగా, ఉదంకుడు ఇట్లనెను:

"మహారాజా! తక్షశిలాపరి పర్వతదుర్గమనదగు కిష్కింధాపురివలె నది భూగర్భమునుండియే పోవలసిన దారికలదై యున్నది 1. నాగులు బహుశిల్పకళానిపుణులు. విజ్ఞానధురంధరులు. వారు పరాక్రమముచే మన దేశీయులకు తక్కువవారే యైనను మాయోపాయములచే మనకు చాల హానిని యుద్ధమున జేయగలరని తలచుచున్నాను. వారియొక్క శిల్పకళానైపుణ్యమునకు, నాకీ క్రిందియంశము లందు నూలువడుకుటలోనూ, రంగుబట్టలు నేయుటలోను గాన్పించినవి 2".

అని పెక్కువిధముల తక్షశిలయందు తాను చూచిన యంశములను వారి సేనానివహాదుల యతిశయమును చెప్పెను.

అంత జనమేజయుడు మంత్రులతో నాలోచించి మహాసైన్యముం గూర్చుకొని తక్షశిలపై దండయాత్రం జేసెను. అట నాగులును తగు సన్నాహములం జేసి జనమేజయు నెదుర్కొని మాయాయుద్ధములను ప్రత్యక్షయుద్ధములను గావించి జనమేజయుని, నాతని సైన్యమును జీకాకుపరచిరి కాని జనమేజయుడు నాగులను బాఱద్రోలి తక్షశిలాపురిని నాక్రమించెను 3.

ఆక్రమించుటయే గాదు—ద్రోహులగు నాగులలో "కౌరవ్య, తక్షక, వాసుకి, ధార్తరాష్ట్ర, ఐరావత" వంశజాతులగు 86 (ఎనుబదియాఱుగురు) నాగవీరులను బంధించి 'సర్పయాగము' 'అని

---

*ఆయుధములను ధరించి జీవించు గణములు, ఆయుధజీవికగణములు. ఇవి ప్రాచీనకాలమునందు తక్షశిలాప్రాంతమున తొమ్మిది గణములుండినట్లు పాణిని "అష్టాధ్యాయి" యందు కలదు. ఈ గణములు నేటి కాశ్మీరదేశముపై దండయాత్ర చేయుచున్న "అఫ్రీడీలు, మొహమ్మండ్ల"ల వంటివారు.

1. తక్షశిలను నేటి పురాతత్వశోధకులు శోధించుటలో భూమిని చాల లోతువరకు త్రవ్వి దానిలోని శిలాదికమును శోధించుచున్నారు అది నేడు కాశ్మీరయుద్ధమున నొక పర్వతప్రాంతమున దుర్భేద్యమై మనశత్రుమూకలకు నివాసమైన యొక పర్వతదుర్గముగా నుండినటుల భారతవర్ణనములచే గాన్పించుచున్నది.

2. తక్షశిలలో పన్నెండాకులు గల రాట్నముతో పురుషులు నూలును వడకుట, ఆడువాండ్రు రంగుదారముతోనూ, తెల్లదారముతోనూ పడుగుపేకలుగా బట్టలు నేయుటయు ఉదంకుడు తక్షశిలలో చూచినటుల భారతమున గలదు. మునులు కదురుతోనే నూలును, నారను వడికి రంగులేని బట్టలనే నేసి కట్టుకొనుచుండిరి. ఉదంకుడు రాట్నముతో నూలును వడకుట నంతకుముం దెరుగడు. అతడట చూచిన రంగు బట్టయే నేటి మనవారు ధరించు నాగుచీరలు.

3 మహాభారత యుద్ధమున కురుపాండవవీరులలో పెక్కండ్రు ప్రయోగించిన ఆగ్నేయాది మహాస్త్రములను పిమ్మటివారు మరచిపోయినటులను, జనమేజయునికాలమున వేఱువిధములగు ప్రయోగాది విధు లుండినటులను, అధర్వవేదాంశములచేతనూ, ఐతరేయ బ్రాహ్మణమున జనమేజయుడు తనకు దైవమానుషాస్త్రములు పురోహితుల మంత్రబలముచే బాధింపనట్లును చెప్పిన యంశములచే గ్రహింపవచ్చుచున్నది.

(20 వ పేజీ చూడుడు)

కథానిక :

దొంగసొమ్ము

శ్రీ గొళ్ళపూడి లక్ష్మీనారాయణ

మర్నాడు ఉగాది. సుబ్బయ్య కొట్టు కిటకిట లాడుతున్నది. అందరికీ అన్ని వస్తువులూ అందిస్తూ, ఎవ్వరి మనసూ నొచ్చకుండా 'అష్టావధానం' చేస్తున్నాడు సుబ్బయ్య.

ఈ 'అష్టావధానం' వల్లే, సుబ్బయ్య ఇన్ని సంవత్సరాలనించీ రెండు కాళ్ళ మీద నిలబడి, చిల్లరకొట్టు ద్వారా రెండు చేతులా ఆర్జిస్తున్నాడు. నేను ఉద్యోగరీత్యా ఈ ఊళ్ళో కాలిడినప్పటి నించీ,—సుబ్బయ్య, అతని దుకాణమంటే అందరికీ అభిమానం కలిగేటట్లు చేసుకోవటం గమనిస్తున్నా.

సుబ్బయ్య పుట్టు పూర్వోత్తరాలసంగతయితే మటుకు ఎవ్వరూ అంతగా పట్టించుకోలేదు కాని; అతని వ్యాపార వ్యవహారనిపుణత అందరికీ తెలిసిందే.

ఏ సందర్భంలోనైనా సుబ్బయ్య ముఖంలో కార్యదీక్ష ప్రస్ఫుటమౌతుంది.

—"కోటి రత్నం, ఆ బెల్లం కట్ట ఇట్టా అందుకో! చూస్తావేం, వెంకయ్యా! అట్లా జార్లబడి నిల్చుంటావేం, పేరంటపు ముత్తయిదువలా"—ఇలా చాకచక్యం చూపిస్తూ చకచకా ఒక్కొక్కరినీ పంపిస్తున్నాడు.

పన్నెండేళ్ల కుర్రాడొకడు జనం మధ్యలో ఇరుక్కొని, అలా ముందలికీ రాక, వెనక్కీ వెళ్ళక, 'చింతపండు అరవీశె, బెల్లం సవాసేరు' అని మెల్లిగా అంటున్నాడు.

సుబ్బయ్య ఆ రెండూ కట్టి 'ఇదిగో' 'అని గుంపు వైపుకు చేయి చాపి గుమాస్తాలతో ఏదో అంటున్నాడు.

ఆ రెండూ చక్కా పుచ్చుకొని నిమిషం పస్తాయించి అటూ యిటూ చూసి మెల్లిగా జారుకున్నాడా కుర్రాడు.

గుమాస్తా కోటిరత్నం 'చింతపండూ, బెల్లం తీసుకున్న కుర్రాడు డబ్బిచ్చాడా?' అని హెచ్చరించాడు సుబ్బయ్యను. "ఇవ్వ లేదల్లే ఉందే" అన్నాను నేను.

'పోనీలే' అని చిన్నగా అంటూ కోటిరత్నానికి కనుసైగ చేశాడు సుబ్బయ్య. ఆశ్చర్యపోయాను.

"ఏమిటి సుబ్బయ్యా! వింతగా ఉందే!" అన్నాను. అదిరిపోయి, నా వంక తేరిపార చూసి 'అఁ. ఏమీ లేదండీ!' అని నసిగాడు;—నేను అడిగితే వేసులు లెక్కపెట్టేవాణ్ణనే ఉద్దేశం కలిగిన సుబ్బయ్య.

"అఁ. ఏదో ఉందిలే! చెప్పాల్సిందే." అన్నాను.

"రేపు సాయంకాలం" అని నవ్వాడు.

* * * * *

పైరుగాలి గిలిగింతలు పెడుతోంది. రమ్మని ఆహ్వానిస్తున్నది ప్రకృతి సౌందర్యానికి పరవశంతో పాడుతున్న పిల్లగాలి తరంగాలకు అటూ ఇటూ వయ్యారంగా పైరుచేలు తలలాడిస్తున్నాయి. కూచోమని తలలూపాయి జొన్నదంట్లు.

* * *

"సుబ్బయ్యా! ఎందుకలా దొంగతనాన్ని చూసీచూడనట్లు ప్రోత్సహిస్తావో, చెప్పు!" అంటూ పెద్ద జొన్నాకును నడిమికి రెండు ముక్కలు చేశాను.

"చూశారూ, ఆ జొన్నాకు రెండు ముక్కలూ ఇహ అతకవు. కాని, ఆ రెండూ ఒకటే ఆకు........" చెప్పటం మొదలు పెట్టాడు. వేదాంతమే మొననుకున్నా.

"అట్లాంటిదే నా జీవితమున్నూ. అతుకువడని రెండు భాగాలు. ఈ రెండు భాగాలకు ఎంతో భేదం. రెంటికీ ఏ కోశానా సామ్యత లేదు. ఒక వాతావరణంలోనిది మొదటిది. రెండోది మీరు చూస్తున్నది.

"ఈ రెంటికీ మధ్య అత్యంత విశాలమైన అగాధం దీనికి వంతెన, సముద్రానికి సేతువు లాంటిది. సముద్రానికి సేతువు నిర్మించబట్టే రెండవ భాగంలో ఉంటున్నా. ఎట్లా చేశానో నన్నడగబోకండి. అదొక చిన్న పిల్లల కథలోని వింతల్లాంటిది. ఇహ మిమ్మల్ని అసలు కథలోనికి తీసుకుపోతున్నా......"

"సంతోషం' అన్నా. మనసును కేంద్రీకరించా.

"సమ్మె జరుగుతోంది వారం రోజుల్నించి. మర్నాడు సమ్మె సమాప్తి అని లాగుడు బండ్ల సంఘ పెద్దలకు పార్టీ నాయకులు ఆదేశమిచ్చారు. సమ్మెకు అంటే ఆ సందర్భంలో నేను వ్యతిరేకుణ్ణి. బేరను నించి గూడ్సు షెడ్డుకు పొగాకు బేళ్ళు తీసుకు వెళ్ళాలి కూలీ ఎక్కువ చేయాలని అన్నారు. బేరను యజమాని కొత్తగా దెబ్బ తిన్నాడు. మళ్ళా ఎగుమతి చేస్తున్నాడు. వాళ్ళు ఆ సమయాన్ని ఎందుకుపయోగించదలచారంటే 'వర్తకుడు ఇబ్బందిలో ఉన్నాడు. ఇప్పుడు వత్తిడి చేస్తే మెత్తబడతాడని.' 'మీ మాట చచ్చిన పాముని చితగ్గొట్టినట్టుంది. రేపు లాభం వచ్చినప్పుడు మన మడగటం బాగుంటుంది' అన్నాను నేను. నా మాట బాగుందన్న వాళ్ళు అంత మందిలో పదిమంది! వాళ్ళూ, నేనూ ఏ పార్టీలో లేము. అంచేత, సమ్మె రోజుల్లో అవసరమయితే మాకు డబ్బివరు. మా మాట నీటిమూటయింది, సముద్రం చారెడు తీపి నీళ్ళతో తియ్యబడుతుందా!

"మొదటి నించీకూడా ఒక చేత్తో రాబట్టి, మరో చేత్తో విడిచేరకాన్ని. రోజుకు రెండు రూపాయలు ఎటుపోయి, ఎటు వచ్చినా వచ్చేది. అందులో రూపాయి భార్యచేతిలో పెట్టేవాణ్ణి. ఇహ గుడిసె భారం దీనిది. అర్ధ కల్లు పాకకి. మరో అర్ధ పై ఖర్చుకి. సమ్మె చేస్తారని కాస్త కూడబెట్టా కాని అది కర్పూరంలా హరించి పోయింది.

"ఆ రోజు శుక్రవారం. శుక్రవారం నాడు తాగంది జీవితమే లేదని నిశ్చయం. డబ్బు కావాలని భార్య నడిగితే 'రూపాయలు కాస్తుండయిసే' అని దెప్పిందది. డబ్బుల ముంత తెప్పించి చూశాను కాని అది ఖాళీ. 'మరెట్లాగే' అని జాలి చూపులు చూశా. నేను తాగటానికి అది ఎప్పుడూ అభ్యంతర పెట్టలేదు. కారణం నేనెంత తాగినా గందరగోళ మనేదిలేదు.

"మకిలి పట్టిన మట్టెలు తెచ్చి ఇచ్చింది.

"'ఏవరేవ్?' అన్నా 'ఏవయయితే'నేం' అని మాసిన నవ్వుల నవ్వి 'కిట్టయ్యగారి భారియ ఎప్పుడూ ఇస్తుంది తలంటి పోసుకుంటూ ఇయాళ ఇప్పింది..... ' అంది.

"కల్లు పాకకి నిమిషాలమీద చేరుకున్నాను.

"వెంగప్ప మహోత్సాహంగా అందరితో పరాచకాలాడుతూ ముంతలందిస్తున్నాడు. నేను రావటం ఎవ్వరూ అంతగా పట్టించుకోలేదని అనుకున్నాను.

"వెంగప్ప పక్కకి చేరి, ఎవ్వరూ లేని సమయం కనిపెట్టి 'ఎంగప్పా! సమ్మె గేస్తుండాం. డబ్బు లేవు. ఇయిగో, ఇయి తీసుకో. నాకో రెండు ముంతలు ఇచ్చి, ఓ అరద 'ఇయ్' అని మట్టెలు తీసి వాడిచేతిలో పెట్టాడు. కోర చూపులు చూసి మట్టెలు బొడ్లో దోపి 'ఏవటి?' అన్నాడు. పావలా చేతిలో పెట్టాడు. 'పోనీలే; మంచి సరుకు' అన్నాను. 'ఊఁ' అని మొరిగాడు. 'ఎంగప్ప మారాడే' అనుకుంటూ అటు ఇటూ దిక్కులు చూశాను. నాకు వెంగప్ప సంగతి బాగా ఎరుక. వాడి దగ్గర రకాలుంటాయి. అపుడే గీసిందొకటి, రెండోది పులిసింది, మూడోది బొత్తిగా తీర్థమే.

"నేను దిక్కులు చూడటం గమనించి, మూడోదాంట్లోంచి ఒక ముంత తీసి ఇచ్చాడు. ఒక్క గుక్కెడు తీశా. కనిపెట్టాను. 'ఏటి; ఎంగప్పా ఎండి ఇచ్చావని నీళ్ళిచ్చావేఁ!' అని పొలికేశా. 'అంతే, అంతే నీళ్ళేటి? నీ ఇష్టమయితేనే' ఏమిటో కొత్తవాడికి చెప్పినట్లు చెప్పాడు.

"'సరే కాని' అనుకున్నాను—'నీ జుట్టు నా చేతికి చిక్కక పోదులే. ఇంతకీ ఎదవ ఎంగప్ప గాడిక్కూడా లోకువయ్యాను—దొంగ సొమ్మట్టుకొస్తే' వళ్ళంతా మండినట్లయి, పాకలోంచి పరుగెత్తుకొచ్చా.

"ఇహ, నేను తరవాత ఎప్పుడూ వెళ్ళేది సంగి. అర్ధణా ఖిల్లీ వేశాను. ఏడయింది. 'ఇపుడేటి సంగికాడికి' అనుకొని సినిమాకు వెళ్లాను.

"సినిమా అయినాక సంగి దగ్గరికి వెళ్ళే సరికి, సరిగ్గా జేబులో అర్ధణా ఉంది. డబ్బులేకపోతే సంగి ఏమంటుందో? అని బిక్కు బిక్కుమంటూనే తడిక నెట్టాను. మూసివేసి ఉంది. చూరలోంచి చూస్తే అమూదం సెమ్మె లేదు. 'సంగే, సంగే!' అని మెల్లిగా తడికను ఊగిసలాడించాను.

"'ఎవరోఁసె; ఏటా అడావుడి, వత్తుంటే' అని బయటికి వచ్చి నన్ను గుర్తుపట్టి 'హాఁస్, నీవఁటే. ఈ యాళ ఈ ల్లేదే; తల పగిలి పోతుండాది. కాఫీ తెచ్చి పెట్టా?' అంది.

"'డబ్బులేవే' అన్నాను. 'బిక్కు మానోడా! డబ్బులేకుండానే వొచ్చావ్! ఫో, ఫో చవటా' అని చటుక్కున తడిక బిగించింది నా ఆశ్చర్యానికి అంతులేక పోయింది. ఎంత అవమానం మొగాన పూసిందిరా సంగి అనుకొన్నాను.

"'హసి నీ దుంపదెంచఁగ! తలనొప్పా! హాన్నీ దొంగ ఏసాలు ఇంతకీ దొంగ సొమ్ము టుకు రావటమే వచ్చిందిఁ. ఎదవ పాపిట్టిది. చెమటోడ్చింది అణా అయినా బాగణ్ణు దొంగ సొమ్మయితే ఇంతే అగచాట్లు. అందరికీ అలుసే. ఎదవ ఎంగప్పకీ అలుసే...........' ఇట్లా నా ఆలోచనలు పోయినాయి.

"ఇంటికి వచ్చి పడుకున్నాను.

2

"బారెడు పొద్దెక్కింది. సూర్యుడికి కావాలన్నా చీకటి లేదు.

"'పొద్దు ఎక్కుతుండాది అట్టా ఉడుంలాగా ఇల్లించుకు పడుంటే డొక్క మాడుద్ది. లేహ్ అసేఁ' అంది అది.

"లేచి, చకచకా బండ్ల బజారుకు వెళ్లాను. కాని అక్కడ ఒక్క బండీ లేదు.

"పరుగున బేరనుకు వెళ్లాను. ఆఖరు బండికి పోలు ఎత్తుతున్నాడు.

"'వొచ్చాడయోఁ దొరయ్యగోరు!' అన్నాడు నాగడు. 'నన్నూ సేరేయనీయరా' అని పీరాయ్ ప్రక్కమూల పట్టుకున్నా. 'అరేయ్! అణ్ణి దరిచేరనీమకు. వొర్రి దొంగనాయాలు' అన్నాడు నాగడు. అంతా నవ్వుతూంటే, నన్ను ప్రక్కకి తోశాడు పీరాయ్.

"చరణం పాడుతూ కదలాయి చక్రాలు.

"తలవాల్చి వెనక్కి నడవటం మొదలు పెట్టాను.

"'దొంగనాయాలట! అదు మహాపచ్చిత్తు. ఆ డెన్నిమట్ట సేయలేదూ? నిన్న పాకలో సూసి నట్టున్నాడు నా జన్మలో ఇదే మొదటి మాలు. అసలు నా కిట్టమేలేదు దొంగతనమంటే. పైసా లేక, వాలిక పీక్క పోతే...'

"'ఏ, మడిసీ, బండీ' అంటూ గంటవాయిస్తూ రిక్షావాడు హెచ్చరించాడు నన్ను.

"'రిక్షాలాగితేనో...' అనే ఆలోచన తట్టాలున తట్టింది. గంజి దొరక్క పోతుందా అని రిక్షాబండ్ల దొడ్డికి వెళ్ళాను. అదృష్టవశాత్తు మంచి బండి ఒకటే మిగిలింది. దొడ్డి యజమాని రెడ్డి నాకు పూర్వపరిచితుడే. అంచేత అనుమానించకుండా వెంటనే బాడుక్కి ఇచ్చాడు.

"సాయంకాలం వరకు లాగాను బండి. బొడ్లోకి రెండు రూపాయలు జేరాయి.

"ఆసామి ఒకడు ఎక్కాడు.

"బ్రాందీ హోటలు దగ్గిర దిగాడు.

"పావలా చేతిలో పెట్టాడు.

"పావలావంక హోటలు వంకా సాలోచనగా చూశాను.——'కుక్క కాటుకి చెప్పు దెబ్బ' అన్నారు. వెంగప్ప మొగాన బ్రాందీ తాగాలనుకున్నాను.

"బండి లాగుతుంటే చక్రాలు హితోపదేశం చేశాయి.——'సిగ్గులేనోడా! నాగడు 'దొంగనాయాలు' అంటే ఊరుకుంటావేం? ఆళ్ళకో తిరగమాకు. నేనున్నా గా. నన్ను సరిగా సూడు.——' అని ఏదో ఏదో.

3

"రోజుకి రెండు రూపాయలు మిగులు. చొప్పున ఇరవై రోజులు రిక్షా బండి లాగాలు లాగుడు బండ్లవాళ్లు పలకరించేవాళ్ళు అప్పుడప్పుడు. అయితే నేను ముభావంగా ఉండేవాణ్ణి. వాళ్లకు మాత్రం మొగం చెల్లుతుందా?

"నేను మొండివాణ్ణి ఏదనుకుంటే అది. పాతిక రూపాయలుదాకా నిలవచేశాను.

"నేను పూర్వం చూసిన బ్రాందీ షాపు చేరుకున్నాను. అడుగు లోపల పెట్టాను. మెడపై చేయి పడ్డది. బంట్రోతు! జేబు గలగల లాడించాను. 'చూసాంలేవోయ్! ఈ రూపాలు. ఏఁఏఁ, పదపద!' అన్నాడు. ఆపాదమస్తకం నవ్వుతూ చూశాడు. వాదు స్తులు చూసుకున్నాను. మకిలిపెట్టి, చెమట పట్టేలు వేసిన చిరిగిన పంచె, చొక్కా. 'ఛీ' అనుకొని వెనక్కి తిరిగాను.

"దోవలో ఆలోచన...మంచి గుడ్డలుండాలి. లేనిది అదు గిట్టనివ్వరు. గుడ్డలు సుమారైనవి ఉండాలంటే పదిహేను రూపాయలు కావాలి. పాతిక్కి, గుడ్డలు, బ్రాందీ ఎట్లా వస్తాయి?——బుర్ర బండబారింది. ఖిల్లీ కొట్టుకు చేరుకున్నా.

"నోటి దాకా వచ్చింది 'తాజమహలు' అని. పాతిక రూపాయలు జేబులో గలగల మంటుంటే బీడీ ఏమిటనుకొని 'కత్తిర మార్కు సిగిరెట్టు' అని అణా ఇచ్చా. సిగిరెట్ ఇచ్చి అర్ధణా చేతిలో పెట్టాడు.

"౼బ్బ! ఎంత లాభాలో?

"కొట్టు పెడ్తే—

"డబ్బు?

"పెట్టుబడి ఎంతవుతుందని అడిగాను. పాపం, పశ్చాత్కృడు ఎక్కడున్నాడో కాని, కనీసం ఇరవై కావాలన్నాడు.

"'ఇంకేం—'

4

"చాకులో ఖిల్లీకొట్టు వెలిసింది. పిల్లలదగ్గిర్నుంచీ, పెద్దవాళ్లవరకూ కావలసినవన్నీ సమకూర్చాను.

"చుట్టూ ఉన్న వర్తకులను మంచి చేసుకున్నా.


"నోరు మంచిదైతే నోటికి నాలుగు మెతుకులు దొరక్క పోతాయా? నాలుగు దినాల్లోనే, నలుగురు నోళ్ళల్లోను నలిగింది 'సుబ్బయ్య ఖిల్లీ కొట్టు' అని. రోజుకి రెండు రూపాయలవరకూ వచ్చేది లాభం. లాగుడు బండి నాధారం చేసుకొని ఉండంగా అప్పుడూ వచ్చేదే కానీ;—ఒళ్లంతా చితగ్గొట్టినట్లయ్యేది. నరాలన్నీ ముద్దయినట్లనిపించేది. ఆ బాధ మరచి పోవటానికి తాగుడలవాటు చేసుకున్నాను. అంచేత సంపాదన సమానమైనా ఖిల్లీకొట్టు మీద నిలవుండేది.

"ఒకనాడు పత్రికల ఏజంటు ఒకాయన వచ్చి కమీషనుమీద పత్రికలమ్మమని కొన్ని పత్రికలిచ్చి వెళ్ళాడు.


"కొట్లో పత్రికలు అమ్మటంతోబాటు చదవటంకూడా సాగించుచూ ఏపత్రికలో చూసినా మద్యపాననిషేధంమీద ఏదో వ్యాసం ఉంటూండేది. ధననష్టమనీ, ఆరోగ్యనష్టమనీ,—అనుభవంలో చవిచూశాను కాబట్టి తొందరగా బుర్రకెక్కింది. నాకు చదువు రాలు వచ్చు అని మీరు అనుమానిస్తున్నారుకదూ! ఆరు క్లాసులవరకూ చదివాను నేను. మా అమ్మ ఎక్కడైనా గుమాస్తాగా చేరమంది కాని మా నాన్న 'నా కొడుకు రెక్కల్ల అమ్మకొని బతకనన్నా బతుకుతాడు కాని ఒకడి మో చేతినీళ్ళు తాగనీయ' నని మొండిపట్టు పట్టి ఆయన వృత్తిలోనే జేర్పించాడు. పత్రికలు చదువుతున్నకొద్దీ, ఒతి పెట్టి వుంచిన బుద్ధి వికసించటం మొదలు పెట్టింది.

(17 వ పేజీ చూడుడు)

మౌంటుబాటనులకు వీడ్కోలు



పాలాం విమానాశ్రయంవద్ద, గౌ॥ శ్రీ రాజగోపాలాచారిగారికి స్వాగతమియవచ్చిన, అహ్మద్ కిద్వాయ్, రాజకుమారికౌర్,
మౌలానా ఆజాద్—మొదలైన మంత్రివర్గప్రభృతులను, పండిట్ నెహ్రూ రాజాజీకి ఎరుకపరుస్తున్న దృశ్యం.




'కేరవాన్ ఆఫ్ ఇండియా' ఢిల్లీ
పెమిలా మౌం

గవర్న




శ్రీ చక్రవర్తి రాజగోపాలాచారిగారు ప్రమ
(జూన్ 21)



మౌంటుబాటన్లకు వీడ్కోలు ఇయ్యటానికై వస్తూన్న షేక్ అబ్దుల్లాతో శ్రీమతి ఫిరోజగాంధి, మిస్. చంద్రాపండితులు.



పాలాం విమానాశ్రయంవద్ద, వీడ్కోలు నీయవచ్చిన ప్రఖ్యాత భారతనారీమణులవద్ద
మౌంటుబాటన్ వీడ్కోలు పుచ్చుకొంటున్న దృశ్యం.



మౌంట్ బాటన్ పతి గవర్నర్ జనరల్ శ్రీ రాజగోపాలాచారిగారి నుండి
పాలాం విమానాశ్రయంవద్ద సెలవు తీసుకుంటున్న దృశ్యం.

రాజగోపాలాచారికి స్వాగతం



శాఖవారు కౌన్స్టిట్యూషన్ క్లబ్బులో గత మంగళవారం సాయంత్రం
ౌంట్‌బాటెన్ కన్యకు వీడ్కోలు సభ జరిపినప్పటి దృశ్యం.




భారతప్రధాని పండిట్ నెహ్రూ పమిలా మౌంట్‌బాటెనుకు వీడ్కోలొసగుచున్నారు.


ర్ జనరల్ మార్పు



న్యూఢిల్లీ మునిసిపల్ కమిటీ గతవారం గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్‌బాటనుకు సన్మాన పత్రం సమర్పిస్తున్న దృశ్యం. ఆర్థర్ డీన్ (కమిటీ అధ్యక్షుడు) సన్మానపత్రాన్ని సమర్పిస్తున్నాడు.



త్వభవనంలోని దర్బార్ హాలులో గవర్నర్ జనరల్ అధికార స్వీకార సమయమున
"ప్రమాణ వచనమును" చదువుచున్న దృశ్యం.



1930 నుంచి ఢిల్లీ ప్రభుత్వభవనంలో ఉన్న బ్రిటిష్‌రాజు "స్వంత ఆస్తి". వీటిని
లార్డ్ మౌంట్ బాటన్ బ్రిటిష్ రాజకుటుంబ సద్భావసూచకంగా భారతప్రభుత్వమునకు
జూన్ 21 వ తేదీన ఇచ్చివేశారు.



పాలెం ఏరోడ్రోమ్‌వద్ద మౌంటుబాటన్లు బయలుదేరబోయేముందు, శ్రీ రాజగోపాలాచారి
పండిట్ నెహ్రూలతో, లేడీ మౌంటుబాటను, సతీమణి, కుమార్తె పామిలా మౌంటుబాటన్లు.



ఆల్లీబిల్లీ లోకంలో అమ్మాయికథ

'ఆలీస్ ఇన్ ది వండర్లాండు'
రచన:
లూయీ కెరోల్

౧౧

అనుకరణం:
"ఆప్లవాన్"

పిల్లడిని పట్టకోటమే గగనమై పోయింది పాపకు. పీతలాగా కాళ్ళూ, చేతులూ అన్నివైపులకూ తెరుచుకొంటూ, గబుక్కున మళ్ళీ ముడుచుకొంటూ, ఎక్కటా పట్టు అందకుండానే ఎగిరెగిరిపడుతూ నార సాగిపోతూ జారిపోతూన్నాడు. ఈ చెయ్యి జారితే ఆ చేత్తోటీ, ఆ చెయ్యి జారితే ఈ చేత్తోటీ, కింద పడకుండా, మోకాలు కానించి, ఒళ్ళోకి పైకి లాగుతూ, చేతులు మార్చుకొంటూ నానా ఉత్కృష్టా పడిపోతోంది పాప. బిడ్డకూడా, సెగలు పొగలు వొదుల్తున్న రైలుఇంజన్లాగా, అతిఆయాసంగా వగురుస్తూ చేతులూ, కాళ్ళూ, విలవిలా తన్నుకొంటూన్నట్లు ముడుచుకొంటూ పారజాస్తూ, ఉక్కిరిబిక్కిరి చేసేస్తూన్నాడు. ఓ రెండునిమిషాలకి పాపకి ఆ పిల్లడిని ఎత్తుకునే పద్ధతి కాస్త తెలిసొచ్చి, ఎల్లాగో పిల్లడిని కొద్దిగా అదిమిపట్టకోగలిగింది. పద్ధతి అంటే ఏమీ లేదు — పిల్లడిని ఉండగా చుట్టేయటం. ఎడంచెవీ కుడి పాదం గట్టిగా కలిపి, మరి సాచటానికి వీల్లేకుండా, గట్టిగా పట్టేసుకోటం. అల్లా పట్టకుని,



"ఇక్కడ ఈ పాపాయిని వదలిపెట్టి వీళ్ళు తప్పకుండా ఇవాళ రేపట్లోనే వీడిని ఇల్లా చంపేయరూ? నాతో తీసికెళ్ళటమే నయం. లేకపోతే పిల్లాడు చచ్చిపోతాడుగాని, ఇంకేమన్నా ఉందా?" అనుకొంటూ పాప ఒళ్ళో బిడ్డ నెట్టుకొని గాలిలోకి కదలి వచ్చింది.

పాప మాటలు ఎప్పుడూ గట్టిగా అనుకోటమే అలవాటుగా! ఆ చివరి మాటలు అల్లాగే గట్టిగా అంది. ఆ మాటలు ఔనంటూన్నట్లు, చేతిలో బిడ్డ, "ఘుర్, ఘుర్" అని ఘుర్ఘురించింది.

"ఏమిటల్లా ఘుర్ ఘుర్ అంటావ్? పసిపిల్ల అల్లా ఘుర్ ఘుర్ అనకూడదు; తప్పు!" అంటూ పాప, పిల్లను కోప్పడింది.

కాని చేతిలో పిల్ల మళ్ళీ "ఘుర్ ఘుర్" అంది.

'ఇదేమిటి, ఇల్లా అంటుంది?' అని తెల్లపోతూ పాప పిల్లమొహంవంక పరకాయించి చూసింది. ముక్కైలాగుందేమిటి - ముక్కేనా? మరీ మారిపోతున్నట్టుంది. పసిపిల్లలకు మరీ ఇంత చికిలి చిన్నికళ్ళుంటాయా? ఏడుపో, వెక్కిలో పెట్టోందేమో. అదేం గొంతుకలోంచి గుటకలాగా అల్లా వినబడుతుంది." అని కళ్ళవంక మళ్ళీ తేరిపార చూసి, "ఏడుపైతే మరి కళ్ళనీళ్ళు లేవేం? ఇదిగో పిల్లా, పంది పిల్లగా మారావంటే నీవంక చూసేది లేదు. ఊం! తెలిసిందా?" అని పిల్లతో అంది.

పిల్ల మళ్ళీ, వెక్కిలు, (వెక్కిలో గురకో మరి) పెట్టోంది. అల్లా కాసేపు గడిచింది.

"ఇంటికెళ్ళాక ఈ పిల్ల నేం చెయ్యను?" అనుకొంటూ పాప తెల్లబోతూండగా, ఈమాటు పిల్ల మరీ గట్టిగా "ఘుర్ ఘుర్" మంది. పాప కింక నిశ్చయమైపోయింది. "అనుమానం లేదు; ఇది పందిపిల్లే. పందిపిల్ల నెత్తుకోటం ఏమిటీ? ఛీ!" అనుకొంటూ పాప పిల్లను చటుక్కున నేలమీద దించింది. పందిపిల్ల పరుగెత్తుకొంటూ పొదల్లోకి పారిపోయేటప్పటికి "అమ్మయ్యా!" అనుకొని పాప ఓ నిటూర్పు విడిచింది.

"ఆ పిల్ల ఎదిగితే మరీ అసహ్యంగా తయారౌను. కాని పంది పిల్లగా చూస్తే బాగా చక్కగానే ఉందే!" పాప తను ఎరిగున్న పిల్లలలో పందిపిల్లలుగా ఉంటే బాగుండే పిల్లలు ఎవరెవరు అని ఆలోచించడం మొదలెట్టింది.

"చాలామందే ఉన్నారు. అల్లా వాళ్ళని పందిపిల్లలుగా మార్చడం ఎల్లాగో తెలిస్తేనా!—"

అంతవరకూ అనుకొంటుండగానే అకస్మాత్తుగా పాపకు ఇందాకటి దేవరపిల్లి, అక్కడే పదిగజాల దూరంలో ఒక చెట్టుకొమ్మమీద కూర్చుని ఇకిలిస్తూ కనబడింది.

పాపను చూసి పిల్లి ఇకిలించటం తప్ప మరేమీ చెయ్యటంలేదు. కాస్త మంచి పిల్లిలాగా పాపకు అనిపించింది. అయినా దాని గోళ్ళూ, ఆ నోటినిండా పళ్ళూ, మరీ వాడిగా నేకనపడుతున్నాయి. అందుకని కాస్త మర్యాదగా మంచిమాట చేసుకొంటే నయమని పాపకు అనిపించింది.

"దేవరపిల్లీ!" అని తనలో "ఓ వేళ, బావురుపిల్లీ, అనాలేమో. అయినా కోపం వచ్చిందో లేదో

బాల

కథాగేయం:



ఆణిముత్యం

'ప్రసాదరావు'

౧౦

"వలదు నవరత్నాలు, నిధులూ,
వలదు విడి జీవితపు పాటులు,
కలియొ గంజియొ కలిగినంతలో
కలిసె తిందామూ. 1

కలిసివచ్చే యోగముంటే
కలుగు నిచటనె భాగ్య భోగాల్
కష్టాల కేమాయె; నన్నిటు
రొష్టుపెట్టకుమా. 2

నిన్ను విడిచీ నేను, పిల్లలు
నిముసమ ముండగ లేమురయ్యా!
ఆణీ! పోవలదు నాపై
ఆనసుమ్మోయీ!" 3

అనుచు కన్నుల నీరుపెట్టుక
పనవుచూ; పతిసర్వ దేహము,
పూచినా బాలెంత లతవలె పెన
వేచి కొంటుందీ. 4

కదలలేడా కౌగిలిని విడి,
వదలలేడాలినీ బిడ్డల,
కాని ఇట కష్టాలు తలపుల
కలక పెడతాయీ. 5

నీ రవుదు, నిస్పృహుడు నౌతూ,
నిముస మట్టుల యాగి, గుండియ
చిక్కబట్టుక, సతికి ధైర్యం
చెప్పసాగడూ. 6

"నాల్గునాళ్ల వియోగమదియయి
నాక మళ్ళీ కలిసెదుంటాం,
పిల్లలకు సంపదల కూర్చీ,
ఉల్లసిలుతామూ. 7

"ఇన్నూరు టంకాలతోటీ,
ఇల్లు గడప్రమ; ఆరు నెల్లో
తిరిగి ఈ తిథి వచ్చునాటికె
తిరిగి వస్తానూ." 8

చూడాలి” అనుకొంటూ నిల్చుంది. పిల్లి ఇంకొంచెం ఇకిలించింది. “పోనీలే! ఇంతవరకూ కోపం వచ్చినట్లు లేదు” అనుకొని ధైర్యం తెచ్చుకొని “ఓ పిల్లమ్మోయ్! మంచిదానవుగాని, నె నిక్కడనుండి ఎల్లా వెళ్ళాలో కాస్త దయచేసి చెప్పవూ?” అని అడిగింది.

“నువ్వెక్కడి కెళ్ళాలో తెలిస్తే దాన్ని బట్టి చెప్పాల్సిఉంటుంది” అంది పిల్లి.

“ఫలానా చోటి కెళ్ళా లని నా కేమంత ఇది లేదు—”

“అల్లా అయితే, ఎల్లా వెళ్ళినా ఫర్వా లేదు” అంది పిల్లి.


“ఎక్కడికో ఒకచోటికి అసలు వెళ్ళగల్గితే చాలు” అని పాప తన మాట పూర్తిచేసింది.


“అది ఎల్లాగే జరిగేదే! -ఎక్కడికో ఒక చోటికైతే, —కాస్త కాలు కదిపి నడిస్తేసరి, తప్పకుండా చేరుకుంటావు”.

పిల్లి చెప్పే మాటా కాదనేట్టు లేదు. అందుకని ఇంకోమాదిరిగా అడుగుదామని పాప మళ్ళీ అడగటం మొదలుపెట్టింది.

“అది కాదు. ఈ చుట్టుపక్కల ఎల్లాంటివా ళ్ళుంటారు” అని అడిగింది.

“అటేపు వెళ్తే, వెఱ్ఱివెంగళాయ్ ఉంటాడు. ఇటేపు వెళ్తే తొఱ్ఱి కుందేలు ఉంటుంది. నీ యిష్టం - ఎటు వెళ్తే అటు వెళ్ళు. ఇద్దరూ పిచ్చివాళ్ళే” అంటూ పిల్లి కుడిపాదం ఒకవైపూ, ఎడమపాదం ఒకవైపూ చూపిస్తూ చెప్పింది.





రాజు - ఏనుగ

పిల్లల కథలు — చి॥ శ్రీకృష్ణమూర్తి

అనగా అనగా, ఒక వూళ్లో ఒక రాజు ఉంటుండేవాడు. రాజు దగ్గర ఒక ముసలి ఏనుగ ఉంది. ఆ ఏనుగ రేపో మాపో చావటానికి సిద్ధంగా ఉంది. ఒకరోజు ఆ రాజు ఒక వూరివాళ్లను పిలిచి ఏనుగను వారికి ఇచ్చి చెప్పాడు—

“మీరు గనుక ఈ ఏనుగ చచ్చింది అని చెప్తే మీ తల కాయలు కొట్టిస్తాను.”

కొన్ని రోజులు గడిచాయి. ఆ ఏనుగ కాస్తా చచ్చిపోయింది. ఇది చూచి ఆ వూరి ప్రజలకు భయం వేసింది. ఎవరు పోయి ‘చచ్చింది’ అని చెప్తే ఎవరి తల కాయ కొట్టేస్తాడో! ఇట్లా తిక మకలు పడుతున్నారు.

ఆ వూరిలో ‘రాము’ అనే అబ్బాయి ఉన్నాడు. ఆ అబ్బాయి చాలా తెలివి గలవాడు. ఆఅబ్బాయి ‘నేను రాజుదగ్గరికి పోతా నన్నాడు. ‘సరే’ నన్నారు అందరూ. ఇంకేం, పోయినాడు సరా సరి రాజుదగ్గరికి. రాజు ‘ఏమి సంగతి?’ అన్నాడు. అబ్బాయి చెప్పాడు— “ఏమండీ! మీ ఏనుగ కాలు, చెయ్యి కదల్చ డం లేదు. దానికి శ్వాస లేదు.”

అది విని రాజు “అయ్యో! ఏనుగ చచ్చిందా?” అని అన్నాడు.

అప్పుడు అబ్బాయి అన్నాడు— “అయ్యా! మీరే చనిపోయింది అని అన్నారే!” ఆ మాట విని రాజు సంతోషించి మన అబ్బాయికి బహుమాన మిచ్చి పంపాడు.

“కాని, నేను పిచ్చివాళ్ళ మధ్యకు వెళ్ళా లనుకోటం లేదు” అంది పాప.

“వెళ్ళక ఎల్లా కుదుర్తుంది? - ఇక్కడ అంతా పిచ్చివాళ్ళమే ఆయెను. నేను పిచ్చిదాన్ని. నువ్వు పిచ్చిదానివి” అంది పిల్లి.

“నేను పిచ్చిదా న్నని నీ కెల్లా తెలుసు”

“పిచ్చిదానవే. పిచ్చిదానవు కాక పోతే ఇక్కడకు రానేరావు -”

అదేం సబబో పాపకు తెలియనే లేదు.

“సరే, పోనీ! నువ్వు పిచ్చిదాన వని నీ కెల్లా తెలుసు” అని పాప అడి గింది.

“ఎల్లా తెలుసా? చెప్తా విను. అసలు కుక్క పిచ్చిది కాదని ముందు ఒప్పుకుంటావా?”

పిచ్చికుక్క లుంటా యని పాపకు జ్ఞాపకం వచ్చింది. కాని, వాదం ఎందు కనుకొని సరే, ఔను అని ఒప్పుకొంది.

“కుక్కకు సంతోషం వస్తే తోక ఆడిస్తుంది. కోపం వస్తే, గుఱ్ఱుమని పళ్ళు బైటపెట్టుంది. మరి నేను సంతోషం వస్తే గుఱ్ఱుమని పళ్ళు ఇకి లిస్తాను. కోపంవస్తే తోకాడిస్తాను. అందుచేత నేను పిచ్చిదాన్ని. తెలి సిందా?”

“నువ్వు గుఱ్ఱుమనవు; మ్యావు అంటావు” అంది పాప.

“నీ యిష్టం, ఏదన్నా అనుకో. నువ్వు రాణీగారితో పచ్చీసు ఆటకు వెళ్తున్నావా?” అని అడిగింది పిల్లి;

“లేదే. నన్నెవళ్ళూ పిలవలేదు. నాకూ వెళ్ళాలనే ఉంది” అంది పాప.

“అక్కడ మళ్ళీ కనబడతాలే” అంటూ పిల్లి అక్కడే అదృశ్య మై పోయింది.

అన్ని తమాషాలకూ అలవాటు పడి ఉంది గాబట్టి, పిల్లి మాయమవ టం, పాపకు మరీ అంత ఆశ్చర్యం కల్గించలేదు. పిల్లి మాయమైన చోటు కేసే చూస్తూ నిల్చుంది. మళ్ళీ పిల్లి హఠాత్తుగా అక్కడ ప్రత్యక్షమైంది.

“అన్నట్టు అడగటం మర్చిపోయాను. ఇందాక ఆ పిల్లవిషయం ఏమైంది?” అని పాపను అడిగింది.

“ఆ పిల్ల పంది పిల్లగా మారి పోయింది” అంటూ తడుముకో కుండా, ఆ పిల్లి అల్లా కనబడి అడగ టంలోగాని, ఆ పిల్ల అల్లా మారి పోటంలోగాని ఏమీ వింత లేనట్లుగా, పాప మామూలుగా జవాబు చెప్పింది”

“అల్లాగే ఔతుం దనుకొన్నాను. అంటూ పిల్లి మళ్ళీ మాయ మైంది.

మళ్ళీ పిల్లి కనబడుతూందేమో నని పాప కాసేపు అల్లాగే చూస్తూ నిలబడింది. ఇక కనబడకపోయేటప్ప టికి తొఱ్ఱికుందేలుఇల్లు ఉందని పిల్లి చెప్పిన వైపుకు నడుస్తూ రెం డడగులు వేసింది.

“వెఱ్ఱివెంగళాయిలను చాలా మందినే చూశాను. అందుకని తొఱ్ఱి కుందేలునే పోయి చూస్తాను. అంటే ఏమిటో, ఎల్లా ఉంటుందో - తొఱ్ఱిలో ఉంటే బాగా పిచ్చిపిచ్చిగా ఉంటుంది గాని ఇక్కడ తొఱ్ఱి లేం లేవుగా; అందు చేత మరీ అంత పిచ్చిగా ఉండదేమో?” అనుకొంటూ మళ్ళీ కాస్త తలెత్తింది.

పిల్లి మళ్ళీ కొమ్మమీద ప్రత్య క్షమయి—

“‘పంది’ అన్నావా, ‘కంది’ అన్నావా? ఏమిటీ అన్నావు?” అని అడిగింది.

“‘పంది’ అనే అన్నాను. అయినా నీవు అల్లా మాట్లాడితే మాయమయి, మళ్ళీ ప్రత్యక్షమౌతూ రాకు. అల్లా హఠాత్తుహఠాత్తుగా మారితే తల దిమ్మెత్తుతోంది” అంది పాప.

“అల్లాగేలే” అంటూ పిల్లి మళ్ళీ మాయమవటం మొదలుపెట్టింది. ఈ మాటు తోక దగ్గిరంచీ మాయ మాటం మొదలుపెట్టింది. పిల్లి అంతా మాయమయ్యాకకూడా, ఆ ఇకిలింపు మాత్రం కాసేపు అల్లాగే మిగిలి చివరికి మాయమయింది.

“ఇకిలింపు లేని పిల్లులను చూశాను గాని, పిల్లికూడా లేని ఇకిలింపు ఎక్కడా చూడలేదే! ఇది మరీ గమ్మత్తుగా ఉంది” అనుకొంది పాప.

పాప అల్లా కొంత దూరం నడిచే టప్పటికి “తొఱ్ఱికుందేలు” ఇల్లు కన బడింది. తొఱ్ఱికుందేలు ఇల్లే అనేం దుకు దృష్టాంతంగా, రెండు పొగ గొట్టాలు అచ్చు కుందేలు చెవుల్లాగా ఇంటిపైకి నిక్కపొడుచుకొని ఉన్నాయి.

నిర్బంధ ప్రాథమిక విద్య

శ్రీ తాటిపర్తి శ్రీకంఠము

భారతదేశమున అక్షరాస్యుల సంఖ్య నూటికి పదమంది మాత్రమే యనుట నిర్వివాదము. ఇట్టి దుస్థితికి గత 150 సంవత్సరములనుండి మన దేశము పరాధీనతయం దుండుటయే ముఖ్యకారణ మని మన దేశీయ నాయకులు పలుమా రుగ్గడించి యున్నారు. భారతీయుల నూటికి నూరుపాళ్ళు అక్షరాస్యులు జేయవలయునన్న ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యావిధానమే శరణ్యమైన ఏకైక మార్గమని శ్రీ గోపాలకృష్ణగోఖలే మహాశయుడు 1912 వ సంవత్సరముననే ప్రబోధము గావించెను గాని ఆ మహనీయుని సత్సంకల్పము నాడు విఫలమయ్యెను.

నేడు భారతావని స్వతంత్రమయ్యెను. భారతీయులు స్వేచ్ఛావాయువుల పీల్చుచున్నారు. నాడు భారతీయుల దుస్థితికి పారతంత్ర్య శృంఖలములు ఆటంకమయ్యె ననుటయం దతిశయోక్తి లేదు. కాని నేడు మన పారతంత్ర్య శృంఖలములు విచ్ఛిన్నము లైనవి. కనుక మన ప్రజాసామాన్యముయొక్క సాంఘిక, ఆర్థిక రాజకీయాభివృద్ధికి మూలమైన అక్షరాస్యతావ్యాప్తికి నేటి మనజాతీయ కేంద్రరాష్ట్రీయ ప్రభుత్వములు తీవ్రమైన కృషిని జరుపవలసియున్నవి. ఇట్టి కృషికి నాందీ ప్రస్తావనగా, యుద్ధానంతర పునర్నిర్మాణ ప్రణాళికయందు కొంత నిర్బంధ ప్రాథమిక విద్యాప్రవేశమునకు మన రాష్ట్రమున పునాదులు వేయబడినవి. కాని అట్టి కృషి సక్రమపద్ధతిని నడుపబడనందున ఫలితము శూన్యమయ్యెను. భారతప్రజానీకభవిష్యదభ్యుదయమునకై కంకణము కట్టుకొన్న నేటి మన జాతీయ ప్రజామంత్రివర్గములు సుమారు రెండు సంవత్సరములనుండి రాష్ట్రీయ స్వపరిపాలనా చక్రమును సాగించుచున్నను, భారత దేశాభ్యుదయమునకు పునాదియైన ప్రాథమిక విద్యావ్యాప్తి విషయమున తగినంత శ్రద్ధ వహింపకుండుట చాల శోచనీయమైన విషయము. స్వాతంత్ర్య సంపాదనానంతరమున కేంద్రప్రభుత్వము విశేష విపత్కర పరిస్థితుల యందున్నను, ఆయా రాష్ట్రీయ ప్రభుత్వములు ప్రాథమిక విద్యావ్యాప్తి విషయమున యింతవరకు శ్రద్ధ వహించినట్లు కన్పించుటలేదు. ప్రాథమిక విద్యావ్యాప్తికి ప్రస్తుతము మన రాష్ట్రమున నామమాత్రావశిష్టముగనున్న నిర్బంధ ప్రాథమిక విద్యావిధానమును సక్రమమార్గమున అమలు జరుపవలెను. మన రాష్ట్రములో క్రమక్రమముగ ప్రవేశపెట్టబడుచున్న విధానము విజయవంతమగుటకు తగిన అనుకూలపరిస్థితులను సాధకబాధకములను కొంత పరిశీలింతము.

మన రాష్ట్రమున యుద్ధానంతర పునర్నిర్మాణ ప్రణాళికయందలి ఒక భాగముగ నిర్బంధ ప్రాథమికవిద్య ప్రప్రథమముగ 1945 సంవత్సరమున కొన్ని గ్రామములయందు ప్రవేశపెట్టబడెను. ప్రతితాలూకాయందును ఒకటిరెండు కేంద్రములయందు ప్రారంభించిరి. గుంటూరు జిల్లాయందు మాత్రము ఈ కేంద్రముల సంఖ్య మిక్కుటముగ నున్నట్లున్నది. ప్రతితాలూకాయందును 5, లేక 6 కేంద్రములలో ప్రవేశపెట్టబడెను. 1946 లో కూడ సుమారు అన్నికేంద్రములయందు ప్రకటించిరి. 1947 లో సెప్టెంబరు నుండి మూడవజట్టు, సుమారు తాలూకాకు 5 లేక, 6 కేంద్రములలో పెట్టబడెను. గత రెండు సంవత్సరములయందు జరిగిన విధముననే ఈ మూడవ సంవత్సరమునకూడ నిర్బంధవిద్య ప్రవేశపెట్టబడుచున్న కేంద్రములయందు కర్మకాండ అంతయు ముగిసినది. ఆయా కేంద్రములయందలి బడియీడు పిల్లలందరు అచ్చటి పాఠశాలలలో చేర్చబడిరి. అందువలన ఆయా కేంద్రములయందు బడియీడు గల బాలబాలికల కందరకును విద్యాశిక్షణ సక్రమముగ సాగుచున్నదని విద్యావ్యాసంగముగల పెద్దలు ప్రభుత్వము, వేయేల ప్రజానీకము భావించుట సహజము. ప్రజానీకము ఆయా కేంద్రములయందలి విద్యానిర్వహణ శాఖాధికారులకును, ప్రాథమికోపాధ్యాయులకును తగిన సహకారమునొసంగకుండుటయే గాక, యీ విధానాచరణ యందలి ఆంతర్యమును గ్రహింపక ధిక్కరణమును కూడ చూపుట పరిపాటియైనది. కాగితములపైన పునర్నిర్మాణప్రణాళికలు అమలు జరుగుచున్నను, యథార్థవిషయములును, వాని ఫలితములును తద్భిన్నముగ గత రెండు సంవత్సరములయందును జరిగిపోయిన వనుటయం దతిశయోక్తి లేదు.

1945-వ సంవత్సరములో నిర్బంధ విద్య ప్రవేశపెట్టిన వెంటనే, ఆయా కేంద్రములలోని పాఠశాలలు, నూతనముగ చేర్చిన పిల్లలచేత నిండిపోయినమాట వాస్తవము. కాని అట్టి ఉత్సాహకర పరిస్థితులు ఎంతకాలమో ఉండలేదు. నాటి తాత్కాలిక ప్రోత్సాహకర దృశ్యమునకు పేదపిల్లలకై చేయబడిన మధ్యాహ్న భోజనవసతి ఏర్పాట్లు దోహదము నొసంగినవి. మనదేశమున అందు ముఖ్యముగ మనరాష్ట్రమున యుద్ధకాలమునందలి పరిస్థితులకంటె యుద్ధానంతర కాలములో ఆహారవస్త్ర పరిస్థితులు విషమరూపమును దాల్చుటచేత, ప్రజానీకమునకు 8 ఔన్సుల రేషను గతి యగుటచేతను, మధ్యాహ్న భోజనపు ఏర్పాట్లు ప్రభుత్వముచేత విరమింపబడెను.

పాఠశాలల హాజరు పట్టీలయందున్న పిల్లల సంఖ్యనుబట్టి అదనముగ ఉపాధ్యాయులు ఏర్పాటు చేయబడిరి కాని పిలల హాజరు సంఖ్య క్రమముగ క్షీణించిపోయినది. నూటికిపైన రోలుసంఖ్య కలిగి, నలుగు రైదుగురు టీచర్లు గల పాఠశాలల్లో నేడు ఒకరిద్దరు టీచర్లకు తగినంత మంది పిల్లలుమాత్రమే హాజరగుచుండుట సర్వసాధారణ దృశ్యములలో నొక్కటి. అథవా, ఏకొద్ది కేంద్రములలోనైనా ప్రోత్సాహకరమైన హాజరున్నచో, తగిన యింటి వసతి ఏర్పాట్లు, ఫర్నిచరు బోధనోపకరణములు లేక నామమాత్రపు పాఠశాలలుగ కాలముగడచి పోవుచున్నది. మొదటి జట్టు నిర్బంధవిద్య పెట్టబడి యిప్పటికి రెండు సంవత్సరము లైనను, చాలీచాలని గొడ్ల పాకలలో ఫర్నిచరు, బోధనోపకరణములు లేక పిల్లల గుంపులను కాపలి కాయుచున్న ఉపాధ్యాయులుగల పాఠశాలలతో నిండిన నిర్బంధవిద్యాకేంద్రములు తరచుగ కానవచ్చుచునే యున్నవి.

నిర్బంధ కేంద్రములలోని పాఠశాలల యిండ్లు ఫర్నిచరు, బోధనోపకరణముల విషయములట్లుండ పిల్లల హాజరు, విద్య, ఉపాధ్యాయుల కృషి, గ్రామస్థుల సహకారము లెట్లున్నవో కొంత విచారింతము. రెండు సంవత్సరముల నాడు చేర్చబడిన బాలురుగాని, బాలికగాని, ఒక్కదఫాయైనను బడికి రాకపోయినను రుజు హాజరు గుర్తించవలసినదేగాని పేరు తీసివేయుటకు వీలులేదు. నిర్బంధ ప్రవేశసమయమున గుంపులుగుంపులుగ చేర్చబడినవారందరు సహజముగ మొదటితరగతియందే చేర్చబడియుందురు కదా! ఇప్పటికి రెండు సంవత్సరములు దాటినందున వారందరూ స్టాగ్నేషన్ లిష్టులలో ఎక్కుదురు. ఎక్కువ స్టాగ్నేషనులు ఉన్నవని స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్లు రిమార్కు చేయుదురను భయమున, 'అ, ఆ' లు రాని పిల్లలను, ఒక్కపర్యాయమైన బడి ముఖము చూడని పిల్లలను రెండవ తరగతికి టీచర్లు నెట్టుచున్నారు. 1945, 1946 సంవత్సరములలో ఒక్క కేంద్రములోనైన డిఫాల్టర్ల లిష్టులు తయారు చేయబడినట్లుగాని, వానిపై విచారణ జరిపి, జిల్లాబోర్డువారు చర్య తీసుకొన్నట్లుగాని ఒక్క ఉదాహరణగాని కానరాదు. లోగడ ప్రాథమిక విద్యాచట్టమున చర్య తీసుకొను అధికారము జిల్లాబోర్డు అధ్యక్షుల కొసంగబడియుండెను. తత్కారణమున హాజరు అభివృద్ధికై టీచర్లు ప్రచారము చేయు సందర్భమున, డిఫాల్టర్లపై ప్రభుత్వము చర్య తీసుకొనుననియు, శిక్షలు విధించుననియు పిల్లల తల్లిదండ్రులకు చెప్పినచో వారికి హాస్యాస్పదముగ నుండుటయేగాక, టీచర్ల స్థితికూడ హేళనపాత్రమగుచున్నది. "గత రెండు సంవత్సరములలోను బొత్తుగా పిల్లలను పంపని వారిని ఏమిచెయ్యగలిగినా రయ్యా?" అని అప్పడప్పడైనను బడికి పిల్లలను పంపుచున్న తల్లిదండ్రులు ప్రశ్నించుచున్నారు. ఉపాధ్యాయులు సమాధానము చెప్పలేక నీళ్ళు నములుచున్నారు.

ఇక ఉపాధ్యాయుల పాట్లు ఎట్లున్నవో చూడుడు. సగటు హాజరు తగ్గినచో ఉపాధ్యాయుల పోస్టులు తగ్గిపోవునని భయపడి, ఉపాధ్యాయుల సంఖ్యకు తగినంత కనీసపు హాజరును వేసినచో పరీక్షాసమయములయందు తక్కువ హాజరునకు సమాధానము చెప్పజాలకయు, హాజరైన కొద్దిమందికైనను తగిన ప్రోగ్రెసు చూపింపజాలకయు పరీక్షాధికారులవలన మాటపడవలసివచ్చునను భయముచేతను టీచర్లు తమ కాలమును "ముందు నుయ్యి వెనుక గొయ్యి" అన్నట్లు కాలక్షేపము చేయుచున్నారు.

నిర్బంధవిద్యానిర్వహణ బాధ్యత, పెత్తనము చట్టరీత్యా వహించిన జిల్లాబోర్డు అధికారులు డిఫాల్టర్లపై ఎట్టి చర్యయు యింతవరకు జరుపనందుననే యిట్టి విపరీత పరిస్థితులు ఆయా గ్రామములయం దేర్పడియున్నవి.

ఈ విషయమున విద్యానిర్వహణ శాఖాధికారుల స్థితియు చాల శోచనీయముగనే యున్నది. ఆయా గ్రామములయందు హాజరు కమిటీలు గ్రామములోని పలుకుబడిగల పెద్దమనుష్యులతో ఏర్పాటుచేయబడి విద్యాశాఖా డైరెక్టరుగారి అనుమతినికూడ పొందియున్నవి. కాని ఈ హాజరు కమిటీలు ఎట్టిపనియు చేయలేదనుట అతిశయోక్తి కాదు. చేయుటకు తగిన పరిస్థితులు కూడ లేవు. నూతన చట్టరీత్యా ఆయా తాలూకాలకు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు ఈ హాజరు కమిటీలకు అధ్యక్షులైనను, ఇప్పటికే 10, లేక 12 కేంద్రములు గల రేంజిలో, 10 లేక 12 దినములు ఈ పనికే సరిపోవును. ప్రస్తుతము డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ల బాధ్యతలు చాల మిక్కుటముగ నున్నవి నిర్వహించవలసిన కార్యకలాపములలో ఒకదానికొకటి సంబంధము లేదు. ఏ ఒక్క విషయమున ఎక్కువ కృషి చేసినను, రెండవ విషయములో లోటు జరుగును. పై యధికారులైనను, 'ఎవరికివారే యమునాతీరే' అన్నట్లు విభిన్న దృక్పథముతో ఆయా నిర్వహణమును పర్యవేక్షణ చేయుదురేగాని, పరస్పర సంబంధము లేని విభిన్నశక్తులను కార్యకలాపమును ఐక్యతతో నిర్వహించుకొనుటయందలి కష్టములను, సాధకబాధకములను గమనించుటలేదు. తమ తనిఖీక్రింద 80 మొదలు, నూరువరకు సంఖ్యగల పాఠశాలలు గల ఆఫీసర్లు ప్రతిపాఠశాలకు సాలుసరి పరీక్ష జరుపుటయేగాక కనీసము రెండు పర్యాయములైనను ఆకస్మిక తనిఖీలు (Surprise Visits) చేయవలయును. రెండు ఆకస్మిక తనిఖీలకు, సాలుసరి పరీక్షకు మధ్య తగిన కాలవ్యవధి యుండవలెను. ముందుగా నిర్ణయించుకొని పంపిన ప్రోగ్రాములో ఏ కొంచెమైనను మార్పు గావించుకొనుటకు కూడ స్వాతంత్ర్యము లేక తమతమ కోటాలను ఎట్టెట్టులో పూర్తి చేసుకొన ప్రయత్నించుటయందే కాలము వ్యయమగుచున్నది. ప్రయాణసౌకర్యములు లేకయు, భోజనసౌకర్యములు లేకయు, ప్రస్తుత ఆహారక్లిష్టపరిస్థితులయందు పరీక్షలనైనను త్వరితగతిని ముగించుటకు, దినమున కొక్క తనిఖీమాత్రమే చేయవలయునను ఉత్తర్వులు ప్రతిబంధకములుగ నున్నవి. కొన్నిచోట్ల పాఠశాలల సంఖ్య తక్కువయైనను, తాలూకా కంతకు ఒక్కరే అధికారులైనచోట్ల తిరుగవలసిన ప్రదేశముయొక్క వ్యాప్తి అధికమైనందున ప్రయాణములయందే కాలము చాల వ్యయమగుచున్నది. ఇట్టి క్లిష్టతర పరిస్థితులుగల చోట్లలోనే ప్రయాణసౌకర్యములుకూడ సరిగా లేక, సైకిలుపోవు బాటలుకూడ లేక చాల భాగము నడకతో వెళ్ళవలసివచ్చినచో నెల ప్రోగ్రాము పూర్తియగుటకే శ్రమపడవలసి వచ్చుచున్నది. శ్రమపడినను ఫలితము కానరాకున్నది. తప్పని సరిగ ఉపాధ్యాయ కేంద్రసంఘసమావేశములకు హాజరు కావలెను. ఒకే Peon గల ఆఫీసరు చాలా దినములు ప్రయాణములో నున్న రెండు దినములకైనను సరిపోవు రేషను ఇవ్వజాలని రేషనింగు విధానము అమలులోనున్న దినములలో బస్తీలోని తమ సంసారమునకు రేషనింగు గింజలు కూడ తెచ్చియిచ్చు దిక్కు లేక కుటుంబము నానావస్థలు పడుచుండెను. ఇప్పటికైనను రేషనింగు విధానము సడలింపబడుట ముదావహము.

ఇట్టి దుర్భర, అనివార్య పరిస్థితులయందున్న ఇన్‌స్పెక్టర్లపై నూతన విద్యా నిర్బంధ చట్టము 'రాచపుండుపై రోకటిపోటువలె' నున్నది. నిర్బంధ కేంద్రములయందు డిఫాల్టర్ల పోషకులకు నోటీసులను జారీచేసి, విచారణచేసి శిక్ష విధించి, ఆ శిక్ష అంగీకారమునకు D. E. O. గారికి పంపు బాధ్యత అంతయు (D. I) ఇన్‌స్పెక్టర్లపైన పెట్టబడినది. డిఫాల్టర్ల పోషకులను పిలిపించి విచారించుటకు ఒక్కొక్క దినము తప్పక పట్టును. ఈ సంవత్సరము కూడ, 5, లేక 6 కేంద్రములు ప్రారంభము చేయబడిన తాలూకాలలో మొత్తము 15 మొదలు 18 వరకు కేంద్రములుండవచ్చును. అట్టి తాలూకాకు ఒక్కరే (D I) ఇన్‌స్పెక్టరు అయినచో, ఈ ఒక్క పనికే 15 మొదలు 18 దినములు పట్టును. ఈ కేంద్రము లన్నియూ ఒకే చోట నుండక నాలుగు వైపులనుండుట సహజము. కనుక ప్రయాణమునకు మరికొన్ని దినములుపోవును. ఇట్లు కనీసము ఈ నిర్బంధవిద్యా విధానమునకే 20 దినములు పట్టును. కనుక డిప్యూటీ ఇన్‌స్పెక్టరు తన పూర్వపు కలాపమును, అనగా సాలుసరి పరీక్షలు, విజిట్లు, ఆఫీసుకరస్పాండెన్సు చూచుకొనుటకు తగిన వ్యవధిగాని, అవకాశముగాని ఉండనేరదు. పైగా వందలకొలది డిఫాల్టర్లగల ప్రతియొక్క కేంద్రములోని పోషకులకు నోటీసులు జారీచేయుట, విచారణచేసినతర్వాత లిస్టులను D E O. గారికి పంపుట వగైరా పని చాల అధికముగ ఆఫీసు గుమాస్తాలపై బడుచున్నది.

కనుక ఇప్పటికి మూడుదఫాలుగా ప్రవేశపెట్టబడిన నిర్బంధప్రాథమికవిద్య సక్రమముగ నిర్వహింపబడవలయునన్న, తలకుమించిన భారమునంతను ఇన్‌స్పెక్టర్లపైన వేసి, నిర్వహణకు తగిన అవకాశములను, సౌకర్యములను

ఇంటి పైకప్పు అంతా పాకలాగా; పైన బొచ్చుతో అల్లినట్టుగా ఉంది. ఇల్లు చాలా ఎత్తుగా పెద్దదిగా కనబడేటప్పటికి 'ఇంత చిన్న పిల్లనుగా వెళ్ళటం బాగుండ' దని ఎడమచేతిలో మిగిలిఉన్న ముక్క కొంత నమిలి, రెండడుగుల ఎత్తు మనిషి అయ్యేదాకా ఆగింది.

అప్పటికికూడా పాపకు లోపలికి వెళ్ళటానికి భయం భయంగానే ఉంది. అల్లాగే పిరికతనంతో ఇంటివైపుకు కదులుతూంది.

ఓ వేళ, మరీ, పిచ్చెత్తిపోయి ఉండదుగదా. తీరా ఇటు వచ్చేశానే-కొత్తివెంగళాయిని చూడటానికని వెళ్ళినా బాగుండేదీ!"

ఖులాసా కబురు

'సినిమాలంటే పెద్దలకు అలుసు'

శ్రీ జి. యస్. సూరి

సంఘంలో కనబడే అవకతవకలకు, దురాగతాలకు, అవినీతికి ఏదో ఒకటి మూలకారణమని సమర్థించటం పెద్దవాళ్ల లక్షణం. సాధారణంగా జనబాహుళ్యాన్ని ఏది అధికంగా ఆకర్షిస్తుందో అది వీరిదూషణకు తప్పక గురి అవుతుంది. లోకంలో జరిగే ప్రతిసంఘటనా అందుకు ఫలితమే నంటారు. ఇంతలో ప్రజలదృష్టి మరో వైపుకు ప్రసరిస్తుంది ఏక్రొత్తవిషయాన్నో చూసి నలుగురూ మోజుపడతారు. వెంటనే పెద్దలనిపించుకుంటున్నవాళ్లు లోకంలోని లోపాలన్నిటిని దీనికి అంటగట్టి బహిష్కరిస్తారు. ఈపరిణామానికి అంతూపంతూ వుండదు.

కొంతకాలం క్రిందటివరకు ఇంగ్లీషు చదువు ఈ స్థానాన్ని అలంకరించి ఉండేది. ఇంగ్లీషు చదువుకున్నవాడికి నీతినియమాలు నశించిపోతాయనేవాళ్లు. భావాలు, ప్రవర్తన పెడదారిని పట్టిపోతాయన్నారు. వర్ణసంకరానికి, మహాపాతకాలకు ఆ చదువు దారితీసుందన్నారు. అందులో ముఖ్యంగా భారతీయస్త్రీలకు ఇది బొత్తిగా తగదన్నారు. వాళ్ల తత్వాలకు ఎంతమాత్రమూ పడక పూర్తిగా ఫిరాయిస్తుందన్నారు. జాతిభ్రష్టతకు ఇదే కారణమన్నారు. ఎవడేమి నేరం చేసినా ఈ నడమంతరపు ఇంగ్లీషు చదువే అందుకు హేతువు అన్నారు. అయితే ఇంగ్లీషు చదవకుండా ఈలాంటిచేష్టలను చేసేవాళ్ల మాట ఏమిటని ఏ బుద్ధిమంతుడైనా ప్రశ్నిస్తే, నీకేమి తెలుసు ఊరుకోవోయ్ అని బొంకరించి నోరు మూయించేవాళ్లు.

ఇంతలో దేశంలో సినిమాలు అవతరించినాయి. మొదటిరోజులలో వింతగా ఉంటాన జనం ఎగబడ్డారు. పట్టణాలలో ముందు ప్రవేశించి క్రమంగా పల్లెటూళ్లవరకూ పాకిపోయినది. దేశభాషలలో చిత్రాలు రావటం మొదలైన తరువాత ఆబాలగోపాలమూ, కలకండచుట్టూ చీమలు మూగినట్లు, సినిమాలచుట్టూ గుమిగూడారు. వెంటనే గమనించారు మన పెద్దలు. చీల్చి చెండాడటానికి క్రొత్తది దొరికిందికదా అని చంకలు కొట్టి గంతులు వేశారు.

ఎక్కడైనా వింతదొంగతనం జరిగితే సినిమాలే నేర్పినవన్నారు. ఏస్త్రీపురుషులైనా కట్టుబాట్లని త్రోసిపుచ్చి స్వేచ్ఛగా ప్రవర్తిస్తే అందుకూ సినిమాలే కారణమన్నారు. ఒకడు ఇంకొకడి గొంతుక కోస్తే అది సినిమాలను చూడడంవల్లనే అన్నారు. ఆడదిగాని మగవాడుగాని ఇంపుగా సింగారించుకుంటే అదుగో సినిమా అన్నారు. కూనిరాగం తీసే సినిమా, గట్టిగా నవ్వితే సినిమా, ఊం అంటే సినిమా; ఆం అంటే సినిమా; కదిలితే సినిమా; మెదిలితే సినిమా—కళ్లుమూసుకుంటే కంసుడికి శ్రీకృష్ణుడు కనిపించినట్లు, పాపం ఈపెద్దలకు లోకమంతా సినిమామయంగా గోచరిస్తుంది.

ఆరోగ్యం చెడడానికి పొగాకు కాఫీలు, బుద్ధులు చెడడానికి సినిమాఫిలుములు అని ఈ ధీమంతుల వాదం. అయితే వీటిప్రసక్తి ఈపెద్దమనుషులకు అసలు లేనా అంటే, ఆ! నిజమే టాని! వీలు లేదు. వీరిలో చాలమంది వీటివల్ల ఒకప్పుడుగాకపోతే ఒకప్పుడైనా ఆనందం పొందేవాళ్లే కాని వీటిని మరి ఎందుకు దూషిస్తారూ అంటే, అది పెద్దరికపు లాంఛనం కాబట్టి. అవి పదిమందిని ఆకర్షించినవి కాబట్టి. లోపాలన్నిటిని దేనికో ఒకదానికి ముడిపెట్టాలి కాబట్టి. అంతకంటె వేరే సమాధానం కనబడదు.

తప్పు చేసేవాడు తాను చేసేది తప్పు అని తెలుసుకోలేకపోవటంవల్ల గాదు ఆ విధంగా చేసేది. దేనినైనా చూసినంతమాత్రాన బుద్ధులు మార్చుకుంటూ రనేమాట వట్టికల్ల. పురాణాలు చదివినవాళ్ళు ఏవిధంగానైనా మారారా? ద్రౌపది చరిత్రను విన్న ఏస్త్రీ అయినా అయిదుగురు భర్తలను కట్టుకోటానికి ప్రయత్నించిందా? సుభద్రగాథను చదివిన కన్యలంతా బావలతో లేచిపోయినారా? భారతం చదివినవాళ్లు ఎవరైనా ధర్మరాజువలె జూదంఆడి భార్యను ఓడిపోయినవాళ్ళు ఉన్నారా? వాలిసుగ్రీవుల వ్యవహారం చదివినవాళ్ళు అందరూ సోదరుణ్ణి చంపి వదినెను కట్టుకున్నారా? గంగ శంతనుల చరిత్ర చదివిన తల్లులందరు పిల్లలను గొంతు నులిమారా? అంతవరకూ ఎందుకు? ఈ ఇంగ్లీషుచదువులను, సినిమా ఫిలుములను తిట్టే పెద్దలందరూ ప్రబంధాలు చదివి లొట్టలు వేసినవాళ్ళేగదా. వీరిలో ఎంతమంది శశాంకుడివలె గురుపత్నిని ఆశించారు? మాయప్రవరుడివలె వరూధినులను మోసగించారు? ఈ ప్రబంధాలలో ఉండే పచ్చిశృంగారపు వర్ణనలు మద్రాసు కథలలో ఉన్నాయా? చలంగారి కథలలో ఉన్నాయా? కాబట్టి ఈలాంటివాటివల్ల మనసు మారుతుం దనుకోటం కేవలం పొరబాటు.

సినిమాలలో దొంగతనాలు చూపితే చూపవచ్చు. వీటిని దొంగలైనవాళ్ళు చూసి క్రొత్తపద్ధతులు నేర్చుకుంటా రనుకుందాం. కాని అదే విషయాలను దొంగలు కానివాళ్లుకూడ చూస్తారు గదా! మా సినప్పుడు ఇలాంటి మోసాలు జరగకుండా ఏవిధంగా జాగ్రతపడవలసినదీకూడ వీటివల్లనే తెలుసుకోటంలేదా మరి? నిజంగా ఆలోచిస్తే సినిమాలు చూడనివాళ్లు టోపీపడినట్లు సినిమాచూసేవాళ్ళు పడరు.

సినిమా చిత్రాలలో తాగుడు, జూదాలు, హత్యలు చూపిస్తున్నా రనుకోండి. అయినా ఈ వ్యసనాలవల్ల, ఏ విధంగా సర్వనాశనం అవుతుందో అనే విషయంకూడ ఎట్లా తెలియక పోతుంది? అంగసౌష్ఠవం బాగా వ్యక్తమయేట్లు ఫిలిములలో స్త్రీలను ప్రదర్శించే మాట నిజమే. ప్రణయఘట్టాలకు ప్రాధాన్యత ఇచ్చేమాటా నిజమే. కాని వీటివల్ల అవినీతి ఎట్లా అవతరిస్తుందో దురూహ్యంగా ఉన్నది. అదిగాక పోగా అనేకమంది పామరులు వీటివల్ల వాళ్ల సంసారవిషయాలను విలాసవంతంగా చేసుకోగలుగుతున్నారు. దేవాలయాలమీద, రథాలమీద ఉండే బొమ్మలను చూసి చెడిపోనివాళ్లు సినిమాలను చూసి పాడవుతారంటే నమ్మదగిన విషయం కాదు.

పూర్వం సంగీతాది లలితకళలన్నీ గొప్పఇంటివాళ్లకు తప్ప అందుబాటులో ఉండేవికావు. పాటకచ్చేరీలు, నాటకాలు, భరతనాట్యాలు, ప్రదర్శనాలు—మొదలైనవన్నీ సామాన్యజనానికి దూరంగా ఉండేవి. సారస్వతంలో ఉన్న ఉత్కృష్టగాథలు విద్యావంతులకు తప్ప తెలిసేవిగావు. సినిమాల ధర్మమా అంటూ ఇవన్నీ జనబాహుళ్యానికి అందుబాటులోకి వచ్చినాయి.

నాలుగణాలు పారేసి, జీవితంలోని కష్టాలను కాసేపు మరచిపోయి, హాయిగా ఆనందించటానికి వీలయింది లల్లాయిపదాలుతప్ప ఎరగని ఆసేకులు, వింతవింత వాయిద్యాలతో పాడే సంగీతాన్ని వినగలుగుతున్నారు. ఉన్న గ్రామం తప్ప దేశాలను చూడలేనివాళ్లు భూభాగంలోని విశేషాలన్నీ తెలుసుకోగలుగుతున్నారు. జీవితంలో సంభవించే సంఘటనలు, అవాంతరాలు, మోసాలు, ఆశయాలు, అనుభవాలు అనేకం తెలుసుకోగలుగుతున్నారు. ప్రపంచజ్ఞానం పెంపొందటానికి సినిమాలవంటి సాధనం జనబాహుళ్యానికి మరొకటి లేదు.

ఏది ఎట్లా ఉన్నా, ఏదో ఒక విషయాన్ని నిర్హేతుకంగాను సంకుచితంగాను ద్వేషించి తూర్పారపట్టడం పెద్దలకు తగిన లక్షణం కాదు. క్రొత్తవిషయాలకు పరిచెట్టుకోలేకనో భిన్నగా వాటిని అవగతంచేసుకోలేకనో పెద్దరికం చలాయించటానికి ఊరికే ద్వేషించి తూలనాడటం కేవలం సాహసం అనక తప్పదు.

కల్పింపకపోయినచో నిష్ప్రయోజనము. లోగడ ప్రభుత్వమువారిచే ఆలోచింపబడి కారణాంతరములచే విరమింపబడిన హాజరు ఉద్యోగి (Attendance Officer) గాని, లేక యితర పేరుతోనైనను ఒక్కొక్క తాలూకాకు, ఒక్కొక్క ప్రత్యేకోద్యోగి, నిర్బంధవిద్యకై నియమింపబడకపోయినచో విధి నిర్వహణము దుర్భరమగుటయేగాక ఫలితము శూన్యమగును. అనుకూలములను కల్పించుటలో, ఒక్కొక్క గుమాస్తాగల ఆఫీసులలో రెండవ గుమాస్తాను నియమించవలయును. ఆఫీసు కరస్పాండెన్సు బాధ్యతగల ప్రతి (Senior D. I.) సీనియరు డిప్యూటీ ఇన్‌స్పెక్టరునకు రెండవ ట్యాపు అవసరము. సీనియర్ ఇన్‌స్పెక్టర హోదా పెరుగవలయునన్న, అతని జీతముకూడ, అతనిపై విధింపబడిన బాధ్యతలకు తగినట్లుగా నుండవలెను. తోటితాలూకా ఆఫీసర్లలో తలవంపులు లేక తిరుగుటయేగాక, తాలూకా ముఖ్యపట్టణముగు బస్తీలలో ఆలుబిడ్డలతో జీవించుట కవసరమైన కనీసవేతనమైనను నూరురూపాయిలకు పైబడి యుండవలయును. విద్యాశాఖలోని B. A, B. Ed యోగ్యత గలిగిన తాలూకా ఉద్యోగికి, S. S. L. C. మాత్రమే చదివి స్థానికముగ ఆఫీసులో పనిచేయు సబ్‌రిజిస్ట్రారునకున్న కనీసవేతనమైనను లేకుండ చేయుట, నేటి ప్రభుత్వమునకుకూడ, విద్యాశాఖపై గల నిరాదరణను తెలియజేయుచున్నది.

కనుక మద్రాసురాష్ట్రీయ ప్రభుత్వోద్యోగుల జీతముల సవరింపు సందర్భమున విద్యాశాఖకు నిన ఈ అన్యాయమును, వ్యత్యాసమును తొలగించి, సమర్థులైన వ్యక్తులు, విద్యాశాఖకు ఆకర్షింపబడునట్లుగా ఉన్నతమైన వేతనము లను నిర్ణయింపవలయును.

సవరింపబడిన చట్టముప్రకారము నిర్బంధ విద్యావిధానము సౌలభ్యముగ అమలు జరుగవలయునన్న పై సూచనలను ప్రభుత్వము సానుభూతితో ఆలోచించి అమలుజరుపవలయును. జిల్లా విద్యాశాఖాధికారులుకూడ ఈ నిర్బంధవిద్యావిధాన సమస్యలోని సాధకబాధకములను, ఔదార్యముతోడను సానుభూతితోడను పర్యవేక్షణచేసి, తగిన మార్పులకొరకు సలహాలను విద్యాశాఖా డైరెక్టరుగారికి పంపగలరని ఆశించుచున్నాము. నిర్వహణ శాఖయందు సానుభూతితో సత్వరమైన మార్పులు జరుగనిచో నిష్కర్షత్వము త్వరితగతిని మనలను విడువజాలదు. మనదేశమునుండి అవిద్య తొలగిపోనిచో, మనము అధికశ్రమల కోర్చి త్యాగము చూపి సంపాదించిన స్వాతంత్ర్యము నామమాత్రముగనే నిలచిపోవును. మన జాతీయ ప్రభుత్వములు తలచుకొన్నచో, మనల నావహించిన అవిద్యను 5 లేక 10 సంవత్సరములలోననే తరిమి వేయవచ్చును. కాని అందుకు తగిన ధనసంపత్తిని సమకూర్చుటయందును, సౌకర్యములను కలిగించుటయందును ప్రభుత్వము శ్రద్ధవహించవలయును. ప్రభుత్వము పై విషయముల యందు త్వరితముగ మార్పులు గావించినచో, ఉపాధ్యాయ వర్గమును తయారుచేయుట కష్టము కానేరదు.

కేంద్రప్రభుత్వ విద్యామంత్రి అజాద్ నేడిట్టి నిర్మాణ ప్రణాళికనే సూచించుట చాల సంతసింపదగిన విషయము. కేంద్రప్రభుత్వపు అడుగుజాడలలో ఆయా రాష్ట్రీయ ప్రభుత్వములును, అవిద్యా నిర్మూలనకై సత్వరమార్గము నన్వేషించి అకుంఠిత ధైర్యముతో అమలు జరుపవలయును. అవిద్యా నిర్మూలనకు ఏకైక మార్గమైన నిర్బంధ విద్యావిధానమున కవసరమైన ద్రవ్యమును వెంటనే సేకరించి త్వరితగతిని రాష్ట్రమునందంతటను, 5 సంవత్సరములలో విద్యావ్యాప్తిని గావింపవలయును. మనదేశమునుండి ఎంత త్వరగా, అవిద్య తొలగి పోయిన అంతత్వరగా, మన దేశము, ఆరోగ్య, ఆర్థిక, సాంఘిక, పారిశ్రామిక, రాజకీయములయందు అభ్యున్నతిని పొందగలదనుటలో సందేహము లేదు.

దొంగ సొమ్ము

(11వ పేజీ తరువాయి)

"అప్పుడప్పుడు జిహ్వ గారాంచేసే దేకాని దానికి నా మనోనిగ్రహమే మందు. వెంగప్ప ముందర బ్రాందీ తాగాలనే ఉబలాటం, తోటి కూలీలముందర నీ పుత్తేం చూపాలనే వాంఛ కాలచక్రంక్రింద అణగిపోయినాయి.

"ఇట్లా ఖిల్లీకొట్టుతోపాటు మిరాయి అం చేయించి నాభార్య చేతే అమ్మిస్తూండేవాణ్ణి దానిచేయి చల్లనిది; అంచేత అక్కడా వ్యాపారం బాగా వృద్ధిపొందింది.

"సంపాదన ఎక్కువవుతున్నా ఖర్చు మామూలే కనుక ఏడాదిలో వెయ్యరూపాయల దాకా నిలపచేశాం. వెయ్యిరూపాయిలు కళ్ళ చూశాక పెద్ద వ్యాపారం చేయాలనే బుద్ధి పుట్టి మీరు చూస్తున్న చిల్లరకొట్టే నాలుగేళ్ళ క్రింద పెట్టాం.

"భగవంతుడిదయవల్ల మురికికూపంలోంచి బయట పడి మానవుణ్ణయ్యాను." అని చేతు లెత్తి నమస్కారం చేశాడు.

నిష్కల్మషమైన చిరునవ్వులు మాయిద్దరినీ కలిపాయి. "నీ జీవితం చెలియలికట్టలోని చెలమవంటిది" అన్నాను.


ఇంటికి వస్తూన దోవలో ఒక గుంపు కనిపించింది. 'ఏమిటీ సంగతీ' అని అడిగితే ఎవరో ఇద్దరు కుర్రాళ్ళు కొట్టుకుంటున్నా రని తెలిసింది. కారణం—ఒకడికి కడుపునొప్పిగా ఉంది రెండోవాడికి సినిమాటిక్కట్టు తెమ్మని డబ్బు లిచ్చాడట. రెండోవాడు గుంపులో దూరి మాయమయ్యాడు. మొదటివాడు వెతికితే ఇద్దరూ ఇక్కడ తటస్థపడ్డారు. ఇంకేం!—కొట్టుకుంటున్నారు. గుంపులోకి తొంగిచూశాం. వాడే! నిన్న ప్రొద్దున సుబ్బయ్యకొట్లో డబ్బు లివ్వకుండా పారిపోయింది వాడే! వాడికేట కడుపు నొప్పి వచ్చింది!

సుబ్బయ్య నా కళ్ళల్లోకి చూసి చిరునవ్వు నవ్వాడు.

గాంధిజీ స్మారక చిహ్నంగా తపాలాబిళ్లలు



గాంధి స్మారక తపాలాబిళ్ళలు దాదాపు మూడుకోట్ల బిళ్ళలను ప్రభుత్వము ఆగస్టు 15 వ అమ్మకానికి విడుదల చేస్తుంది.



నూతన విద్యాసంస్కరణలు

బిడ్డ విద్యావిధానమున కేవలము భారమంతయు నుపాధ్యాయునిదే కాదు; కొంత భారము తల్లిదండ్రులపై కూడ కలదు. అట్టి సహకారము లేనిచో ఉపాధ్యాయుని ప్రయత్నములు సఫలము కానేరవు. తల్లిదండ్రులు విద్యావిహీనులయి, అనాగరికులయినచో బిడ్డకు సదభ్యాసము లలవడుట కష్టము. పంతులుగారు నడిపింప గోరిన మార్గమున కాక వేరుమార్గమున పోవుచుండును.

అది కాక ప్రభుత్వమువారు విధింపబోవు నిర్బంధ విధానమునకు కూడ విద్యరుచి తెలియని తల్లిదండ్రులవలన సహకారము సులభముగా దొరకదు. ప్రజలదే ప్రభుత్వ మయినపుడు, ఒక్క విద్యా విధానమునందే కాదు; సర్వవిషయములందు ప్రజాసహకార మత్యవసరము గనుక అట్టి బాధ్యతను గుర్తింపజేయుటకు, తన్మూలమున సత్ఫలితముల నొనగూర్చుటకు వయోజన విద్య మనదేశములో కావలెను.

ప్రస్తుత మాదర్శప్రాయముగా ప్రాథమిక, ఉన్నతవిద్యల నమలుపరచుటకు ఆర్థిక దౌర్బల్య మొకటి అవరోధ మయినది. అట్టిచో వయోజన విద్యకు ప్రత్యేక జీతముల పై నుపాధ్యాయుల నియమించుట, ప్రత్యేకభవనముల నేర్పాటు చేయుట, వేరుగా సాధనసామగ్రుల సమకూర్చుట మరియు కష్టము. అందును ముఖ్యముగా ఉపాధ్యాయుల జీతములు తృప్తికరముగ లేనిచో ఫలితము శూన్యమగును. ప్రాథమిక విద్యాలయము వలెనే ప్రతిగ్రామమునందును వయోజన విద్యాలయము కూడ అవసరము. కనుక ప్రాథమిక పాఠశాలోపాధ్యాయులకే అధికము లిచ్చి ఆ పని ఒప్పగించిన, ఆ భవనముననే, ఆబోధనోపకరణములతోనే రాత్రి సమయమున వయోజన విద్యా ప్రచారము సాగించిన బాగుండునేమో. అవసరమగుచో వారి పగటి పని కొంచెము తగ్గించవచ్చును.

విద్యలేని వయోజనులందరు తప్పక హాజరగునట్లు చేయవలెను. వీరికి ముఖ్యముగా వ్రాయుట చదువుట గణితము నేర్పవలెను. విద్యాకాలము కూడ ఎక్కువకాకుండ ఒక సంవత్సరములో పూర్తియగుట మేలు. లోకజ్ఞానమునకు సంబంధించిన ఇతర విషయములన్నియు సంభాషణల ద్వారా, చలనచిత్రముల ద్వారా బోధింపబడవలెను. చలనచిత్రములందెక్కువగా డెన్మార్కు మొదలగు విదేశవ్యవసాయ పద్ధతుల చూపవలెను.

ఉపాధ్యాయుల నీదుకు ప్రత్యేకముగ తర్ఫీదు నిచ్చుట కొంచెము కష్టమట్లగపడును. అందుచే హాయ్యరుగ్రేడు, సెకండరీగ్రేడ్ ట్రయినింగు వారికే ఇది ఒక భాగముగ నియమించిన మేలు. తనిఖీప గటిబడుల తనిఖీతోబాటే జరిగించవచ్చును.

గ్రామీణ కళాశాలలచ్చటచ్చట కొలదిగా స్థాపించిన ప్రయోజన ముండదు. అట్టి లాభము ప్రతి గ్రామమున కందుబాటులో నుండునట్లుండవలెను. కాబట్టి ఒక ఉన్నతపాఠశాలకు, ఒక కళాశాలకు సమీపముననున్న కొన్ని గ్రామములకు అందలి ఉపాధ్యాయులలో ఉత్సాహ పరులైన వారిని దసరాసెలవులలోను, కోతలసెలవులలోను, వేసవిసెలవులలోను, సంఘసేవ, పౌరసత్వ ధర్మములు, గ్రామపునర్నిర్మాణము మొదలగు విషయములపై ఉపన్యాసము లిచ్చుటకు నియమించి అట్టివారికి ఉద్యోగములో పైస్థానమున కభివృద్ధి నిచ్చు సందర్భమున వారియొక్క ఇట్టి మంచి సేవను గణించవలెను. అట్టిచో ధనవ్యయముండదు. శక్తివంచన లేక హృదయపూర్వకమైన సేవచేయువారు లభింపగలరు. వీలునుబట్టి పెక్కిటి సమీపగ్రామముల రెంటిని మూటిని ఒక ఉపన్యాసకునికై ఒకచోట కేంద్రీకరించవచ్చును. అయినచో కాలము కలిసివచ్చును. స్థిమితముగా ఉపన్యాసముల నీయవచ్చును.

గ్రామీణకళాశాలకు ప్రవేశార్హత యున్న వ్యక్తి సాధారణ డిగ్రీయున్నగనేదోయందు సంపాదన కలవాడే అయివుండును. అందుచే రూపాయి జీతమీయగల్గియుండవచ్చు. ఇచ్చుటకు శక్తిలేనివాడైనను ప్రవేశమున కభ్యంతర ముండకుండిన మంచిది. అట్టి శిక్షణ పొందిన వారికి రాబోవు పంచాయితీ రాజ్యమున కొంత ప్రత్యేక హక్కుండిన ఆకర్షణీయముగ నుండును.

మధ్యమధ్య వచ్చి యిచ్చిన ఉపన్యాసములను (గ్రామపారిశుద్ధ్యము మొదలగునవి) వయోజన పాఠశాలోపాధ్యాయుల సహాయమున గ్రామస్థులచే నాచరింపజేయవలెను. వారమునకొక పర్యాయము గ్రామాధికార్ల సహాయమున ఉపాధ్యాయులు తిరిగి చెప్పిన ఉపన్యాసముల నాచరింపని వారిని దండనార్హులుగ చేయవలెను. లేనిచో ఉపన్యాసముల ఫలితము పురాణ వైరాగ్యము, ఆరంభశూరత్వమే అగును.

ఉన్నత విద్య

ఉన్నత విద్యా విధానమున సంస్కరణల ననుసరించి నూతన ప్రణాళికలు (Syllabuses), ఆ ప్రకారము తర్ఫీదుపొందిన ఉపాధ్యాయులు లేనిదే బోధన సక్రమముగా నుండదు. ఎవరి తాళం వారి దన్నట్లుండును. ఏదో పుస్తకం చూచి కొంత సమాచారము సేకరించి బాలురకందజేయుటయే అగును కాని తగిన ధైర్యముతో పాఠము చెప్ప వీలుండదు. మరొక యిబ్బంది కలదు. విద్యార్థికి చెప్పవలసినదానికంటె ఉపాధ్యాయున కెక్కువ తెలిసి ఉండవలెను. అది చక్కగా అనుమానరహితముగా ఉండవలెను. అట్లుకాక శిష్యులకు, ఉపాధ్యాయునకు పుస్తకాపేక్షయే అయిన, పాఠశాలలో ఉపాధ్యాయులు అక్కరలేకుండగనే కాలక్షేపము చేయవచ్చును. ఉపాధ్యాయునకు తెలిసిన దానిలో కొంతభాగము విద్యార్థి నేర్చి, నేర్చిన దానిలో కొంతభాగము గ్రహించి, గ్రహించినదానిలో కొంత ఆచరణయందుంచిన, శిష్యుడు తానాచరణయం దుంచినదానితో సుమారుగా జీవయాత్ర గడుపవలెనన్న ఉపాధ్యాయున కెంతవరకు తర్ఫీదవసరమో లెక్క వేయవలసియున్నది. అట్టి తర్ఫీదు లేని ఉపాధ్యాయులచే ఒక్కమాటుగా క్రొత్తమార్గము త్రొక్కించిన ప్రయోజన మెంత ఉండగలదో గ్రహించవలసి ఉన్నది.

ఒకటవఫారం థలబస్ క్రింది తరగతి సిలబస్ ననుసరించియుండును. అందుచే ప్రాథమిక విద్యా సంస్కరణలు జరుగువరకు వేచియుండవలెనా అను సందేహము కలుగుచున్నది

శ్రీ డి. వి. సుబ్బారావు.

* * *

సాముదాయిక భూముల స్థితి

ఇప్పుడు జమీన్ గ్రామాలలోని, గోభూములు, శ్మశానములు, పబ్లికువీథులు వగైరాలు ఏ స్థితిలో వున్నాయో ఎవరి అధీనంలో (కంట్రోలు) వున్నాయో తెలియక అయోమయంగా వున్నది. పూర్వం గ్రామాలలోవుండే సాముదాయిక భూములు అన్నీ రానురాను కొందరి ఒలీయులవల్లనూ కొంత, కొంత జమీన్‌దార్లు పట్టాలు యిస్తూండడంవల్ల పూర్తిగా వ్యక్తుల అధీనంలోనికి పోయి గ్రామ ప్రజలు ముఖ్యంగా బీదలు ఎంతనో కష్టపడవలసివస్తోంది. ప్రభుత్వం వెంటనే చర్య తీసుకుని ఆపవలసిన బాధ్యత వున్నది. అర్డినెన్సు వున్ననూ, చట్టములు వున్ననూ అమలు జరుగుటలో శ్రద్ధ చూపించవలెను. యిట్లా విశాలమైన సాముదాయిక భూములు అనేకపనులకు వుపయోగించేవి గ్రామాలలోవుండే ఒలీయులు ఆక్రమించుకొన్నందున శ్మశానములు లేక చేలగట్టునసే ఖననం చేస్తున్నారు. పశువులకు తిరిగే ప్రదేశం లేక చెరువుగట్లమీద, వీథులలోను త్రిప్పవలసివస్తోంది. పబ్లికు పాయిఖానాలు లేక స్త్రీలు, పెద్దవారు రాత్రులందు, పిల్లలు పగళ్ళు వీథులనే పాయిఖానాలుగా వుపయోగిస్తున్నారు యిక పుంతలు విశాలంగా వుండేవి యిరుప్రక్కల రైతులు దొలచి ఆక్రమణ చేసుకొనడంవల్ల దూడలను వీథులలోను, దొడ్లలోను పాకలు, చూర్లు దింపి కట్టుచున్నారు గడ్డిమేట్లు గ్రామాలలో వేస్తున్నారు. యిట్టి గ్రామాలలో ఆరోగ్య విధులు, సూత్రాలు పాటింపచేయాలంటే విధానం ఏమిటి? బలిసినవారు అరుగులక్రింద అరుగు, చూరుక్రింద చూరు వేసి వీథులను కాజేస్తున్నారు. ఏ గ్రామం పోయినా గ్రామంలో సభ్యతగలవారి యిండ్లు, విద్యాహీనుల యిండ్లు తెలుస్తూనే వుంటాయి. పూర్వపువాళ్లు కుల, మతభేదములతో పిలుస్తోంటారు. "మాలపల్లి" "మాదిగపల్లి" "యాడిగగూడెం" యిట్లా. అసలు సంగతి ఆర్థికదుస్థితి, విద్యాహీనతవల్ల వారివారి గుడిసెలలోనే 2, 3 కుటుంబాలు, పశువులతో నివసిస్తూవుంటారు. గ్రామాలలోవుండే ఒలీయులు ఎక్కడైనా ఖాళీప్రదేశం గుడిసె వేసుకో నివ్వరు, సొమ్ము వెచ్చించి కొనలేరు. అందువల్ల వ్యవసాయకూలీలు నివసించే ప్రదేశాలు దుర్భర పరిస్థితులలో వుంటాయి. పై విషయాలు అన్నీ చూడాలంటే డెల్టా ప్రాంతపు జమీందారీ గ్రామాలు చూడండి, యీగలు, దోమలు బాధలు ఎక్కువై గ్రామాలు ఎలా వాసయోగ్యం కాకుండా పోతున్నాయో తెలుస్తుంది. గ్రామాలలో నివసించేవారికి ఎంతమందికి "బోద" "బృహతు" పెద్దజబ్బులు వస్తున్నాయో హెల్తు డిపార్టుమెంటువారు పట్టణాలకు, పల్లెలకు లెక్కలు తీయమనండి. యీ పరిస్థితులు అన్నీ బాగుపడాలనంటే ప్రభుత్వమే చేయాలి. ప్రజలు అట్లాగనే వుండాలని కాదు. యీ బాధ్యత ముఖ్యంగా ప్రభుత్వం తీసుకొనవలెను. గ్రామాలలో నోరులేనివారుగాని, మన కెందుకనే వారుగాని ఎక్కువగా వుంటారు. ఆక్రమణలు చేసుకొనే బలీయులపై అర్జీలు, పిటిషన్లు యిచ్చేందుకు సహకరించరు. ఎవ్వరైనా బయట పడితే వాడి మచ్చ మాపుతారు. అందువల్ల అసలు లెక్కలప్రకారం పన్ను వసూలు చేస్తున్నట్లు సాముదాయక భూములు కూడా వాటివాటి హద్దులలో వాటి పనులకు వుపయోగ పడుతున్నాయని రివిన్యూఅధికార్లు ఆ గ్రామాలు పోయినప్పుడు తరచు పరిశీలించే ఏర్పాటు చేస్తూ వుండాలి. ప్రజలు మంచినీటిచెరువుగట్లను, వీథులను పరిశుభ్రపరుస్తూ యే యింటివారు ఆ వీథులను తగు శుభ్రతలో వుండేటట్లు గ్రామపంచాయితీలు చూచుచుండవలెను. మురుగునీరును వీథులలో కుండపెట్టి వదలకుండాను, వీథులవైపు గోడలను పిడకలు వగైరాలతో నింపకుండాను గ్రామస్థులు శ్రద్ధ తీసుకొనవలెను. యిక వ్యవసాయకూలీల యిండ్ల ప్లానుప్రకారం ముందు వేసుకొనేవి వేయించవలెను. స్థలం చాలనిచో గ్రామపంచాయితీబోర్డులు సాముదాయక భూములను కొంతవరకు గ్రామంకు కలుపుటకు వుత్తర్వులిస్తూండవలెను. రాష్ట్ర, కేంద్రప్రభుత్వ సహాయము కుల, మతములకు మాత్రమే వర్తించే లాగున వుండకుండా, ఒక వర్గమునకు వర్తించే లాగున చేయకలిగిననాడే వాట్ల విశిష్టత కనపరచుకొన్నది అవుతుంది.

తంగిరాల కృష్ణానందతిలక్.

* * * *

జనుముల కంట్రోలు

ఆర్యా,

జనుములు రైతులవద్ద నున్నకాలములో జనుములకంట్రోలు పెట్టి వ్యవసాయడిపార్టుమెంటు ద్వారా పట్టాలు, గుంటకపలుగులు, నాగటికర్రలు, బండియిరుసులు యిప్పించెదమని రైతులకు లేనిపోని ఆడియాసలు కల్పించి, పదిమంది నోరులేని రైతులవద్ద ప్రొక్యూరుమెంటు చేసి నిరంతరము బస్తీలవెంట తిరిగి హైరిపేటుచేయురే నోరుగల రైతులలో యిచ్చినట్లుగా వ్రాసి, వారికిగూడా యినుము సప్లయిచేయక యిప్పుడు జనుములకు కంట్రోలు తీసివేసినామని ప్రకటించిరి. అదివరకు నోరులేని రైతులవద్ద కంట్రోలు రేటుకు కొని నిల్వయుంచిన షాహుకార్లు కంట్రోలు పోవుటతోడనే బస్తా రు. 70 లు మొదలు 80 ల వరకు పెంచినారు. యిప్పుడు ప్రభుత్వమువారు ప్రొక్యూరు చేసి నిల్వయుంచినన్ని జనుములు చాటుగా వర్తకులు కొనుక్కొని దాచిపెట్టుకున్నట్లు తెలియుచున్నది. యిక ప్రభుత్వమువారు ప్రొక్యూరుచేసిన జనుములు మాగాని రైతులకు పంచబోవు నప్పటికి ఉద్యోగస్థుల పరిస్థితి లెట్లుండి రైతులకు యెంతవరకు లాభదాయకముగా నుండునో చూడవలసియున్నది. గనుక యిటు జనుములు పండించు మెట్టరయితులకు లాభము లేక అటు ఉపయోగించు మాగానిరైతులకు ఉపయోగము లేక నడుమ యే కష్టమెరుగని లంచగొండి ఉద్యోగస్థులకు బ్లాక్‌మార్కెట్టర్లకు లాభదాయకముగా నుండు జనుములకంట్రోలు ప్రభుత్వము యెందుకు పెట్టినదో తెలియకున్నది.

గడిపూడినరసయ్య,
తాలూకాకాంగ్రెసు,
వినుకొండ,

* * *

నైజాంకాందిశీకుల కడగండ్లు

ఆర్యా,

నిజాంగూండాల దౌర్జన్యాలు ఆఘాయిత్యాలవల్ల అనేకకుటుంబాలు యిండియన్ యూనియన్ సరిహద్దులలో తలదాచుకొను సంగతి అందరికి విదితమే. వీరు ఇళ్లువాళ్లు వదలి పరదేశములపాలై పరపంచలలో పడరానిపాట్లు పడుచున్నారు. తోటి ఆంధ్రసోదరు లున్నారని ధైర్యమున ఆంధ్రదేశమునకు అనేకవేల కాందిశీకులువచ్చినమాట యదార్థము. వచ్చినవారందరు ధనికులు అని ప్రియపడటం ఎంతయో విచారకరం. ధనికులు లేరనుటకాదు. ఎక్కువమంది బీదప్రజలనియు గాక కొందరు దేశభక్తులుకూడ లేకపోలేదు. అట్టివారిని స్వార్థపరులు దూరము చేయుటమూలముననువారు అచటయుండుటకు అనేక కారణాలవల్ల ఇచ్చట చేరకతప్పినదికాదు మరియు బీదప్రజలు కొందరు రాజకీయకారణములవల్ల కాందిశీకులై వచ్చిరి. అట్టి దేశభక్తులన మాత్రుసంస్థలతోపాటు మీరు కాందిశీకులన నిర్దయగా చూచటము విచారకరము. ఇళ్ల అద్దెలు తినుపదార్థములు చివరకు గర్భిణీస్త్రీలను కొన్ని గవర్నమెంటు హాస్పిటల్ డాక్టర్లు నిరాధారము చూపుటయు ఎంతయో విచారకరము. దిక్కులేని కాందిశీకులపై పుత్రవాత్సల్యముంచి పై తెలిపినట్టు అనాధారము జూపక, నీడతోడు వైద్యసదుపాయములు కలిగించగలందులకు ఆంధ్రసోదరులను మరిమరి ప్రార్థించుచున్నాను.

యం. పండరినాథు.

* * *

ఆమదాలవలస పంచాయతిబోర్డు

ఆర్యా,

ఈ పంచాయతిబోర్డుకు రాబడి దినదినము హెచ్చుగుచున్నది. ప్రజల కష్టసుఖములను బాగా తెలుసుకొని సహాయము చేయుటకే మెంబర్లను నియమించుటగాని, వేరుకాదు. ఈ బోర్డును వార్డులుగా మార్చి మెంబర్లను ఏర్పరచినట్లయిన ప్రజలకు కావలసిన సౌకర్యములను మెంబర్లు తెలుసుకొని సమావేశములలో తెలుపుకొనుట కవకాశము కలుగవచ్చును. ఈబోర్డుకు ముఖ్యంగా పట్టణ నిర్మాణ ప్రణాళిక అవుసరము. ఇందుకు ప్రభుత్వము బాగా శ్రద్ధ వహించి పరిపాలనా విధానములను సక్రమంగా నడపించుటకు వార్డు సిస్టమున్నూ, ప్రభుత్వమువలన వేతనము నియమింపబడిన ఒక అధికారినిన్నీ నియమించినచో రాబడికూడ యింక అధికమగుటకు అవకాశము కలుగగలదు.

ఉర్లాం నరసింహం పట్నాయక్,
ఆమదాల వలస.

వైదికము : కవిత్వము

శ్రీ కొమాండూరు కృష్ణమాచార్యులు

వైదిక కవిత్వములు పరస్పరము విరుద్ధధర్మములనియును వీనికి తేజస్తిమిరన్యాయము వర్తించుననియు భావించుట కేవలము అపోహ. ప్రాచీనకాలమునుండియును సంస్కృతాంధ్ర కవులయం దీ రెండు విజ్ఞానములును సామానాధికరణ్యము నొందియున్నవి. ఆంధ్రమున నన్నయ భట్టారకుడు అవిరళజపహోమతత్పరుడు, సంహితాభ్యాసి. ఈయన యాదికవి యగుటవలన వాల్మీకితో బోల్పదగినవాడు. ద్వితీయకవి తిక్కయజ్వ. ఈయన సోమపీథి. మహాభారత దీక్షా ధురంధరుడై కవితాసత్రమున నవభృథస్నాన మొనరించుటచే బంక్తిపావనుడు. ప్రబంధ పరమేశ్వరుడు పౌరాణికుడు శ్రీనాథాదులు శైవాగమనిష్ఠులు. ఇటే విచారించిన ప్రాచీనాంధ్ర కవులలో వేదబాహ్యు లెవ్వరును లేరనియే చెప్పవచ్చును.

ఇక గీర్వాణ కవులందరును వైదికులే. వారిలో వ్యాసవాల్మీకులు మహర్షులే గదా. కాళిదాసు కవిత్వమున తలస్పృశుగు వేద విజ్ఞానము స్మృత్యాచార పరిజ్ఞానమును స్ఫుటముగా గోచరించుచునే యున్నవి. ఈయన గ్రహించిన యుపమ లనేకములు వైదికములే;- కొన్నింటి నుదాహరింతును: (1) ప్రణవశ్ఛన్దసామివ; (2) అగ్నిగర్భాం శమీమివ; (3) అధ్వరస్యేవదక్షిణా; (4) శ్రుతేరివార్థం స్మృతిరన్వగచ్ఛత్; (5) శ్రద్ధేవ సాక్షా ద్విధినోపపన్నా; (6) హవిషేవ హవిర్భుజామ్. ఇట్టి కావ్యములయందటను శతాధికోదాహరణములు గలవు. రఘువంశ కుమారసంభవ శాకుంతలములయం దంతటను మానవ ధర్మ శాస్త్రానుసరణము ఆశ్రమవర్ణనము, గాంధర్వవివాహ దూషణము మున్నగు వైదికాచార వర్ణనము లసంఖ్యాకములున్నవి. "మైథున్యం కామసంభవ"మ్మని మనువు దూషించిన గాన్ధర్వవివాహము క్షత్రియులకు ధర్మమే యైనను శార్ఙ్గరవ ముఖమున దాననిని నిందించెను. "ప్రత్యర్పితో న్యస్తఇవాన్తరాత్మా," "నైరిభవతిసౌహృదం" "మూర్ఛన్త్యమీ వికారాః"ఇత్యాదులందు వాచ్యవ్యంగ్య పద్ధతుల ననుసరించి నిజభావమును కవి వెలిబుచ్చెను. అతిస్వల్పములగు వైదికాచార వర్ణనములందు నీ కవికి గల యాదరము గమనింపదగినది.

"విలోచనం దక్షిణమంజనేన సంభావ్యతద్వంచితవామనేత్రా" (ర. 7 స.—8 శ్లో.) ఇచట సంభ్రమ వశమున కుడికంటి కంజనము వేసికొని సరి గానియది వైదికాచారము గాదు. "సవ్యగ్ం హ్యపూర్వం మనుష్యా అంజతే" యని సంహితా పాఠము.

గాంధర్వ వివాహమును శాకుంతలమున దూషించిన యీ కవి బ్రాహ్మవివాహమును రఘువంశమున వేనోళ్ళ బ్రశంసించెను. ఇందు లాజహోమము, తలంబ్రాలు, పాణిగ్రహణము, అగ్నిప్రదక్షిణము నను వైవాహికాచారములు వర్ణింపబడినవి (ర. స. 7) కాళిదాసకావ్యములు సుప్రసిద్ధములగుటవలనను నవి పారప్రవచనములం దుండుటవలనను జిజ్ఞాసువు లూహించుకొందురు గాకయని దిఙ్మాత్రముగా వివరించితిని

భవభూతి

ఈయన భట్టకుమారిలుని శిష్యుడనియు మీమాంసకుడనియు తృతీయషష్ఠాంక మాలతీమాధవ గద్యములనుండి తెలియుచున్నది.

"ఇతి శ్రీ భట్టకుమారిలశిష్యకృతే మాలతీమాధవే తృతీయోఽఙ్కః"

"ఇతి శ్రీ కుమారిలస్వామి ప్రసాదప్రాప్తవైభవ శ్రీమదుంబేకాచార్య విరచితే మాలతీమాధవే షష్ఠోఽఙ్కః"

ఈ గద్యములవలన భవభూతికి ఉంబేకుడను నామాంతరము గలిగినట్లు దెలియుచున్నది.

"యే నామ కేచి దిహ నః ప్రథయన్త్యవజ్ఞాం
జానన్తి తే కిమపి తాన్ ప్రతి నైష యత్నః
ఉత్పత్స్యతే మమతు కోఽపి సమానధర్మా
కాలో హ్యయం నిరవధి ర్విపులా చ పృథ్వీ".

ఈ శ్లోకము మాలతీమాధవ పీఠిక యందును శ్రీ భట్ట ఉంబేక విరచిత శ్లోకతాత్పర్య టీక యందును గలదు.

శ్రీ చిత్సుఖాచార్యులవారి తత్త్వ ప్రదీపిక యందు—

"ఉమ్బేకోదీరితవాక్యేషు
మాలతీమాధవాదిషు వ్యభి
చారాన్నత ద్యుక్త
మాప్తత్వస్యాతిరుక్తితః.

"స్వకపోలకల్పిత మాలతీ మాధవాదికావ్యేషు ప్రామాణ్యాభావా దతివ్యాప్తిః; నహి పురా ఆప్త ఏవ స న్నాటకనాటికాదిప్రబంధవిరచన మాత్రేణ అనాప్తో భవభూతిః. ఉక్తం చైత దుంబేకేన "య దాప్తోఽపి కస్మైచి దుపదిశతి న త్వయా అననుభూతార్థవిషయం వాక్యం ప్రయోక్తవ్యం; యథాః 'అంగుల్యగ్రే హస్తియూథశత మాస్తే' ఇతి—తత్రార్థవ్యభిచారః స్ఫుటః" ఇతి ॥

అని యుదాహరించిరి. చిత్సుఖీవ్యాఖ్యాత భవభూతియే ఉంబేకుడని యూహించినట్లు విదితము. భవభూతి యాప్తు డనుటవలన శాస్త్ర గ్రంథ రచయిత యని యూహింపదగును.

మాలతీ మాధవపీఠికను బరిశీలించినచో భవభూతికి గల ఛాందసత్వము స్పష్టము గాగలదు.

"య ద్వేదాధ్య యనం తథోపనిషదాం
సాంఖ్యస్య యోగస్య చ
జ్ఞానం తత్కథనేన కిం నహి తతః
కశ్చిద్గుణో నాటకే,
యత్ ప్రౌఢిత్వ ముదారతా చ వచసాం
య చ్చార్థతో గౌరవం
తచ్చే దస్తి తత స్తదేవ గమకం
పాండిత్యవైదగ్ధ్యయోః"

వేదాధ్యయ మనగా పూర్వ మీమాంసాపరిజ్ఞానము. ఉపనిషత్తు లుత్తర మీమాంసా విషయ వాక్యములు. సాంఖ్యయోగములు దర్శనములు. వీని జ్ఞానమును గురించి నాటక పీఠికయం దుపన్యసించుట సందర్భోచితము గాదని కవిమతము. కావుననే సంగ్రహముగా వచించినాడు. ఈయన పూర్వపురుషులు—

"తే శ్రోత్రియా స్తత్త్వవినిశ్చయాయ
భూరి శ్రుతం శాశ్వత మాద్రియన్తే;
ఇష్టాయ పూర్తాయ చ కర్మణేర్థాన్
దారా నపత్యాయ తపోఽర్థ మాయుః"

"ఏకో రసః కరుణ ఏవ
నిమిత్తభేదాద్
భిన్నః పృథక్ పృథగివా
శ్రయతే వివర్తాన్ (3-47)

విద్యాకల్పేన మరుతా
మేఘానాం భూయసామపి
బ్రహ్మణీవ వివర్తానాం
క్వాపి ప్రవిలయః కృతః". (6-6)

ఈ శ్లోకములం దద్వైత వేదాంత పక్షపాతము వివర్తవాదాభిమానమువలన నూహింపనగును. బిల్హణీయమునను, సుభాషిత రత్నభాండాగారమునను (చాటుపుగా=ను క్తకము) వచింపబడిన-

శ్లో॥ "నైవ వ్యాకరణజ్ఞ మేతి పితరం
న భ్రాతరం తార్కికం
దూరా త్సంకుచితైవ గచ్ఛతి పున
శ్చండాలవ చ్ఛాందసాత్
మీమాంసానిపుణం నపుంసక మితి
జ్ఞాత్వా నిరస్తాదరా
కావ్యాలంకరణజ్ఞ మేవ కవితా
కన్యా వృణీతే స్వయమ్."

'నహినిందాన్యాయము' నెరుంగనివారు దీనిని మీమాంసకనిందాపరముగా నన్వయించుకొందురేమో ! కాని కావ్యాలంకారజ్ఞానము కవిత్వమున కవశ్య పూర్వ భావి యనియే దీని తాత్పర్యము. ఇతర శాస్త్రముల నిందించుట గాదు. ఇక భట్టబాణుడు హర్షుడు మున్నగు వారందరును శ్రోత్రియకులోద్భవులును కవితాకట్టభద్రులు నగుట ప్రసిద్ధము. కావున కవిత్వమున కితర శాస్త్రాభ్యాసముగాని వైదికత్వముగాని ప్రతిబంధకములుగావు. పైపెచ్చు సహకారు లనిగూడ మమ్మటాద్యాలంకారికులు వచించియున్నారు. కావున 'సంహితాభ్యాసివనం (అనగా) వచనం చప్పచప్పగా ఉంటుందేమో' అని ఆధునికులు శంకింపరాదు.

యుగసంధి

(6-వ పేజీ తరువాయి)

కున్నాడు. బండి తోలేవాడుకూడా మంచి ఉత్సాహవంతుడు. ప్రతి అంగడిదగ్గరా ఆపి, "దాహం తీర్చుకోనా? వద్దా?", అనేవాడు. కాని తాగిన ఆలస్యాన్ని కూడదియ్యడానికి గుర్రాలను చావమోదేవాడు. చివరికి పరిచితమయిన ఆ పాత ఇల్లు కనబడింది ....

"ఇప్పుడు నేను ఏం చెయ్యాలి?" ఆర్కాడీ మనస్సులో ఆ ప్రశ్న మెరుపులా మెరిసింది "సరే, ఇంక వెనక్కి తిరిగి పోవడంలేదు," అనుకున్నాడు. మూడు గుర్రాలూ సమంగా అడుగులు వేస్తూ పరుగెత్తాయి. బండివాలు వాటిని ఉద్దేశించి ఈలవేస్తూ హెచ్చరిస్తున్నాడు. బండి చక్రాల కింద, గుర్రపు డెక్కలకింద వంతెన పెద్దగా మోగింది. తరవాత కొట్టినపైన చెట్లతోపు ఆహ్వానిస్తున్నట్టు ఎదురువచ్చింది... ఎవరో స్త్రీయొక్క గులాబీరంగు వలువ మూరాన్ని కనబడింది, పల్చని ఆచ్ఛాదన క్రిందనించి ఒక లేత యువతీముఖం తొంగిచూసింది... కాట్యాని అతను గుర్తుపట్టాడు. ఆమె అతన్ని గుర్తుపట్టింది. పరుగెత్తుతున్న గుర్రాలను ఆపమని ఆర్కాడీ బండివాడిని ఆజ్ఞాపించాడు. బండిలోనించి క్రిందకు దుమికాడు, ఆమెదగ్గరకు వెళ్ళాడు. "మీరేనా?" అంది ఆమె. క్రమంగా ఆమెముఖం అంతా ఎర్రబడింది. "రండి, అక్కయ్యని చూద్దాం, తోటలో ఉంది. మిమ్మల్ని చూస్తే చాలా సంతోషిస్తుంది."

కాట్యా ఆర్కాడీని తోటలోకి తీసుకు వెళ్ళింది. ముందు ఆమెను కలుసుకోడం శుభసూచకమని ఆర్కాడీ అనుకున్నాడు. ఆమెను చూసినప్పుడు అతని హృదయం నిండింది. అంతా చాలా అద్భుతంగా జరిగిపోయింది. సేవకులూ, గుమాస్తాలూ లేరు. కబురు పంపడంలేదు. దారి మలుపు తిరగగానే అనాసర్గీవ్నా కనబడింది. వెనక్కి తిరిగి నిలబడి ఉంది. అడుగుల చప్పుడు విని ఆమె వెనక్కి తిరిగింది మెల్లగా.

ఆర్కాడీ మళ్ళీ కొంచెం కంగారుపడ్డాడు. కాని ఆమె మొట్టమొదటి సంభావనే అతని ఆందోళనను శాంతపరచింది. "పారిపోయిన పెద్దమనుష్యులు, రండి," అంది, నెమ్మదిగా, బుజ్జగించే గొంతుకలో. అతనికి ఎదురువచ్చింది చిరునవ్వుతూ, ఎండవల్ల కనుబొమలు కొద్దిగా ముడుచుకుంటూ. "కాట్యా, ఈయన్ని ఎక్కడ పట్టుకున్నావు?"

"తనా సర్గీవ్నా, మీ కోసం నే నొకటి తెచ్చాను," అతను అన్నాడు, "మీరు ఎప్పుడూ అనుకోనిది".

"మిమ్మల్ని మీరు తీసుకు వచ్చారుగా; అంతకంటె మంచిది ఇం కేముంటుంది?"

23

అతను ఎందుకు ప్రయాణ మవుతున్నాడో అసలు కారణం విషయమయి తనకు తెలియక పోలేదని, ఆర్కాడీతో అని, అతన్ని బండి ఎక్కించిన తరవాత, బజరోవ్ పూర్తిగా తన గదిలోనే తలుపులు మూసుకుని కూర్చోడం ప్రారంభించాడు. పని యెడల తీవ్రమయిన ఆవేశం అతన్ని పట్టుకుంది. ఇప్పుడు పావెల్ పెట్రోవిచ్‌తో కూడ అట్టే వివాదాలు అతను పెట్టుకోడం లేదు. ఒక్కసారి మాత్రం ఆ 'శూన్యవాది'తో పావెల్ పెట్రోవిచ్ వాదంలోకి దిగాడు. సంభాషణలో ఆ రోజుల్లో నలుగురూ తర్కించుకుంటున్న బాల్టిక్ జమీందారుల హక్కుల విషయం వచ్చింది. వాదం సగంలో తనంతట తనే ఆపి, మంచు లాంటి మర్యాద నటిస్తూ అతను అన్నాడు. "అయినా మనం ఒకరి నొకరం అర్థంచేసుకోలేం. అధమం, నాకు మాత్రం తమని అర్థం చేసుకో గల తాహతు లేదు."

"ఉంటుం దని నే ననుకోను," అన్నాడు బజరోవ్. "మనిషికి అన్నీ అర్థమవుతాయి— ఆకాశం ఎల్లా స్పందిస్తుందో సూర్యుడిలో ఏ ఏ మార్పులు జరుగుతున్నాయో వగైరా. కాని తన కంటే భిన్నంగా ఇంకో మనిషి ముక్కు ఎల్లా చీదుకోగలడో, అదిమాత్రం అర్థంకాదు."

"అదేమిటది? చమత్కారమా?" వాకబుగా అడగినట్టు అడుగుతూ పావెల్ పెట్రోవిచ్ లేచి వెళ్ళిపోయాడు.

అయినా, అప్పుడప్పుడు, బజరోవ్ ప్రయోగాలను చూడ్డానికి అతని అనుజ్ఞ తీసుకుని దగ్గర కూర్చునేవాడు. ఒకసారి సువాసన వేస్తున్న తన ముఖాన్ని సూక్ష్మదర్శినీ యంత్రం దగ్గర పెట్టి, ఒక గాజువంటి కీటకం ఆకుపచ్చ ముక్కనొక దాన్ని తన దవడలలోకి లాక్కుని నములడం చూశాడు. నికోలై పెట్రోవిచ్ తన అన్నగారి కంటే ఎక్కువ తరచుగా అక్కడికి వచ్చి కూర్చునేవాడు. తనకి ఈ కమతం విషయమయిన బాధలు అటు లాక్కుపోకపోతే రోజూవచ్చి అక్కడే కూర్చుని కొంత నేర్చుకుందునని అనే వాడు ఆ యువకుని శాస్త్రపరిశోధనలకు అతను ఏమీ అడ్డం వచ్చేవాడు కాదు. ఏదో ఒక మూలలో కూర్చుని శ్రద్ధగా చూసేవాడు. అప్పుడప్పుడు జాగ్రత్తగా ఒక ప్రశ్న అడుగుతుండేవాడు. భోజనాలు చేస్తూన్నప్పుడు సంభాషణ, భౌతిక, రసాయన, భూగర్భ శాస్త్రాలలోకి దింపడానికి ప్రయత్నించేవాడు. రాజకీయాల సంగతి అల్లా వుంచి, చివరికి వ్యవసాయ విషయం వచ్చినా ఏదో అనవసరమయిన సంఘర్షణలోకి, అధమం పరస్పర స్పర్థలోకి దిగుతుందని అతనికి తెలిసి వచ్చింది. బజరోవ్‌ని చూస్తే తన అన్నగారికి ఉన్న అసహ్యంకూడా ఎక్కువగానే ఉందని నికోలై పెట్రోవిచ్ గ్రహించాడు. ఈ అనుమానం ఒక చిన్న సంఘటనవల్ల మరింత దృఢపడింది. పరిసరాల్లో కొన్నిచోట్ల కలరా ప్రవేశించింది. మేరీనోలోకూడా ఇద్దరిని 'ఎత్తుకు'పోయింది. ఒకరాత్రి పావెల్ పెట్రోవిచ్‌కి ఆ లక్షణాలు బలంగా కనిపించాయి రాత్రి తెల్లవార్లు అతను

(22 వ పేజీ చూడుడు)

తాటిబెల్లపు పారిశ్రామిక సహకార సంఘం

(పెరవలి)

శ్రీ తంగిరాల కృష్ణానందతిలక్

ఇప్పటికి యీ పత్రికా పాఠకులకు గొల్లవాని తిప్పపాలెము పనివారల సహకార సంఘం, అజ్జరం యిత్తడిపాత్రల పనివారల సహకార సంఘము, యినుపరేకు పనివారల సహకార సంఘం, పెనుగొండ వాట్లగురించి తెలుపుకొన్నాను. యీ సంఘము లన్నియు ఒక్కొక్క పరిశ్రమకు సంబంధించినవై యున్నవి. యిట్టి సంఘము ఒక్కొక్కచోట పెద్దపెద్ద మిల్లులుకూడా నడుపుచున్నవి గలవు. సహకార పరపతి సంఘములు, సహకార స్టోర్సులు ఒకటేమిటి అన్నిరకములయిన సంస్థలు గలవు గాని వీటన్నిటికి అధికారదక్షత లేక చాలమట్టుకు మఖలో పుట్టి పుబ్బలో మాడిపోవుచున్నవి. అందువల్ల 1 లక్షరూపాయిల వ్యవహారం జరిగే వాటన్నిటిపైనగాని అంత మొత్తం వ్యవహారంగల కొన్ని సంఘములపైని గాని ఒక డిపార్టుమెంటువారి వుద్యోగి ఆఫీసు వ్యవహారములు, సంఘపనులు నెరవేర్చుటకు నియమించి, అతని జీతం యీ సొసైటీలనుండి కాబట్టినగాని సహకారసంఘములు వర్ధిల్లవు. అనధికార్లు వారి విధులను పూర్తిగా నెరవేర్చ లేకపోవుటలో అనేక కారణము లుండవచ్చును.

మనరాష్ట్రంలో ఏ రాజకీయ పరిస్థితులు చూచుకొన్ననూ యిట్టి సహకారసంఘములకు ప్రత్యేకసిబ్బంది నిచ్చి వ్యవహారము నడుపుచుండవలెను. యిట్టి దక్షత లేనినాడు ఎప్పటికయినా సంఘములు వృక్షమం క్షీణదశకు రావచ్చును.

పశ్చిమ గోదావరిజిల్లాలో తాటిబెల్లం వుత్పత్తి అధికంగా వుండును. యీ పారిశ్రామికులు ముఖ్యంగా శెట్టిబలిజీలు, కలాలీలు, అక్కడక్కడ హరిజనులలో వున్నారు. వీరంతా ముఖ్యంగా 5 మాసములు యీ పరిశ్రమపై ఆధారపడి కృషి చేసెదరు.

యీ జిల్లాలో తాళ్లు డల్టా ప్రాంతంలో చాలినంత లేనందువల్ల మెట్టప్రాంతాలకు ఆయా అదును కాలములో కుటుంబములతో వెళ్లి యీ పరిశ్రమ సాగింతురు. యీ పరిశ్రమకు సాధారణంగా సంకరాత్రి వెళ్ళగానే వెళ్లెదరు. యీ పని చాలా కష్టమైనది. అన్ని పనులు వలె గ్రామంలో వుండి యీ పరిశ్రమ సాగించుట పడదు. అందువల్ల కుటుంబములతో తాళ్లువున్న ప్రాంతమునకు వెళ్లి పొలములో మకాము పెట్టెదరు. ఒక్కొక బల్లకు, అంటే ఒక్కొక్క పారిశ్రామికదారు 40 నుండి 60 త్రాళ్లవరకు గీత గీయగలడు. బెల్లం 5 పుట్లవరకు అదును అఖరుకు వండగలిగివుంటాడు. యీ పారిశ్రామికులకు కుండలు, జల్ల, (తాళ్లు ఎక్కే పరికరములు) తునగాలు, (కత్తినూరుకొనేది) వేతకత్తి, మారుకత్తి, ముగ్గు, సున్నం, పెనం, వగైరాలు, 2 మాసములకు సరిపడు గ్రాసమున్నూ, బెల్లం వండేందుకు వంట చెరకుతో సహా సుమారు 50 మొదలు 100 లు వరకు పెట్టుబడి పెట్టి తాళ్లకీత ఆరంభించెదరు. యీ తాళ్లు గీయువప్పుడు ఒక్కొక్క గీతగాడు తెల్లకల్లు గీసుకొనుటకు కూడా సాల్టు డిపార్టుమెంటునుండి లైసెన్సు తీసుకొనుచుండును. యీ తాడివల్ల వచ్చే కల్లు వతనుగా నిత్యం త్రాగేవారికి అమ్ముచుండును. యిందువల్ల దినమునకు 1 లేక 2 రూపాయిలు వరకు సంపాదించేవారు గలరు.

యీ తాళ్లు గీతగీసే ఆసామి తాడి 1-కి రు. 1-/ యిచ్చి గుత్తకు తీసుకుని పైని చెప్పిన పెట్టుబడికి బెల్లంకట్టే పద్ధతిని షావుకారువద్ద అప్పు తీసకుని వచ్చును. యీ షావుకారు ఫ్యాక్టరీ కంపెనీ ఏజంటయి వుంటాడు సాధారణంగా. గీతగీయడం ప్రతిరోజూ తాటికి రెండుసార్లు ఎక్కవలెను. తెల్లవారజామున కల్లుదించును. యీ కల్లు కుటుంబంలో భార్యో తల్లో బిడ్డో మకాముదగ్గరకు చేర్చి కల్లు బెల్లంగా వండెదరు. పూర్వం ఫ్యాక్టరీకంపెనీవారు రేట్లు నిర్ణయంగా లేకపోవుటవల్ల బెల్లం వండి ఎంతో నష్టపోతూ వుండేవారు.

యీ ఫ్యాక్టరీకంపెనీ ఏజంట్లు కంపెనీ ధరకన్నా తక్కువకు కొని పుట్టి 1 కి 2, 3 మట్లు ఎక్కువ తూచుకొని గీతవానికి సరుకులక్రింద, కుటుంబఖర్చులు యిచ్చి సొమ్ములు మట్టచెప్తూ బాకీలు తేలుస్తూవుంటారు. యీ గీతవాళ్ళుకూడా షావుకార్లవద్ద బాకీలు ఎక్కువయిపోయి బెల్లం చాటుగా అమ్ముకుంటూ వుంటారు. పల్లెగ్రామాదులలో కల్లువల్ల సారాయి వండే విధానం అందరికీ ఆ పారిశ్రామికులకు తెలిసివుంటుంది. యీ కల్లులేని రోజులలో బెల్లంవల్లనే సారాయి తయారుచేస్తారు. యిట్టి కేసులు అనేకం సాల్టుడిపార్టుమెంటు పెట్టిన వాటిబట్టి రుజువగుచున్నది.

యిన్ని యిబ్బందులతో యీ పరిశ్రమ సాగించుటవల్ల వుత్పత్తివారు అనేకనీచమైన పనులకు ఒడంబడి తాను శిక్షపడుతూ షావుకార్లను బాగుచేస్తూవుండగా పెరవలిప్రాంతంలో 40 గ్రామాలలోని పారిశ్రామికులు చేరి ఒక సహకార సంఘంగా ఏర్పడిరి.

యీ సంఘంలో ప్రతీ శేపరు మెంబరుగా చేరవచ్చును. అట్లా చేరినవారు 1,000 మంది మెంబర్లు గలరు. వీరంతా కాయకాలకు వెళ్లనప్పుడు పెట్టుబడులు యిచ్చి మెంబర్లు తెచ్చుకొనే బెల్లం ఫ్యాక్టరీకంపెనీకి యీ సంఘం ద్వారా పంపుకుంటూరు. బెల్లం మంచి, చెడ్డలను నిర్ణయించి ధరలు నిర్ణయించేందుకుగాను కంపెనీ తరపున ఒక వుద్యోగిన్నీ, సొసైటీతరపు ఒక వుద్యోగిన్నీ వుండి మెంబర్ల బెల్లంకు న్యాయంగా ధర వేసెదరు. యీ సొసైటీ లేకపూర్వం ఏజంట్లు వాళ్ల యిష్టమువచ్చిన ప్రకారం రేట్లువేసి మెంబర్లకు నష్టం కల్గిస్తూవుండేవారు. యీ సొసైటీ మెంబర్లందరకు ప్యాసుబుక్కులు యివ్వబడి వాళ్లు తెచ్చేబెల్లం జమాఖర్చులు వ్రాస్తూ వుంటారు శేరుధనం రు 1000 లు గలదు. ఫ్యాక్టరీకంపెనీవారు ఏజంట్లయందు ఎక్కువ శ్రద్ధ చూపుచుండుటచే సొసైటీకి పెట్టుబడి తక్కువ యిచ్చి వారి పరిశీలకునికి కఠినంగా బెల్లం పరీక్ష చేయించుచుండుటచే మెంబర్లు చాలా యిబ్బంది పడుచున్నారు.

యీ సొసైటీకి డిపార్టుమెంటువారి వుద్యోగి వుండి వ్యవహారం ప్రోత్సహించి చేయించుచో ముందుముందు విరివిగా వ్యాపారం జరుగుటకు అవకాశం గలదు. యీ సొసైటీకి సేల్సుటాక్సు వుండుటచే ఎంత లాభం వచ్చిననూ కనుపించుట లేదు. ప్రజాసంస్థలలో అనధికార్లు నడుపుచుండుటవల్ల కార్యనిర్వహణలో ఖర్చులు ఎక్కువయి నష్టం కనిపిస్తూంది.

యీ సొసైటీ తరఫుననే కార్ఖానా పెట్టి బెల్లం వండే పెనములు వగైరాలు చేయించి మెంబర్లకు పంచుతూ వుంటారు. పూర్తిగా యీ పరిశ్రమ మద్యపాననిషేధం వచ్చిన పిమ్మట ఎక్కువ అభివృద్ధిచేయవలసి యున్నది.



గ్రంథ పరిచయం

ఆంధ్రకవి తరంగిణి

(రెండవ సంపుటము)

రచయిత: శ్రీ చాగంటి శేషయ్య, హిందూ ధర్మశాస్త్ర గ్రంథనిలయము, కపిలేశ్వరపురం, తూర్పుగోదావరిజిల్లా. వెల రూ. 3-0-0.

పూర్వ ఆంధ్రకవుల జీవితచరిత్రలు చాలవరకు మనకు సమగ్రంగా తెలియవు. యథార్థచరిత్రలు తెలియకపోగా కల్పితగాథలు, పుక్కిటి పురాణాలూ ఎన్నో ప్రచారంలో ఉంటున్నవి. వీటిలో అనేకము నిజమైనవి కావని పరిశోధకులు నిరూపించారు. కొందరు కవుల చరిత్రలు ఇంకా పరిశోధించవలసే ఉన్నవి. కవిచరిత్రలను వ్రాయటం రచయితలందరికీ సాధ్యమైనది కాదు. చారిత్రక విజ్ఞానమును, చారిత్రకదృష్టీ ఉండి తీరాలి ఆయా కవుల రచనలను చక్కగా అవగాహన చేసికొనగల పాండిత్యం ఉండాలి. ఓపికతో సమకూర్చిన విషయాలను ఆమూలాగ్రం హేతువంతమైన విమర్శనాదృష్టితో పరిశీలించగల నేర్పు ఉండాలి. రసవంతంగాను, సజీవంగాను వ్యక్తపరచే శక్తి ఉండాలి. ఇవన్నీ ఉన్న రచయితలు తప్ప సారస్వతచరిత్రరచనను ఉచితమైన విధంగా నిర్వహించలేరు. ఆంధ్రకవి తరంగిణిని చదివినవారికి గ్రంథకర్త చాలవరకు అన్ని అంశములలోను కృతకృత్యుడైనాడని తోచకతప్పదు. ఈ రెండవ సంపుటంలో జయదేవకవి, వాదీంద్ర చూడామణి, కేచన, ఉదయాదిత్యుడు, గోకర్ణుడు, శ్రీపతిపండితుడు, దేసటి పండడు, మల్లికార్జున పండితారాధ్యులు, రుద్రదేవమహారాజు మొదలైన కవులను వీలయినంత విపులంగా పరిచయం చేశారు. వీరిలో చాలవరకు పాఠకులలో అధికసంఖ్యాకులు వినని వారే. ఈ సంపుటంలో సమగ్రంగా వివరించబడిన కవులు మంత్రి భాస్కరుడు, తిక్కన సోమయాజి. ఇటీవల పరిశోధనవల్ల తేలిన అనేకవిషయాలు ఇక్కడ చేర్చటమయింది. ఆంధ్రసారస్వత చరిత్రను తెలిసికోటానికి ఈ పుస్తకం ఎంతో అనువుగా ఉన్నదని చెప్పవచ్చు.

* * *

'గాంధి చరిత్రము'

రచయిత: శ్రీ కోమాండూరి శఠగోపాచార్యులు, ఆంధ్రరాష్ట్రహిందీప్రచారసంఘం, బెజవాడ. వెల రూ. 2 4-0.

గాంధీమహాత్మునిగురించి వెలువడిన పుస్తకాలు మనదేశంలో మరే వ్యక్తినిగురించి వెలువడలేదు. ఆయన అభినవ భారతదేశానికి పితృతుల్యుడు కావటమే ఇందుకు కారణం. జనబాహుళ్యాన్ని వివిధరంగాలలో ఇంతగా ఉత్తేజింపచేసిన నాయకుడు మరొకడు లేడు. జాతీయ నాయకుల చరిత్రలు వ్రాయటంలో అనుభవం గడించినవాడు గ్రంథకర్త. ఈ మూడవ ముద్రణాన్ని ఆంధ్రరాష్ట్రహిందీప్రచారసంఘంవారి స్వాధ్యాయ గ్రంథమాలకు ప్రథమ పుష్పంగా ప్రచురించారు. మహాత్ముడి జననం మొదలు నిర్యాణంవరకు దేశచరిత్ర అయిన ఆ మహాపురుషుడి జీవితచరిత్రను సమగ్రంగా ఆసక్తితో చదివించగలరీతిలో రచన జరిగింది. దేశంలో సంభవించిన పరిణామాలుకూడ సూచించబడినవి.

* * *

'ఈశ్వర; ఆ అమ్మాయి; తెగని ప్రశ్న'

రచన: శ్రీ పాపినేని ఈశ్వర, రమా గ్రంథమాల, విజయవాడ. వెల: ఒక్కొక్క పుస్తకం రూ 1-0-0.

వీటిలో మొదటిది ఖండకావ్యం. అప్పుడప్పుడు వ్రాసిన భావగీతాల సంపుటం ఇది. ఈ రచయితకు ఒక విధంగా ఆదర్శమైనవాళ్ళు, ప్రోత్సాహాని మిచ్చినవాళ్ళు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ నాయని సుబ్బారావుగారలు. సత్యనారాయణగారు ఈ పుస్తకానికి పీఠికకూడ వ్రాశారు. వీరి ఉభయుల రచనా విధానాలు ఈ పద్యాలలో చాలవరకు గోచరిస్తున్నవి. ఈయనది ప్రణయకవిత్వం కాదు; జ్ఞానకవిత్వం భక్తి దీనికి కథావస్తువు. పద్యరచన సరళంగాను ఉద్వేగవంతంగాను ఉన్నది.

'ఆ అమ్మాయి', 'తెగని ప్రశ్న' నవలలు. మొదటి ఖండకావ్యం చదివి వీటిని చదవగానే ఆశ్చర్యమవుతుంది. గ్రంథకర్త ఒక్కడేనా? అనిపిస్తుంది. ఉత్తరదక్షిణాల వ్యత్యాసం ఉన్నది. పద్యాలు భగవంతుడి విషయమై తే నవలలు వేశ్యలనుగురించి. ఈ రెంటిలో దేనిలో రచయితకు అనుభవం ఉన్నదో, దేనిని ఊహించి వ్రాశాడో తెలుసుకోదగిన విషయం. పడుపువృత్తిలో వారి లోతుపాతులు విపులంగాను, సూక్ష్మంగాను వివరించబడినవి. సంఘసంస్కరణకోసం ఈ నవలలు ఉద్దేశించబడ్డట్లు కనబడుతుంది. ప్రతి అనర్థానికి సినిమాలను దూషించే వారిలో రచయిత ఒకడు. కథలోగాని, పాత్రవ్యక్తీకరించటంలో గాని ఆశించే ప్రాశస్త్యం గోచరించదు. శైలిమాత్రం చక్కగానే ఉన్నది.

'రవి'

జనమేజయుడు

(10వ పేజీ తరువాయి)

'వద్వంశ బ్రాహ్మణము' నను, 'పౌరాణికయాగ' మని 'మహాభారతము'నను జెప్పబడిన యజ్ఞమునందు, పై నాగులను యజ్ఞపశువులను పేరితో వధించి హోమమొనర్చెను. ఇట్టి దారుణనరహత్యలు కొందరిప్రభుత్వమున జరుగుచుండుట, బ్రిటిష్‌వారు యిరువదేండ్లనాడు భగత్సింగ్, శుకదేవు, రాజగురు అనువారలను రావినదీతీరమున జంపుటయు నేడు గ్రీసుదేశమునందు కమ్యూనిష్టులను, గత సంవత్సరము జర్మనీ యందు ప్రసిద్ధికెక్కిన రిబ్బన్ ట్రాఫ్, గోరింగ్ మొదలగువారిని ప్రభుత్వచతుష్టయము (అమెరికా, బ్రిటన్, ఫ్రాంసు, రష్యా) వధించుటయు, ననుకారణముచే తెలిసికొనగలము. జనమేజయుని యీ కార్యమునకు తోడ్పడిన చండభార్గవాది ఋత్విక్కుల నామములు మహాభారతమున జెప్పబడియే యున్నవి. కాని యీ హత్యలు నేటి గాంధీమహాత్ముని వలెనే, నాటి ఆస్తీకాది మహామునులును, అసహ్యించుకొని సాధువృత్తిచేత నేతన్నివారణములం జేసిరి. ఇపుడు కొన్ని స్థలములయందు అన్యోన్యవర్ణ సాంకర్యము గలిగిన నాయకుల వలెనే నాడును, నాగ, నాగేతర జాతులకు సంపర్కము గలిగి ఉత్తమపురుషులును మహావీరులును కలుగుచుండినటుల, "ఆస్తీక, సోమశ్రవశాది" ఋషుల చరిత్రముల వలనను, అర్జునునకును ఉలూపి అను నాగకన్యకకునూ జనించిన, ఇలావంతుడను మహావీరుని చరిత్రమువలనను[4] తెలియగలదు. జనమేజయమహారాజు సర్పయాగమును ఆస్తీకుని ప్రార్థనమువలనను సదస్యులగు మహర్షుల ప్రోత్సాహమువలను మాని వృద్ధుడైన వాసుకికే తక్షశిలానగరము నప్పగించి, హస్తిపురికి విజయధ్వనులతో వచ్చెను. (భారతమును వైశంపాయనుని వలన జనమేజయుడు వినిన యంశము ముందు వ్రాయబడును.) [సశేషం]

---

4. సోమశ్రవసుడు, సుతశ్రవుడు అను ఋషికిని, నాగకన్యకకును పుట్టిన ఋషియై, దాతయై జనమేజయునకు పురోహితుడైనట్లును, ఆస్తీకుడు, జరత్కారు డను ఋషికిని, వాసుకి చెల్లెలగు జరత్కారు యను స్త్రీకిని జన్మించి, జనమేజయసర్పయాగమునకు వచ్చిన మహామునుల మెప్పు నొంది సర్పయాగమును నివారించినటులను, ఇలావంతుడు, మహాభారతయుద్ధమున శకునిసోదరుల నార్వురను వధించిన మహావీరుడైనట్లును, మహాభారతమున గలదు.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు

క్రొత్త రైల్వేమార్గము

ఒరిస్సా, సి. పి., బీహార్‌ల సరిహద్దులం కలయుప్రాంతము కొండలమయము; ఖనిజ సంపదకు ప్రసిద్ధికెక్కినది. మన దేశములోని బొగ్గుగనులలో ఎక్కువభాగము ఈ ప్రాంతములోనే వున్నవి. ఇతర ఖనిజములుకూడ చాల కలవని తెలియుచుగాని వానినిగూర్చి పరిశోధన ఇప్పటివరకు పూర్తికాలేదు. ఈ ప్రాంతమంతయు కొండలమయమగుటచే రాకపోకలు, రవాణా చాల కష్టము. ఇచ్చటి బొగ్గుగనులలోని బొగ్గు తూర్పిండియా రైల్వేపై సైలీసుండాను, బెంగాల్ నాగపూర్ రైల్వేపై బిలాసపూర్ గుండాను రవాణా యగుచున్నది. ఈ మార్గములు చాల చుట్టు. అందువలన అనవసర కాలహరణమేగాక, బొంబాయి-కలకత్తా, ఢిల్లీ-కలకత్తా, రహదారులపై ఎక్కువ కాలమును వినియోగించుకొనుచు ఇతర అత్యవసర రవాణాకు ఆటంకముగ నున్నది. ఈ బొగ్గుగనుల ప్రాంతముగుండా, దుర్గమములైన కొండలను భేదించియైనాసరే, రైలుమార్గము నిర్మింపబడినచో ఈ రవాణా త్వరగా జరుగుట, ఇతర రవాణాకు, అటంకముగా నుండకుండు ఎయేగాక, ఈ ప్రాంతములోని ఖనిజసంపదను వినియోగపరచుకొనుటకు అనేకపరిశ్రమలను స్థాపించుటకుగూడ గొప్ప దోహదము చేయగలదు. తూర్పుఇండియా రైలుమార్గముపై నున్న బాల్‌వాడీ (బీహార్)నుండి బెంగాల్ నాగపూర్ రైలుమార్గములో నున్న బిజూరీ (సి. పి.) వరకు ఒక క్రొత్త రైలుమార్గమును నిర్మించుటకు ఇప్పుడు నిశ్చయింపబడినది. ఈ రైలుమార్గము పైజెప్పిన కొండప్రాంతములగుండానే పోవును. ఈ కొండప్రాంతము దాదాపు 300 మైళ్ళు పొడుగు, 150 మైళ్లు వెడల్పు గల్గియుండి, సి. పి., బీహార్, ఒరిస్సా రాష్ట్రములలో నుండును. ఈ క్రొత్త రైలుమార్గమును తూర్పు ఇండియా రైల్వే నిర్వహించును రైల్వేలైను నిర్మాణమునకు దాదాపు 10 కోట్ల రూపాయిలు ఖర్చగునని అంచనా వేయబడినది. ఈ క్రొత్త మార్గము ద్వారా తూర్పుయిండియా, బెంగాల్ నాగపూర్, గ్రేట్ పెనిన్‌స్యులార్ రైలుమార్గములు ఒకదానితోనొకటి కలసికొనును.

ఈ కొండప్రాంతములో హుతార్, తాతాపాలీ, జిల్‌మిలి, బిశ్రమ్‌పూర్, సోన్‌హాట్, ఖురాసియా, చిరిమిరి మొదలగు బొగ్గుగనులున్నవి ఇప్పుడు నిర్మింపబడు రైలుమార్గమునకు రెండుప్రక్కల 25-30 మైళ్ళ దూరములో ఈ గనులున్నవి కాబట్టి 'మెయిన్ లైన్'నుండి ఈ గనులవరకు 'బ్రాంచిలైన్'లు అనేకములు నిర్మించెదరు. 'మెయిన్ లైన్' పొడవు దాదాపు 300 మైళ్లు వుండునుగాని, 'బ్రాంచిలైన్'లన్నిటి పొడుగు దాదాపు 600 మైళ్ళవరకు వుండునని భావించబడుచున్నది

బారావాడి-బిజూరి రైలుమార్గము చాల కొండలమీదుగాను, కొండలమధ్యలోయల గుండాను చాల మలుపులు తిరుగుచు పోవలసియుండును. ఈ లైను పొడుగులో నూటికి 34 వంతులు మలుపులేనట! ఇన్ని మలుపులుండుట వలన మార్గనిర్మాణము నెమ్మదిగా జరుగును. ఎక్కువ సొమ్ము ఖర్చగును. బారావాడి సముద్రమట్టమునకు 960 అడుగులు ఎత్తున నున్నది. ఈ రైలుమార్గము కొన్నిచోట్ల సముద్రమట్టమునకు 2,247 అడుగుల ఎత్తునకూడ వుండును.

ఈ క్రొత్త రైలుమార్గము నిర్మాణముకూడ అప్పుడే ప్రారంభమైనది. బారావాడినుంచి సి. పి లోని సారనదివరకు 40 మైళ్ళ పొడుగు రైలుమార్గము ఇంతవరకు నిర్మింపబడినది. ఈ మార్గము నిర్మించవలసిన త్రోవ ప్లాను ఇంకా పూర్తికానే కాలేదు. అయినా అప్పుడే పని ప్రారంభమై, 40 మైళ్లు రైల్వేలైను నిర్మాణం పూర్తిఅయింది. ఈ 40 మైళ్ళ దూరంలోనే 200 చిన్నచిన్న వంతెనలు, 8 పెద్ద వంతెనలు కట్టవలసివచ్చినది. మొత్తం 300 మైళ్ళ మార్గము పూర్తిఅయేటప్పటికి ఎన్నివంతెనలు కట్టవలసివచ్చునో తెలియదు. ఇంత వ్యయప్రయాసల కోర్చి నిర్మింపబడుతున్న ఈ రైలుమార్గము మన పరిశ్రమాభివృద్ధికి ఎంతో దోహదము చేయునని ఆశింపబడుచున్నది.

ఒక క్రొత్తసమస్య

యుద్ధము వలన కేవలము ఆర్థిక, రాజకీయ సమస్యలే గాక జటిలమగు సామాజిక సమస్యలనేకములుకూడ పుట్టుకువచ్చును. యుద్ధానంతర జర్మనీ యుద్ధకాలపు జర్మనీకన్నకూడ ఎక్కువ బాధాకరముగ నున్నదని మిత్రరాజ్యము లిప్పుడిప్పుడే గ్రహించుచున్నవి. కాని ఇంతవరకు ఆక్రమిత జర్మనీలో ఎదుర్కొనుచున్నది కేవలము రాజకీయ, ఆర్థికసమస్యలే. రాజకీయముగ జర్మనీ రెండుగా విభజింపబడిపోయినట్లు స్పష్టపడుచున్నది. ఆక్రమణసైన్యముల పోషణకు, జర్మన్ ప్రజల పోషణకు ఆక్రమణరాజ్యములు విపరీతముగ సొమ్ము ఖర్చుచేయవలసివస్తున్నది. జర్మనీలో ధనోల్బణముకూడ ఒక పెద్దసమస్యగా పరిణమించినది. ఇవన్నియు గాక వేరొక పెద్ద సమస్య ఇప్పుడు తల యెత్తుచున్నది.

యుద్ధకాలములో దాదాపు జర్మనీయువకులందరు సైన్యములో, ఏదో ఒక శాఖలో జేరిపోయిరి. చాలమంది నిహతులైరి; అనేకులు, పూర్తిగా, శాశ్వతముగా అంగవైకల్యము నొందిరి; దాదాపు 30 లక్షలమంది ఇంకను విదేశములలో ఖైదీలుగా ఉంచుకొనబడి, వెట్టిచాకరీ చేయుచున్నారు. యుద్ధమునకు పూర్వమే జర్మనీలో పురుషుల సంఖ్యకన్న స్త్రీల సంఖ్య దాదాపు 20 లక్షలు హెచ్చు. ఇప్పుడు పురుషులకన్న స్త్రీలు దాదాపు 70 లక్షలమంది ఎక్కువ వున్నారు. అంటే జర్మనీలో వున్న ముగ్గురు స్త్రీలలోను ఒకతె అవివాహితగావుండి పోవలసి వస్తున్నదన్నమాట! ఇంతమంది స్త్రీలు ఎప్పుడూ అవివాహితలుగా వుండలేరు కాబట్టి అనేకదారుణాలు జరుగవలసివస్తుంది. విదేశాలలో ఇంకనూ నిర్బంధంలోవున్న దాదాపు 30 లక్షలమందిని విడుదలచేసి, వారి ఇండ్లకు పంపించివేస్తే, అనేకకుటుంబాలు తిరిగి ఏర్పడటానికి, చాలమందియువతులు పెండ్లిండ్లు చేసుకోటానికీ వీలవుతుంది. కాని యూరప్ రాజ్యాలు వీరిని ఇప్పట్లో విడుదల చేసేటట్లు కనిపించటంలేదు.

స్త్రీజనవిస్తారత ఇంత యెక్కువగా వుండటం ఆక్రమితరాజ్యాల దృష్ట్యాకూడా ఏమంత మంచిది కాదు. కొన్నియేండ్లుగా యుద్ధంలో పనిచేసి, ఇప్పటికీ స్వగృహాలకు చేరని సైనికులను జర్మన్ యువతులు తేలికగానే ఆకర్షించి వేయగలరు. జర్మనీలో నున్న అమెరికన్ సైనికులకు వారి వారి ఇండ్లవద్దనుండి పంపబడినవస్తువులు, బహుమతులు జర్మన్ యువతుల చేతులలోనికి మారిపోయి, అటుపైన బజార్లలో అమ్మకానికి వచ్చి, బ్లాక్‌మార్కెట్‌ను పోషిస్తున్నాయి. అమెరికన్ మిలిటరీప్రభుత్వము అమలుజరుపుచున్న కంట్రోలులను ఈవస్తువులే భగ్నపరుస్తున్నవి. సిగరెట్లు, సిల్కు మేజోళ్లు మొదలైనవి ఈరకపు వస్తువులు.

జర్మనీనుండి ఆక్రమణరాజ్యాలు వెడలిగి, విదేశాలనుండి జర్మన్‌లందరు తిరిగివచ్చినతరువాతకూడా స్త్రీజనవిస్తారత ఆందోళన కరముగానే వుంటుంది. చాలమందియువతులు అవివాహితలుగా వుండిపోవలసివస్తుంది; చాలమంది యువకులు ఇద్దరు, ముగ్గురు భార్యలను స్వీకరించవలసివస్తుంది. కొంతమంది స్త్రీలు, తమకు ఇష్టము లేకపోయినా, వికలాంగులనే పెండ్లిచూడవలసివస్తుంది. మరికొందరు స్త్రీలు నేరుగా వ్యభిచారమే ప్రారంభించవలసివస్తుంది. మొత్తంమీద ఈ సాంఘికసమస్య ఇతర అన్నిసమస్యలకన్న భయావహముగను, కరుణపూరితముగను వున్నది.

కాందిశీకులకు స్థిరనివాసపు ఏర్పాట్లు

పశ్చిమ పాకిస్థాన్‌నుండి వచ్చివేసిన కాందిశీకుల సంఖ్య దాదాపు 45 లక్షలవరకు వుండునని ఇప్పటి అంచనాలవలన తెలుస్తున్నది. ఇంకను రావలసినవారు ఒక లక్షకు మించియుండరు. వీరందరికి స్థిరనివాసపు ఏర్పాట్లు ఒకమారుగ చేయుట కష్టమేగాని వీరిలో ఏ కొద్దిమందికి తినతిండి, కట్టబట్ట, నివసించగృహము లేకపోయినను అది పెద్ద ఆందోళనకు కారణము కాగలదు. తమ సర్వస్వము కోల్పోయి కట్టబట్టలతో వచ్చివేసినవారికి అన్నిసౌకర్యములు కలిపించుట మన విధి. ఇన్నాళ్లనుండి కాందిశీకుల సమస్యయే భారత ప్రభుత్వ ప్రధాన సమస్యగా పరిగణింపబడుచున్నది. పశ్చిమ పంజాబ్‌నుండి వచ్చివేసిన ముస్లిమేతర కాందిశీకుల కందరికి పునరావాసపు ఏర్పాట్లు తూర్పుపంజాబ్ ప్రభుత్వము, సరిహద్దు, సింధురాష్ట్రములనుండి వచ్చిన కాందిశీకులకు పునరావాసపు ఏర్పాట్లు కేంద్రప్రభుత్వము చేయవలెనని మొదట్లో నిర్ణయింపబడెను. తూర్పుపంజాబ్‌లో ముస్లింలు ఖాళీచేసివెళ్లిన భూములను పశ్చిమ పంజాబ్ నుండి వచ్చిన రైతులకు పంచి యిచ్చుట చాలవరకు పూర్తిఅయినది. ఈ కార్యక్రమ నిర్వహణలో అనేక లోటుపాట్లు బయలుపడెను. కొందరు కాందిశీకులు రెండు మూడు చోట్ల భూములు సంపాదించిరి; ఒకే కుటుంబములోని వ్యక్తులను ఒకే గ్రామములో భిన్నభిన్న కుటుంబములవారివలె పరిగణించి భూములు యిచ్చిరి; అసలు రైతులు కానివారికి కూడ భూములు యిచ్చిరి. భూములు యివ్వబడిన కాందిశీకులు కొందరు వాటి నమ్మజూపుచున్నారు. మరికొందరు ఇంతవరకు వాటి వంకనే చూడలేదు. ఈ అవకతవకలవలన చాల భూమి సాగుచేయబడక, బంజరుగా వుండిపోయినది. అప్పటితో ఈ విధానమును సంస్కరించి, దున్నెడువారికే భూమి యిచ్చుచున్నారు. బీదవారు వ్యవసాయపు పనిముట్లు, గొడ్లు, విత్తనములు కొనుక్కొనుటకు ధనసహాయము చేయుచున్నారు. ఈ కృషిఅంతయు తూర్పుపంజాబ్ ప్రభుత్వమే నిర్వహించుచున్నది.

పట్టణవాసమున కలవడిన కాందిశీకులకు, కార్మికులకు, సాంకేతిక నిపుణులకు వారిదివరకు అనుసరించిన వృత్తులలో, వీలైనంతవరకు, పునరావాస మేర్పాటుచేసిరి. ఇప్పటి కింకను కొన్ని లక్షలమంది కాందిశీకులు కాందిశీక శిబిరములలోనే వున్నారు. వీటిలో కెల్ల పెద్ద శిబిరము కురుక్షేత్రశిబిరము. ఇచ్చట దాదాపు 2 లక్షలమంది కాందిశీకు లున్నారు. వీరు సరిహద్దు రాష్ట్రమునకు చెందినవారు. వీరికి మధ్యభారత సంస్థానములగు ఆళ్వార్, భరతపూర్ సంస్థానములలో పునరావాసపు ఏర్పాట్లు చేయబడెను. కాని సరిహద్దురాష్ట్రములో వీరు అలవాటుపడియున్న శీతోష్ణపరిస్థితులకు ఇచ్చటి శీతోష్ణ పరిస్థితులకు ఎక్కడా పోలికలేదు. అందువలన ఆ సంస్థానములలోనికి పోయి తాము జీవింపజాలమనీ, తూర్పుపంజాబ్, యు. పి. రాష్ట్రములలోనే తమకు స్థిరనివాసము లేర్పాటుచెయమనీ వీరు కోరినారు. కాని ఇదివరకే నిర్ణయింపబడిన ప్లానును మార్చుటకు భారతప్రభుత్వ మంగీకరించలేదు. ఆళ్వార్, భరతపూర్‌లు వెళ్లుటకు కాందిశీకులు నిరాకరించిరి. అదినివేళ ప్రభుత్వములో కాందిశీక శాఖమంత్రి శ్రీ మోహన్‌లాల్ సక్సేనాగారు స్వయముగా కురుక్షేత్రము వెళ్ళి, సాధకబాధకములను వారికి వివరించి చెప్పి ఒప్పించగల్గిరి.

కురుక్షేత్ర శిబిరముగాక తూర్పుపంజాబ్‌లో జిల్లా కొకటి చొప్పున పెద్దపెద్ద కాందిశీక శిబిరము లున్నవి. వీనిలో కర్నల్, రోహటక్, ఫిరోజ్‌పూర్ శిబిరములు పెద్దవి. ఈ శిబిరములన్నిటిలోను అన్ని సౌకర్యములు ఉచితముగా లభించుటవలన కాందిశీకులలో సోమరితనము ప్రబలిపోతున్నది. ప్రతి చిన్న విషయమునకు తగాదాలు పెట్టుకొనుట, శిబిరనిబంధనల నుల్లంఘించుట, నిరాహార దీక్షలు ప్రారంభించుట జరుగుచున్నవి. వీలైనంత త్వరలో వీరి శాశ్వతపు ఏర్పాట్లు జరిపి, ఎవరి జీవనవృత్తి వారు సంపాదించుకొనునట్లు చేయగల్గినచో భారత ప్రభుత్వ బాధ్యత తీరిపోవును. పైగా ఇప్పటివరకు వీరు గుడారములలో నివసించుచున్నారు. మొదట్లో చిన్నచిన్న గుడారములు నిర్మించినారు. వేసవికాలము బాదిరి, వేడిగాలి ప్రారంభించినతర్వాత పెద్దగుడారములు వేయవలసివచ్చినది. ఇక త్వరలోనే వర్షాకాలము రానున్నది. పైనుండి వాన కురియునను భయమేగాక, నదులు పొంగి వచ్చి గుడారముల నూడ్చివేయునను భయముకూడ కలదు. కాబట్టి త్వరగా ఇళ్లు కట్టి ఈ శిబిరములలోని వారినందరినీ అక్కడికి పంపివేయవలసియున్నది. ఇందుకొరకు తూర్పుపంజాబ్‌లో పలుతావులలో చిన్నచిన్న బస్తీలు నిర్మించవలెనని ఇప్పుడాలోచించుచున్నారు. ఈ బస్తీలలో నివేశనస్థలమంతియు ముందుగా ప్రభుత్వమే వశపరచుకుని, ప్లాట్లు వేసి, కాందిశీకులకు అమ్మును. భాగ్యవంతులగువారు తమ నివేశన స్థలమునకు సొమ్ము యిచ్చుకొని, ఇల్లు కట్టుకొనుటకు తగు ఏర్పాట్లు తామే చేసుకొనవలెను. మధ్యతరగతివారికి ఇల్లు కట్టుకొనుటకు కొంత ధనసహాయము చేయబడును. బీదలకు ఇండ్లు కట్టియిచ్చుటకు ఒక గృహనిర్మాణ సంస్థ ఏర్పాటుచేయబడినది. కాందిశీకులు గానివారెవ్వరైనను క్రొత్తగా ఇల్లు కట్టదలచినచో ఆ క్రొత్తయింటిని ప్రభుత్వమునకు అద్దెకు యిచ్చు షరతుపైననే దానికి కావలసిన సామగ్రి సరఫరా చేయుదురు. ఈ స్కీము త్వరలోనే అమలుజరుపబడనున్నది. ఇది ఎంత ప్రయోజనకారిగా నుండునో చూడవలసియున్నది.

ఇదివరకు ఉద్యోగములలో వుండిన కాందిశీకులకు, ఈ దేశములో తగిన ఉద్యోగములు వెదకిపెట్టు భారము ఉద్యోగనిర్ణయ, సలహా ఆఫీసులపై వేయబడినది. ఈ ఆఫీసులలో చాలమంది పేర్లు 'నమోదు' చేసుకొనబడెను. కాని వీరిలో నాలుగవవంతుమందికి మాత్రమే ఇంతవరకు ఉద్యోగములు దొరికినవి. కొంతమందికి ఆయా వృత్తులలో శిక్షణ యిచ్చుటకు శిక్షణ కేంద్రము స్థాపించిరి. ఏమైనను వీరందరికి ఉద్యోగములు దొరకునప్పటికి చాలకాలము గడచును.

పశ్చిమపంజాబ్, సరిహద్దురాష్ట్రములనుండి తూర్పుపంజాబ్, ఢిల్లీ, యు. పి., లకు వచ్చిన కాందిశీకులేగాక సింధునుండి బొంబాయి వచ్చిన కాందిశీకులు కూడ అనేక కష్టముల పాలగుచున్నారు. బొంబాయినగర పరిసరములలో నాలుగైదు కాందిశీకశిబిరము లున్నవి. ఇచ్చట వీరికి పూర్తివసతులు లేవు. వీరికి పునరావాసపు ఏర్పాట్లు కేంద్రప్రభుత్వసహకారముతో, బొంబాయిప్రభుత్వము జరుపుచున్నది. గత వర్షాకాలము, శీతాకాలము కాందిశీకులు మిక్కిలి బాధపడిరి. ఈ సంవత్సరమైనను వారు తిరిగి అట్టి బాధపడ నవుసరములేకుండ తగు ఏర్పాట్లు చేయబడును నని ఆశింపవచ్చును.

యుగసంధి

(19 వ పేజీ తరువాయి)

బాధపడుతూనే ఉన్నాడు, కాని బజరోవ్ సహాయాన్ని మాత్రం కోరలేదు. "నాకు ఎందుకు కబురుచెయ్యలేదు?" అని మరునాడు బజరోవ్ అడిగినప్పుడు, ఇంకా తేరుకోక పోయినా, మెత్తగా గీసిన గడ్డం, నున్నగా దువ్విన జుట్టూ చేత్తో తడుముకొంటూ, అతను సమాధానంగా చెప్పాడు, "ఏమీ, మీకు మందుల్లోకూడా నమ్మకం లేదని కన్నట్టు నాకు జ్ఞాపకం." రోజులు అల్లాగ గడిచిపోయాయి. బజరోవ్ తీవ్రతతో పట్టుదలతో పనిచేసుకుంటున్నాడు ...ఈలోగా అతను, తన హృదయాన్నంతనీ విప్పి చెప్పకోడానికి కాకపోయినా కులాసాగా మాట్లాడ్డానికి కుతూహలపడే వ్యక్తి ఒకతె ఉంది.. ఆ వ్యక్తి ఫెనీచ్కా.

సాధారణంగా ఉదయాన్నే తోటలోనో పచ్చికబయలిమీదో అతను ఆమెను కలుసుకుంటుండేవాడు. ఆమెను చూడ్డానికి ఆమె గదిలోకి మాత్రం అతను ఎప్పుడూ వెళ్ళలేదు. ఆమెకూడా ఒక్కసారే అతని గుమ్మందగ్గరకు వచ్చింది— మిట్యాకి ఆ రోజుని నీళ్లు పొయ్యవచ్చునో, కూడదో అడగడానికి. ఆమె అతనికి హృదయం విప్పిచెప్పుకుందనే కాదు, అతన్ని చూస్తే భయపడదనే కాదు—అతనితో మాట్లాడేటప్పుడు నికోలై పెట్రోవిచ్‌దగ్గరకంటే కూడా ఎక్కువ స్వేచ్ఛగా ఉంటుంది. అది ఎల్లా వచ్చిందో చెప్పడం కష్టం. బహుశా బజరోవ్‌లో ఆ ఉన్నతకుటుంబాలకు చెందిన ఛాయ లేవీ లేవనేమో. తన్ను ఆకర్షిస్తూ, అయినా భయంలో ముంచే ఆ ఔన్నత్యం అతనిలో లేదనేమో! ఆమె దృష్టిలో అతను సామాన్య మానవుడు, అద్భుతమయిన వైద్యుడున్నూ. అతను ఉన్నప్పుడు ఏ సంకోచమూ లేకుండా పిల్లవాణ్ణి లాలించేది. ఒకసారి ఆమెకు తలనొప్పి తలతిప్పు చటుకుని వచ్చాయి; అప్పుడు అతను ఒక చెమ్చాతో మందు తినిపిస్తే ఆమె తింది. నికోలై పెట్రోవిచ్ సాన్నిధ్యంలో ఆమె బజరోవ్‌కి దూరంగా ఉండేది. అందులో మోసగించాలనే ఉద్దేశం ఆమెకు ఏమీ లేదు. అది ఒక మర్యాద అని ఆమె అభిప్రాయం. పావెల్ పెట్రోవిచ్‌యెడల ఆమెకు మామూలుకంటే భయం యెక్కువయింది. అతడు ఆమెను పరీక్షగా చూడ్డంమొదలుపెట్టాడు. ఉన్నట్టుండి ఆమె వీపువెనకాల చటుకుని ప్రత్యక్షమయేవాడు—తన ఇంగ్లీషుదుస్తులలో, చురుకయిన ముఖంతో, జేబుల్లో చేతులుపెట్టుకుని. "చటుకుని మీదచన్నీళ్లు పోసినట్టుగా ఉంటుంది." అంది ఆమె దున్యాషాతో. దున్యాషా నిట్టూర్చింది. ఇంకో 'రాతిగుండె' మనిషిని గురించి ఆమె తలుచుకునేది. బజరోవ్ ఆమె హృదయాన్ని క్రూరంగా అపహరించాడు, అతనికి మాత్రం ఆ విషయమయి అనుమానమన్నా కలగలేదు.

ఫెనీచ్కాకి బజరోవ్ అంటే ఇష్టం. బజరోవ్‌కి కూడా ఆమె అంటే ఇష్టమే. ఆమెతో మాట్లాడేటప్పుడు అతని ముఖం పూర్తిగా మారిపోయేది. ముఖం వికసించేది, చనువును దాల్చేది. మామూలు నిర్లక్ష్యం పోయి, పరిహాసాత్మకమయిన శ్రద్ధ కనబరిచేవాడు. ఫెనీచ్కా రోజురోజూ మరీ చక్కగా తయారవుతోంది. ప్రతి యువతీ జీవితంలో ఒకానొక ఘట్టంలో వేసవిలో గులాబిమొగ్గలాగ పరిపూర్ణంగా వికసిస్తుంది. ఫెనీచ్కా ఆ ఘట్టంలో ఉంది. సున్నితమయిన తెల్లఒట్టలు ధరించి, ఆమె వాటికంటే తెల్లగా సున్నితంగా అగుపించేది. ఎండవల్ల ఆమె చర్మం రంగు మారలేదు. ఆచ్ఛాదన లేని ఆ ఎండలో ఆమె ముఖంమీదికీ, చెక్కిలమీదికీ వింత ఎరుపు పాకేది. ఒక మధురమయిన అలసత ఆమెవ్యక్తినించి ప్రసరించేది. స్వాప్నికమయిన అపురూపత ఆమెకళ్ళలో ప్రతిఫలించేది. పని చెయ్యడానికి ఆమెకు శక్తి చాలేదికాదు. అనుకోకుండానే ఆమె చేతులు ఒడిలోకి వాలిపోయేది. ఆమె అట్టే నడిచేదికాదు. ఎప్పుడూ నిట్టూరుస్తూ కూర్చునేది. తన నిస్సహాయతను హాస్యాత్మకంగా చాటేది.

"తరుచుగా స్నానానికి పోతుండాలి నువ్వు," అని చెప్పాడు నికోలై పెట్రోవిచ్. ఇంకా పూర్తిగా పూడిపోని ఒక కోనేటి చుట్టూ పూలపందిరి పాకించి స్నానాలకోసం తయారు చేయించాడు అతను.

"అబ్బ! నికోలై పెట్రోవిచ్! కోనేటిదగ్గరకు పోయేసరికి సగం ప్రాణాలు పోతాయి, మళ్ళీ తిరిగివచ్చేసరికి మళ్ళీ ప్రాణాలు పోతాయి తోటలో నీడ లేదుగా!"

"నిజమే. నీడలేదు," అన్నాడు నికోలై పెట్రోవిచ్, తన నుదుటిమీద చేత్తో రాసుకుంటూ.

ఒకనాడు ఉదయం ఏడుగంటలకు, తన షికారునించి తిరిగి వస్తూ బజరోవ్, పొదరింట్లో కూర్చున్న ఫెనీచ్కాని చూశాడు. పొదరిల్లు ఇప్పుడు పుయ్యడంలేదు. కాని పచ్చని ఆకులతో ఒత్తుగా ఉంది. ఒక తిన్నెమీద ఆమె కూర్చుని ఉంది. తెల్లని రుమాలు తలమీద వేసుకుంది. ఇంకా మంచుతడి ఆరని గులాబులు - ఎర్రనివీ తెల్లనివీ - ఆమె పక్కన పెద్ద గుట్టగా పోసి ఉన్నాయి. అతను ఆమెను పలకరించాడు.

"ఆహా! యవ్‌గనీ వాసిలిచ్! అంది ఆమె. తన నుదుటిమీది రుమాలు కొసపైకెత్తి అతన్ని చూసింది. అల్లా పైకి ఎత్తినప్పుడు ఆమెచేతిమీది ఆచ్ఛాదన తొలిగిపోయింది.

"ఏంచేస్తున్నావిక్కడ?"అన్నాడు బజరోవ్ ఆమె పక్కని కూర్చుంటూ, "అలంకారంకోసమా?"

"మరే. భోజనాల బల్లమీద పెట్టడానికి, నికోలై పెట్రోవిచ్‌కి ఇష్టం."

"కాని భోజనాలకు ఇంకా చాలా వ్యవధి ఉందిగా. అబ్బ! ఎన్ని పువ్వులు!"

"ఇప్పుడే కోశాను. పొద్దెక్కితే వేడిగా ఉంటుంది. ఇంక కదలడం కష్టం. ఇప్పుడే కాస్త ఊపిరి ఆడుతుంది. ఎండ ఎక్కువయినకొద్దీ నాకు నీరసం వస్తుంది. నేను మంచ మెక్కుతానేమోనని భయంగాకూడా ఉంది."

"ఏం మాట లవి! ఏదీ, నీ చెయ్యి చూడనియ్యి."

బజరోవ్ ఆమె చేతిని తీసుకుని నాడి చూశాడు. నాడి సమంగా కొడుతోంది. అతడు అ స్పందనం లెక్కపెట్టలేదుకూడా. "ఒక వంద సంవత్సరాలు జీవిస్తావు," అన్నాడు అతను చెయ్యి వదిలిపెడుతూ.

"అమ్మయ్యో! వద్దు బాబూ!" అంది ఆమె.

"ఏం? ఎక్కువకాలం బతకాలని లేదా?"

"అవుననుకో. కాని వందసంవత్సరాలే! మా పొరుగుని ఒక ముసలిస్త్రీ ఉంది. ఎనభయి అయిదు సంవత్సరాలు — అబ్బ! ఎంత బాధపడుతోందని! చెముడు, అసహ్యంగా ఉంటుంది. నడుం వంగిపోయింది. అస్తమానూ దగ్గుతుంటుంది. తనకి తనే బరువయిపోయింది. అది భరించరాని బ్రతుకు."

"అయితే యౌవనంలో ఉండిపోతే మంచిదా?"

"ఏం కాదా?"

"కాని, ఎంచేత మంచిదో చెప్పు."

"ఎంచేతని ఎల్లా అడుగుతున్నావు? నేనున్నాను. ఇల్లా చిన్నతనంలో నాఇష్టంవచ్చినవన్నీ నేను చెయ్యొచ్చు. ఇటూ అటూ తిరగొచ్చు. కావలిసినవి తెచ్చుకోవచ్చు. ఎవరినీ ఏదీ అడగ నక్కరలేదు ... ఇంతకంటే మంచి ఏమిటి?"

"నాకు మాత్రం పడుచుతనం ముసలితనం ఒకటే."

"ఒకటే అంటే -అర్థం ఏమిటి? నువ్వన్నది నిజం కాదు."

"సరే; నువ్వే ఆలోచించు, ఫెడోస్యా నికోలేవ్నా. నా పడుచుదనం నాకెందుకు? నేను ఒంటరిగా బతుకుతున్నాను, అసహాయంగా ఏకాంతంగా ..."

"అది నీమీద ఆధారపడి ఉంటుంది."

"నామీద ఏమీ ఆధారపడి ఉండదు. అథమం ఎవరన్నా నామీద జాలిదలచాలి."

ఫెనీచ్కా కనురెప్పల క్రిందనించి దీర్ఘంగా అతన్ని చూసింది. సమాధానంమాత్రం చెప్పలేదు. నీదగ్గర ఉన్న ఆ పుస్తకం ఏమిటి?" కొద్దిసేపు గడిచినతరువాత ఆమె అడిగింది.

"ఇదా? ఏదో శాస్త్రగ్రంథం. చాలా క్లిష్టంగా ఉంటుంది."

"ఇంకా చదువుతున్నావా? ఇంక విసుగెత్తదా? ఇప్పటికే అన్నీ తెలుసు ననుకొంటాను కనీ?"

"నా కంతా తెలియదు. ఏదీ కొద్దిగా చదువు చూస్తాను."

"కానీ నాకేమీ అర్థంకాదు. రష్యన్ భాషేనా?" అని అడిగింది ఫెనీచ్కా ఆ లావుపాటి పుస్తకాన్ని తీసుకుని, "అబ్బ ఎంత లావుంది."

"రష్యన్‌భాషే"

"అయినా నా కేమీ అర్థంకాదు."

"నీకు అర్థంకావాలని కాదు నీ చేతికి ఆ పుస్తకం ఇస్తా. నువ్వు చదువుతున్నప్పుడు నీ ముఖం చూడాలని ఉంది. నువ్వు చదువుతున్నప్పుడు నీ చిన్నిముక్కుకొస ముద్దుగా పైకీ కిందకీ కదులుతుంది."

ఫెనీచ్కా ఎక్కడో, తెరిచి 'క్రీసోట్' అనే వ్యాసాన్ని తడుముకుంటూ మెల్లగా చదవడానికి ప్రారంభించి వెంటనే పకపక నవ్వుతూ పుస్తకాన్ని కింద పడవేసింది. పుస్తకం తిన్నెమీంచి కిందకి పడిపోయింది.

"నువ్వు నవ్వుతున్నప్పుడుకూడా చాలా బాగుంటావు" అన్నాడు బజరోవ్.

"వట్టి అబద్ధం."

"నువ్వు మాట్లాడేటప్పుడూ బాగుంటావు. ఒక చిన్న సెలయేరు గలగల ప్రవహిస్తున్నట్టు ఉంటుంది."

ఫెనీచ్కా తల రెండోపక్కకి తిప్పుకుంది. "ఎంత ఎల్లా మాట్లాడతావు!" వేళ్ళతో పువ్వులు ఏరుతూ ఆమె అంది. "నేను మాట్లాడేది నీ కెల్లా నచ్చుతుంది? మంచి తెలివయిన ఆడవాళ్లతో మాట్లాడినవాడవు"

"ఫెడోస్యా నికోలేవ్నా, ఈ లోకంలో ఉన్న తెలివయిన ఆడవాళ్లందరూ కలిసినా నీ చిటికెన వేలు విలువ చెయ్యరు"

"చూడు, ఇంకో అబద్ధం!" చేతులుముడుచుకుని ఫెనీచ్కా అంది. బజరోవ్ నేలమీదినించి పుస్తకంతీశాడు.

"అది వైద్యగ్రంథం. ఎందుకది కింద పారేశావు?"

"వైద్యమా?" అంది ఫెనీచ్కా, అతనివేపు తిరిగింది, "నువ్వు ఆ చుక్కలేవో నా కిచ్చావే, అప్పటినించీ మిట్యా సుఖంగా నిద్రపోతున్నాడు —జ్ఞాపకముందా ఆ మందు? నీఋణం ఎల్లా తీర్చుకోవాలో నాకు తెలియదు. నిజంగా చాలా మంచివాడవు."

"అయితే, వైద్యులకు రుసుము చెల్లించాలి," అన్నాడు చిరునవ్వుతో బజరోవ్. "నీకు తెలుసుగా వైద్యులకు దాహం ఎక్కువ."

ఫెనీచ్కా కనురెప్పలు ఎత్తి చూసింది. ముఖంమీది తెల్లటి ఆచ్ఛాదనమూలాన్ని చూపులు నల్లగా కనబడ్డాయి. అతను హాస్యంగా అంటున్నాడో, నిజంగా అంటున్నాడో ఆమెకు తెలియలేదు.

"నీకు ఇష్టమయితే,...మేం చాలా సంతోషంగా......నికోలై పెట్రోవిచ్‌ని అడగాలి..."

"నాకు డబ్బు కావాలని ఎందుకు అనుకోవాలి?" బజరోవ్ అడిగాడు. "అబ్బే. నీదగ్గర డబ్బు తీసుకోను."

"ఇంకేం వాలి?" అని అడిగింది ఫెనీచ్కా.

"ఏమిటా?" అన్నాడు బజరోవ్. "చెప్పుకో."

"నేనూ చెప్పుకోగలదాన్ని?"

"అయితే నేనే చెపుతాను. నాకు కావలసింది...ఆ పువ్వులలో ఒకటి."

ఫెనీచ్కా మళ్లీ పకపక నవ్వింది. చప్పట్లుకూడా కొట్టింది. బజరోవ్ కోరిక అంత అసంబద్ధంగా ఆమెకు అగుపించింది. అయినా ఆమెకు లోలోపల ఎంతో సంతోషంగా ఉంది. బజరోవ్ ఆమెవేపు తీక్ష్ణంగా చూస్తున్నాడు.

"తప్పకుండా ఇస్తాను," అంది ఆమె చివరికి, ఆ తిన్నెమీద వంగి గులాబిపువ్వులు ఏరింది. "మీ కేదికావాలి, ఎరుపా, తెలుపా?"

"ఎరుపు. అట్టే పెద్దది అక్కరలేదు."

ఆమె మళ్లీ తిన్నగా కూర్చుంది, "ఇదిగో తీసుకో," అంది. కాని జాపిన చెయ్యి వెంటనే ఆమె వెనక్కి లాక్కుంది. పెదవులు పళ్లతో నొక్కిపట్టి పొదరింటివేపు చూసింది.

"ఏమిటది?" బజరోవ్ అడిగాడు, "నికోలై పెట్రోవిచ్చా?"

"కాదు...కిర్సనావ్ గారు పొలాల్లోకి వెళ్లారు.. అదీకాక ఆయన్ని చూస్తే నా కంత భయం లేదు......కాని పావెల్ పెట్రోవిచ్ గారు......అనిపించింది."

"ఏమిటి?"

"ఆయన ఇక్కడికి వస్తున్నట్టు అనిపించింది. లేదు, ఎవరూ లేరు. తీసుకో." ఫెనీచ్కా ఆ పువ్వు బజరోవ్‌కి ఇచ్చింది.

"ఎంచేత నీకు పావెల్ పెట్రోవిచ్ అంటే అంత భయం?"

"ఆయన ఎందుకో అదుటుకలిగిస్తాడు. ఆ పయిని ఆయన్ని చూస్తే నీకు,అయిష్టం. జ్ఞాపకం ఉంగా, అస్తమానం అతనితో దెబ్బలాడుతూ ఉండేవాడవు? దెబ్బలాటఎందుకో నాకుమాత్రం తెలిసేది కాదు. కాని నువ్వు ఆయన్ని ఇల్లా గిరగిరా తిప్పివేసేవాడవు."

బజరోవ్ ఎల్లా పావెల్ పెట్రోవిచ్‌ని తిప్పేవాడని ఆమె అనుకుంటోందో చేత్తో అభినయించి చూపించింది.

బజరోవ్ చిరునవ్వు నవ్వాడు. "ఒకవేళ అతను నన్ను చావకొట్టినట్టయితే," అతను అడిగాడు "నువ్వు నాపక్షం ఉంటావా?"

"నీపక్షాన్ని నిలబడి నేనేంచెయ్యగలను? అసలు నిన్నెవరూ గెలవలేరు."

"నువ్వల్లా అనుకున్నావా? తనకి ఆ అభిప్రాయం ఉంటే నన్ను గెలవగలిగిన వ్యక్తిని నేను ఎరుగుదును."

"ఎవరా వ్యక్తి?"

"నీకు నిజంగా తెలియదూ? చూడు నువ్వు ఇచ్చిన ఈ పువ్వు ఎంత చక్కగా వాసన వేస్తోందో."

ఫెనీచ్కా మెడ కొద్దిగావంచి, తనముఖాన్ని ఆ పువ్వుదగ్గరగా పెట్టింది....తలమీది రుమాలు భుజంమీదికి జారిపోయింది. నల్లటి మెరుస్తున్న ఆమెజుట్టు కొద్దిగా చెదిరిపోయి గుబురుగా ఉంది.

"ఆగు. నీతో కలిసి నేనుకూడా ఆ పువ్వు వాసనచూడాలి," అన్నాడు బజరోవ్. అతను ముందుకి వంగి ఆమె విడిన పెదవులను గాఢంగా ముద్దుపెట్టుకున్నాడు.


ఆమె జంకింది. రెండు చేతులు అతనిగుండెమీద వేసి వెనక్కి నెట్టింది. కాని మెల్లగా బలహీనంగా నెట్టింది. కాని అతను మళ్లీ దీర్ఘంగా ముద్దుపెట్టుకోగలిగాడు.

ఆ పొదరింటి పక్కనించి పెడిదగ్గు వినిపించింది. ఫెనీచ్కా చటుకుని తిన్నె రెండోకొసకు జరిగింది. పావెల్ పెట్రోవిచ్ లోపలికి వచ్చాడు. మర్యాదగా కొద్దిగా వంగాడు. ఈసు, విషాదం కలసిన గొంతుకలో, "ఇక్కడున్నావా?" అన్నాడు. ఫెనీచ్కా వెంటనే పువ్వులన్నీ తీసుకుని అవతలికి వెళ్లిపోతూ మెల్లగా బజరోవ్‌తో అంది," యవ్‌గనీ వాసిలీచ్, నువ్వు చేసిన పని తప్పు." ఆ గొంతుకలో హృదయపూర్వకమయిన మందలింపు ధ్వనించింది.


బజరోవ్‌కి కొద్ది రోజులక్రింద జరిగిన,ఇంకో సంఘటన జ్ఞప్తికి వచ్చింది. అతన్ని అవమానమూ, అసహనమూ ముంచెత్తాయి. కాని "చివరకి తను ఆ కులాసా పురుషుడయిన లోథారియో పాత్ర నిర్వహించినందుకు," తనను తనే అపహసించుకుంటూ, తల ఊపి తన గదికి వెళ్లిపోయాడు.

పావెల్ పెట్రోవిచ్ తోట దాటి చిట్టడవి దగ్గరకు గంభీరంగా నడిచి వెళ్లాడు. అక్కడ చాలా సేపు ఉన్నాడు. అతను భోజనానికి వచ్చినప్పుడు, నికోలై పెట్రోవిచ్ అతని ఆరోగ్యం సరిగ్గా ఉందా అని అతనివేపు చూసి అడిగాడు. అతని ముఖం అంత నీరసంగా అగుపించింది.

"నీకు తెలుసుగా, నా పసరుతిత్తి అప్పుడప్పుడు పాడవుతుంటుంది," పావెల్ పెట్రోవిచ్ ప్రశాంతంగా అన్నాడు.



షోలాపూర్, గుంటకల్ మధ్య ప్రయాణంచేస్తున్న రైళ్ళన్నిటిని ఈవిధంగా మిలిటరీ కాపలాతో నడుపుతున్నారు.



షోలాపూరు, గుంటకలుల మధ్య ప్రయాణముచేయుచున్న ఈ యిద్దరు రజాకార్లను, షోలాపూర్ సబ్ జైలులో ఉంచారు.




మద్రాసు పూనమల్లి హైరోడ్డులోని ప్రభుత్వ పునరుద్యోగశాఖ కార్యాలయాన్ని శ్రీ. వి. వి. గిరి గారు సందర్శించినప్పుడు తీసిన చిత్రం.


వా ర్తా చి త్రా లు




విజయనగరం మహారాణి శ్రీమతి విద్యావతి దేవి కేసరికన్య విద్యాలయమునకు ప్రారంభోత్సవమును జరపిరి



కేసరి కన్యావిద్యాలయ ప్రారంభోత్సవమునకు వచ్చిన స్త్రీలు.



తూ॥ గో॥ జిల్లా తునివద్ద "అటవి వారి సాలెం"లో అగ్రికల్చరల్ గవర్నమెంటువారి ట్రాక్టరుతో నరికేస్తూన్న దృశ్యం.



రాజమహేంద్రవరంలో శ్రీ దువ్వూరి చేనేత పారిశ్రామిక సంఘము" శంకుస్థాపనకొని శిలవేస్తున్న డా॥ శ్రీ కళా వెంకటరావుగారు

Regd. No M· 4479

Edited, Printed & Published by S. Sambhu Frasad, at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G. T. Madras.